2025-26లో దేశ పెట్టుబడుల్లో 25.3 శాతం వాటాతో ఏపీ అగ్రస్థానం సాధించడం పారిశ్రామిక ప్రగతికి నిదర్శనం. మంత్రి నారా లోకేశ్ చొరవతో అంతర్జాతీయ రోడ్‌షోలు, ప్రాంతీయ సదస్సుల ద్వారా రాష్ట్రవ్యాప్తంగా పెట్టుబడుల ఆకర్షణకు ప్రభుత్వం కృషి చేసింది.



ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్సీ

బుధవారం 18.11.2026

INK OF TRUTH

జర్నలిస్ట్ ఫైల్

తెలుగు దినపత్రిక

సంపుటి - 34 | సంచిక - 207 | www.journalistfile.com | పేజీలు 8 | వెల : రూ.5.00

ఏపీకి ఆర్థిక చేయూత నివ్వండి




న్యూఢిల్లీ, నవంబర్ 17 (జర్నలిస్ట్ ఫైల్) : రెండు భారీ తుఫాన్ల తాకిడితో పంటలు సహా వివిధ రంగాలకు భారీ నష్టం సంభవించిందని... రాష్ట్రానికి తక్షణ ఆర్థిక సాయాన్ని అందించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ను కోరారు. తన ఢిల్లీ పర్యటనలో భాగంగా సీఎం చంద్రబాబు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తో మంగళవారం భేటీ అ-య్యారు. ఈ భేటీలో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, ఇటీవల సంభవించిన వరుస తుఫాన్లు, హార్టికల్చర్ హబ్, పూర్వోదయ నిధులు విడుదల, ప్రాంతాల వారీగా అభివృద్ధి ప్రణాళికలు వంటి అంశాలపై కేంద్రమంత్రితో చర్చించారు. అలాగే విశాఖలో నిర్వహించిన భాగస్వామ్య సదస్సు, ఆ సదస్సు వేదికగా తీసుకున్న నిర్ణయాలపై ముఖ్యమంత్రి-కేంద్ర ఆర్థిక మంత్రి భేటీలో ప్రస్తావనకు వచ్చింది. ఈ భేటీ సందర్భంగా రాష్ట్రాన్ని ఇటీవల కాలంలో తాకిన ఆర్నబ్, మురసు తుఫాన్ల వల్ల కలిగిన నష్టం గురించి సీఎం చంద్రబాబు కేంద్ర ఆర్థిక మంత్రికి వివరించారు. ఈ రెండు తుఫాన్ల వల్ల ప్రాథమిక అంచనా ప్రకారమే సుమారు రూ. 7 వేల కోట్లకు పైగా నష్టం వాటిల్లినట్లు చెప్పారు. తుఫాన్ ముప్పు నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న చర్యలను సీఎం వివరించారు. చేతికందే పంట నీటి పాలైందని ముఖ్యమంత్రి వివరించారు. ఎల్ నినో ప్రభావం ఉన్నా... రైతులను గట్టెక్కించేందుకు పట్టిసీమ ద్వారా కొన్ని ప్రాంతాలకు సాగు నీరందించామని... కానీ తుఫాన్ల తాకిడితో పంటలు వేసుకున్న రైతులు తీవ్రంగా నష్టపోయారని చెప్పారు. దీంతో పాటు.. తీర ప్రాంతంలో మౌలిక వసతులు భారీ ఎత్తున దెబ్బతిన్నాయని... ముఖ్యంగా విద్యుత్ వ్యవస్థ ఎక్కువగా నష్టపోయిందని సీఎం చంద్రబాబు కేంద్ర మంత్రికి తెలిపారు. రాష్ట్రానికి తుఫాన్ల వల్ల కలిగిన ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని తక్షణ ఆర్థిక సాయం అందించాలని కోరారు. ఆర్నబ్, మురసు తుఫాన్ల వల్ల కలిగిన నష్టాన్ని అంచనా వేసేందుకు కేంద్ర బృందాలు రాష్ట్రంలో పర్యటించాయని... వారు కూడా వీలైనంత త్వరలో నివేదిక సమర్పిస్తాయని చెప్పారు. ప్రస్తుతం రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని తక్షణ సాయం అందించగలిగితే కొంత మేర ఆర్థిక వెసులుబాటు కలుగుతుందని సీఎం చంద్రబాబు వివరించారు.

ప్రాంతాల వారీగా అభివృద్ధి ప్రణాళికలు : కేంద్ర ఆర్థిక మంత్రితో జరిగిన భేటీలో రాష్ట్రంలో చేపడుతోన్న అభివృద్ధి ప్రణాళికల అంశం ప్రధానంగా చర్చకు వచ్చింది. విశాఖ, అమరావతి, తిరుపతి రీజియన్ల వారీగా ఆర్థికాభివృద్ధికి ప్రణాళికలు చేపట్టినట్టు సీఎం తెలిపారు. దీంట్లో భాగంగా రాయలసీమ హార్టికల్చర్ హబ్ కు ఇప్పటికే కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ శంకుస్థాపన చేసిన **మిగతా 2లో...**

- **వరుస తుపాన్ల నష్టాల నుంచి కోలుకునేందుకు తక్షణ సాయం**
- **రాయలసీమ హార్టికల్చర్ హబ్‌కు నిధుల విడుదల**
- **విశాఖ ఆర్థిక ప్రాంతానికి మరిన్ని ప్రోత్సాహకాలు**
- **పూర్వోదయ నిధులపైనా సీఎం చంద్రబాబు చర్చ**



పోటీకి స్వస్తి.. సహకారానికి శ్రీకారం



- **ప్రపంచ భవిష్యత్తుకు పరస్పర భాగస్వామ్యమే బలమన్న మోదీ**
- **ప్రపంచ జనాభాలో నాలుగో వంతుకు భారత్-ఆసియాన్ ప్రాతినిధ్యం**
- **శాంతి, స్థిరత్వం, సమృద్ధి అభివృద్ధికి పిలుపు**

మనీలా: ప్రపంచవ్యాప్తంగా వరుస సంక్షోభాలు, అనిశ్చిత పరిస్థితులు నెలకొంటున్న వేళ దేశాల మధ్య పోటీతత్వం కంటే పరస్పర సహకారమే అభివృద్ధికి బాటలు వేస్తుందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. ప్రపంచ జనాభాలో దాదాపు నాలుగో వంతుకు ప్రాతినిధ్యం వహిస్తున్న భారత్, ఆగ్నేయాసియా దేశాలు కలిసికట్టుగా ముందుకు సాగితే శాంతి, స్థిరత్వం, సంపదతో కూడిన భవిష్యత్తును నిర్మించవచ్చని పేర్కొన్నారు. ఫిలిప్పీన్స్ రాజధాని మనీలాలో మంగళవారం జరిగిన భారత్-ఆగ్నేయాసియా దేశాల కూటమి శిఖరాగ్ర సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.

ఈ సమావేశానికి హాజరైన 11 సభ్య దేశాల నాయకులను ఉద్దేశించి మోదీ ప్రసంగించారు. భారత్ ఎల్లప్పుడూ ఆగ్నేయాసియా దేశాల కూటమి ఐక్యతకు, ఈ ప్రాంతంలో దాని కీలక పాత్రకు కట్టుబడి ఉంటుందని స్పష్టం చేశారు.

గత కొన్నేళ్లుగా ప్రపంచం వరుస సంక్షోభాలను ఎదుర్కొంటోందని, ఇలాంటి పరిస్థితుల్లో ప్రపంచానికి అత్యంత అవసరమైనవి శాంతి, స్థిరత్వం, భవిష్యత్తుపై నమ్మకమని పేర్కొన్నారు. **మిగతా 2లో...**

- **అక్వాన్ ముప్పుపై పవన్ కళ్యాణ్ సమీక్ష**
- **తీర, లోతట్టు ప్రాంతాల ప్రజల తరలింపునకు ఆదేశాలు**
- **గ్రామాల్లో వరద నీరు నిల్వ ఉండకుండా చర్యలు**
- **విద్యుత్ స్తంభాలు, రహదారుల పునరుద్ధరణకు సిద్ధం కావాలి**
- **తుపాను తగ్గేవరకు గ్రామాల్లోనే అధికార యంత్రాంగం**

ప్రాణరక్షణే ప్రథమం


అమరావతి (జర్నలిస్ట్ ఫైల్): అక్వాన్ తుపాను రూపంలో రాష్ట్రంపై విరుచుకుపడేందుకు సిద్ధంగా ఉన్నమరో విపత్తును సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా శాఖల అధికారులు, సిబ్బంది సర్వసన్నద్ధంగా ఉండాలని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. గత రెండు తుపానులతో పోలిస్తే అక్వాన్ తీవ్రత ఎక్కువగా ఉండే అవకాశం ఉందన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో గ్రామాల్లో, ముఖ్యంగా తీర ప్రాంతాల్లో ముందస్తు సహాయక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. **మిగతా 2లో...**



అక్వాన్‌పై అప్రమత్తంగా ఉండాలి

- **ప్రజలకు ఎప్పటికప్పుడు హెచ్చరికలు జారీ చేయాలి**
- **స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు సిబ్బందితో సమాచారం చేరవేత**
- **మత్స్యకారులు వేటకు వెళ్లకుండా చర్యలు**
- **తుపాను తీరం దాటే సమయంలో ఈదురుగాలుల ప్రమాదం**
- **అధికారులతో సీఎం చంద్రబాబు టెలీకాన్ఫరెన్స్**

2 లో



ఐపీఎల్‌కు ధోనీ గుడ్‌బై



- **ఆటగాడిగా వీడ్కోలు.. సీఎస్‌కే మెంటార్‌గా కొత్త బాధ్యతలు**
- **2027 సీజన్ నుంచి మెంటార్‌గా సేవలు**
- **18 ఏళ్లపాటు చెన్నైతో అనుబంధం**
- **ఐదు ఐపీఎల్ టైటిళ్లు అందించిన కెప్టెన్**
- **సీఎస్‌కే తరఫున 272 మ్యాచ్‌లు.. 5,314 పరుగులు**

2 లో

ఫుడ్ పాయిజన్ కలకలం



- **కేజీబీవీలో 48 మంది విద్యార్థినులకు అస్వస్థత..**
- **17 మంది ఆస్పత్రికి తరలింపు**
- **భోజనం చేసిన తర్వాత అర్ధరాత్రి నుంచి కడుపునొప్పి, వాంతులు, విరేచనాలు**

అనంతపురం (జర్నలిస్ట్ ఫైల్): గుమ్మఘట్ట మండలంలోని బీటీ ప్రాజెక్టు కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ)లో ఫుడ్ పాయిజన్ కలకలం రేపింది. మంగళవారం తెల్లవారుజామున విద్యార్థినులు కడుపునొప్పి, వాంతులు, విరేచనాలతో తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. ఒక్కొక్కరుగా 48 మంది అనారోగ్యానికి గురికావడంతో పాఠశాల సిబ్బంది అప్రమత్తమయ్యారు. వెంటనే వైద్యులకు సమాచారం అందించడంతో ప్రత్యేక **మిగతా 3లో...**

విద్యార్థుల ఆరోగ్యంపై ఆరా

- **పరిస్థితి అదుపులోనే ఉందని అధికారుల వెల్లడి**
- **ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటుకు మంత్రి సత్యకుమార్ ఆదేశం**
- **ప్రతి విద్యార్థి ఆరోగ్య పరిస్థితిపై నిరంతర పర్యవేక్షణ**

2 లో

కోనసీమలో గ్యాస్ బ్లోఅవుట్

- **నగరం గ్రామంలో ఓఎన్జీసీ బావి నుంచి భారీగా లీకేజీ**
- **తెల్లవారుజామున భారీ శబ్దంతో బయటకు ఎగసిపడిన గ్యాస్**
- **కిలోమీటరు పరిధిలో 400-500 కుటుంబాల తరలింపు**
- **మడ్ పంపింగ్‌తో అదుపులోకి.. శాంతించిన బ్లోఅవుట్**
- **ఘటనపై సీఎం చంద్రబాబు సమీక్ష.. శాశ్వత భద్రతా చర్యలకు ఆదేశం**

అమలాపురం (జర్నలిస్ట్ ఫైల్): కోనసీమ జిల్లాలో మరోసారి గ్యాస్ లీకేజీ కలకలం రేపింది. మామిడికుదురు మండలం నగరం గ్రామంలోని ఓఎన్జీసీ గ్యాస్ బావి నుంచి మంగళవారం తెల్లవారుజామున ఒక్కసారిగా భారీ శబ్దంతో గ్యాస్ వెలువడింది. తాడివారిమెరక వద్ద ఉన్న వెల్ నంబరు-7లో రీడ్రిల్లింగ్ పనులు చేపడుతుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. మూసివేసిన బావి వద్ద తిరిగి డ్రిల్లింగ్ చేస్తుండగా ఒత్తిడితో గ్యాస్ ఒక్కసారిగా బయటకు రావడంతో బ్లోఅవుట్ సంభవించింది. భారీగా గ్యాస్ లీకవుతుండటంతో సమీప ప్రాంతాల ప్రజలు భయాందోళనలకు గురై ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీశారు. సమాచారం అందుకున్న ఓఎన్జీసీ నిపుణుల బృందాలు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని మంటలు వ్యాపించకుండా చర్యలు చేపట్టాయి.

కిలోమీటరు పరిధిలో ఖాళీ : గ్యాస్ లీకేజీ తీవ్రత దృష్ట్యా అధికారులు అప్రమత్తమయ్యారు. బావి చుట్టూ ఒక కిలోమీటరు పరిధిలోని నివాస ప్రాంతాలను ఖాళీ చేయించారు. సుమారు 400 నుంచి 500 కుటుంబాలను సురక్షిత ప్రాంతాలకు తరలించినట్లు జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్ రవిరాల తెలిపారు. ముందస్తు జాగ్రత్తగా విద్యుత్ ఉపకరణాలు, **మిగతా 2లో...**





అక్వాన్ తుపాన్‌పై ప్రభుత్వం అప్రమత్తం

- **తీరప్రాంత జిల్లాలకు హై అలర్ట్**
- **నెల్లూరు-తుని మధ్య తీరం దాటే అవకాశం..**
- **ప్రజలు అప్రమత్తంగా ఉండాలి**
- **హోంమంత్రి అనిత**

2 లో

ఏపీకి ఆర్థిక చేయూతనివ్వండి



(మొదటి పేజీ తరువాయి)

విషయాన్ని గుర్తు చేశారు. హార్టికల్చర్ హబ్ లో భాగంగా వివిధ స్థాయిల్లో మౌలిక వసతుల అభివృద్ధి చేపడుతున్నామని చెప్పారు. గ్రామాలకు రోడ్ నెట్ వర్క్, ఇరిగేషన్ అభివృద్ధి పనులు, డ్రిప్ ఇరిగేషన్ వంటి మీద ఫోకస్ పెట్టామని తెలిపారు. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం విడుదల చేయాలని ముఖ్యమంత్రి కోరారు. అలాగే విశాఖ ఎకనమిక్ రీజియన్ అభివృద్ధికి అవసరమైన నిధులను కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. విశాఖ ఎకనమిక్ రీజియన్ శర వేగంగా అభివృద్ధి చెందుతోందని... దీనికి ఇప్పటికే కేంద్రం నుంచి వివిధ మార్గాల్లో సహకారం అందుతోందని.. దీనికి అదనంగా మరింత సాయం అందించగలిగితే అభివృద్ధి ఫలాలు ప్రజలకు అందుతాయని వివరించారు. ఈ సందర్భంగా ఇటీవల సీఐఐ భాగస్వామ్య సదస్సు అంశం ప్రస్తావనకు వచ్చింది. రెండు రోజుల పాటు జరిగిన సదస్సులో తీసుకున్న నిర్ణయాలు, వచ్చిన పెట్టుబడులు, వివిధ అంశాలపై జరిగిన చర్చల సారాంశాన్ని నిర్మలా సీతారామన్ కు సీఎం వివరించారు. ఈ సదస్సు పారిశ్రామిక అభివృద్ధికి తోడ్పడేలా ఉందని అభిప్రాయ పడ్డారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, పలువురు ఎంపీలు సహా ఆర్థిక శాఖకు చెందిన ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

అక్వాన్‌పై అప్రమత్తంగా ఉండాలి



అమరావతి (జర్నలిస్ట్‌ఫైల్): అక్వాన్ తుపాను కదలికలు, తీవ్రతపై ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. తుపాను ప్రభావిత ప్రాంతాల ప్రజలకు వాతావరణ హెచ్చరికలను ఎప్పటికప్పుడు జారీ చేస్తూ అప్రమత్తం చేయాలని సూచించారు. మంగళవారం అధికారులతో నిర్వహించిన టెలీకాన్ఫరెన్స్‌లో తుపాను పరిస్థితులు, రాష్ట్రంపై దాని ప్రభావం, ముందస్తు చర్యలపై సమీక్షించారు. తుపాను కదలికలు, తీవ్రత, వర్ష సూచనల గురించి అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు సిబ్బంది ద్వారా ప్రజలకు నేరుగా సమాచారం చేరవేయాలని సూచించారు. మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్లకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు.

తుపాను గంటకు మూడు కిలోమీటర్ల వేగంతో కదులుతోందని, తీవ్ర తుపానుగా మారే అవకాశం ఉందని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. దీని ప్రభావంతో ఈ నెల 19, 20 తేదీల్లో భారీ వర్షాలు కురిసే అవకాశముందని తెలిపారు. తుపాను తీరం దాటే సమయంలో బలమైన ఈదురుగాలులు వీచే ప్రమాదం ఉందని అంచనా వేశారు.

ప్రజలకు భరోసా కల్పించాలి : ఇటీవలి కాలంలో రాష్ట్రంపై మూడో తుపాను ప్రభావం చూపుతోందని సీఎం పేర్కొన్నారు. వరుస విపత్తులు వస్తున్నాయని ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఎంతటి పెద్ద విపత్తు ఎదురైనా ప్రభుత్వం, అధికారులు అండగా ఉంటారనే భరోసా ప్రజల్లో కల్పించాలని సూచించారు. తుపాను కారణంగా చెట్లు కూలినా, విద్యుత్ స్తంభాలు నేలకొరిగినా వెంటనే తొలగించి విద్యుత్, రవాణా వ్యవస్థలను పునరుద్ధరించాలని ఆదేశించారు.

సహాయక చర్యలకు సిద్ధంగా ఉండాలి : క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితులను ఎప్పటికప్పుడు అంచనా వేస్తూ అవసరమైన ప్రాంతాల్లో సహాయక, రక్షణ చర్యలు చేపట్టాలని సీఎం సూచించారు. బాధితులకు అవసరమైన పునరావాస సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు. తుపాను ప్రభావంతో చెరువులు, కాల్వలకు గండ్లు పడకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రజల ప్రాణ, ఆస్తి నష్టాలను నివారించడమే లక్ష్యంగా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని చంద్రబాబు స్పష్టం చేశారు.

ఫుడ్ పాయిజన్ కలకలం

(మొదటి పేజీ తరువాయి)

వైద్య బృందం పాఠశాలకు చేరుకుని చికిత్స ప్రారంభించింది. పరిస్థితి ఆందోళనకరంగా ఉన్న 17 మందిని గుమ్మఘట్ట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

అర్ధరాత్రి నుంచే అస్వస్థత : కేజీబీవీలో ఆరో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు 279 మంది విద్యార్థినులు చదువుతున్నారు. సోమవారం రాత్రి అన్నం, సాంబారు, బీరకాయతో భోజనం చేసిన విద్యార్థినులు నిద్రకు ఉపక్రమించారు. అర్ధరాత్రి సమయంలో కొందరికి కడుపునొప్పి మొదలైంది. ప్రిన్సిపల్ సూచన మేరకు సిబ్బంది మాత్రలు ఇచ్చారు. అయినప్పటికీ మంగళవారం తెల్లవారుజామున కడుపునొప్పి తీవ్రం కావడంతోపాటు వాంతులు, విరేచనాలు ప్రారంభమయ్యాయి. క్రమంగా బాధితుల సంఖ్య 48కి చేరింది.

17 మందికి ఆస్పత్రిలో చికిత్స : సమాచారం అందుకున్న గుమ్మఘట్ట ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి చెందిన ఇద్దరు వైద్యులు, ఆరుగురు సహాయక సిబ్బంది కేజీబీవీకి చేరుకుని విద్యార్థినులకు వైద్య సేవలు అందించారు. పరిస్థితి ఆందోళనకరంగా ఉన్న 17 మందిని గుమ్మఘట్ట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మిగిలిన విద్యార్థినుల ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. మరో 24 గంటలపాటు అందరికీ వైద్య పర్యవేక్షణలో చికిత్స కొనసాగిస్తామని పేర్కొన్నారు.

అధికారుల పర్యవేక్షణ : ఘటనపై జిల్లా విద్యాశాఖ అధికారి అయూబ్ హుస్సేన్, జీసీడీవో కవిత, ఎంఈవో సోమశేఖర్ కేజీబీవీకి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. విద్యార్థినులకు అందుతున్న వైద్య సేవలను పర్యవేక్షించారు. సిబ్బంది నిర్లక్ష్యం ఉన్నట్లు తేలితే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని జిల్లా విద్యాశాఖ అధికారి స్పష్టం చేశారు. ఘటనపై జిల్లా ఉన్నతాధికారులు సమగ్ర విచారణకు ఆదేశించారు.

విద్యార్థినులకు ఎమ్మెల్యే పరామర్శ : స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు ఆస్పత్రికి వెళ్లి అస్వస్థతకు గురైన విద్యార్థినులను పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్య చికిత్స అందించాలని వైద్య సిబ్బందికి సూచించారు.

ప్రాణరక్షణే ప్రథమం

(మొదటి పేజీ తరువాయి)

అక్వాన్ తుపాను హెచ్చరికల నేపథ్యంలో మంగళవారం క్యాంపు కార్యాలయంలో తన పరిధిలోని అన్ని శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. అర్నబ్, మురసు తుపానుల కారణంగా గ్రామాల్లో మౌలిక సదుపాయాలకు కలిగిన నష్టం, ప్రస్తుత తుపాను తీవ్రతపై వాతావరణ శాఖ హెచ్చరికలను అధికారులు వివరించారు. అక్వాన్ తుపాను ఈ నెల 20న నెల్లూరు–తుని మధ్య తీరాన్ని తాకే అవకాశం ఉందని, ఆ సమయంలో గంటకు 120 నుంచి 145 కిలోమీటర్ల వేగంతో పెనుగాలులు వీచే అవకాశముందని అధికారులు తెలిపారు. తుపాను ప్రభావంతో రాష్ట్రంలోని చాలా ప్రాంతాల్లో భారీ వర్షాలు, ఆకస్మిక వరదలు సంభవించే అవకాశాలున్నాయని వివరించారు. ఈ నెల 19, 20 తేదీల్లో తుపాను ప్రభావిత జిల్లాల్లో అత్యంత అప్రమత్తంగా ఉండాల్సిన అవసరముందని, అందుకు అనుగుణంగా పంచాయతీరాజ్ సిబ్బందిని సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు.

ముందస్తు చర్యలే ముఖ్యం : తీవ్ర తుపాను సందర్భంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నష్ట నివారణ చర్యలపై పవన్ కళ్యాణ్ అధికారులకు దిశానిర్దేశం చేశారు. రెడ్ అలర్ట్ ఉన్న జిల్లాల యంత్రాంగం అత్యంత అప్రమత్తంగా ఉండాలని, తీర ప్రాంత, లోతట్టు ప్రాంతాల ప్రజలను తక్షణమే సురక్షిత ప్రాంతాలకు తరలించాలని ఆదేశించారు. పోలీసు, రెవెన్యూ, విద్యుత్, ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ తదితర విభాగాలతో సమన్వయం చేసుకుంటూ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ.. “నెల రోజుల వ్యవధిలో అర్నబ్, మురసు రూపంలో రెండు తుపాన్లు ఆంధ్రప్రదేశ్ తీర ప్రాంతాన్ని అతలాకుతలం చేశాయి. కూటమి ప్రభుత్వం తీసుకున్న ముందస్తు జాగ్రత్త చర్యల కారణంగా ప్రాణనష్టం జరగనప్పటికీ, పంట, ఆస్తి నష్టం తప్పలేదు. తుపానుల కారణంగా దాదాపు 520 కిలోమీటర్ల మేర గ్రామీణ రహదారులు ధ్వంసమయ్యాయి. దీనికి సంబంధించిన నివేదిక తెప్పించుకుని, దెబ్బతిన్న రహదారులను వెంటనే పునరుద్ధరించేలా ఆదేశాలిచ్చాం. గత రెండు తుపానులను ఎదుర్కొన్న విధంగానే అక్వాన్‌ను ఎదుర్కొనేందుకు పూర్తి యంత్రాంగం సిద్ధంగా ఉండాలి. తుపాను తీవ్రత ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలను సమన్వయం చేసుకోవాలి. పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసి ఆహారం, తాగునీటికి ఇబ్బందులు లేకుండా చూడాలి. భారీ వర్షాలకు రహదారులు దెబ్బతింటే మొదట ఉపరితల భాగం దెబ్బతిన్న రోడ్లను యుద్ధ ప్రాతిపదికన పునరుద్ధరించాలి. రోడ్లకు అడ్డంగా చెట్లు కూలితే తక్షణమే తొలగించే ఏర్పాట్లు



చేయాలి.

అక్వాన్ తుపాను గమనంపై స్పష్టత లేనందున, తీవ్ర తుపాను తీరం తాకే అవకాశమున్న అన్ని జిల్లాల్లో యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలి. ప్రభుత్వం, వాతావరణ శాఖ నుంచి వచ్చే హెచ్చరికలను ఎప్పటికప్పుడు ప్రజలకు చేరవేయాలి. గ్రామాల్లోని పల్లపు ప్రాంతాల్లో వర్షపు నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. వర్షాలు తగ్గిన వెంటనే నీరు బయటకు వెళ్లిపోయేలా ఏర్పాట్లు చేయాలి. పారిశుధ్యానికి అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలి” అని సూచించారు.

రైతులను అప్రమత్తం చేయండి : “గ్రామీణ ప్రాంతాల్లో వరి పంట చేతికి వస్తుందనగా అక్వాన్ తుపాను రూపంలో విపత్తు సంభవించడం దురదృష్టకరం. రైతులకు పంట నష్టం తగ్గించేందుకు పంచాయతీరాజ్ శాఖ సిబ్బంది తగిన సహకారం అందించాలి. కోతకు వచ్చిన పంటను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలి. విద్యుత్ స్తంభాలు పెద్ద ఎత్తున నేలకొరిగే అవకాశాలున్నందున వాటిని తక్షణమే పునరుద్ధరించేందుకు విద్యుత్ శాఖ చర్యలు తీసుకోవాలి. భారీ వర్షాలకు దెబ్బతిన్న రహదారుల వివరాలను వెంటనే సేకరించి, పునరుద్ధరణ ప్రక్రియను త్వరగా ప్రారంభించాలి.

ప్రజలు బీచ్‌ల వైపు వెళ్లకుండా, మత్స్యకారులు వేటకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ఇటీవల తుపాను గాలుల్లో చిక్కుకున్న తమిళనాడు మత్స్యకారుల జీవితాలు విషాదాంతమైన విషయాన్ని గుర్తుంచుకోవాలి. ప్రభుత్వం నుంచి వచ్చే హెచ్చరికలను ప్రజలు తూచా తప్పకుండా పాటిస్తూ, యంత్రాంగానికి సహకరించాలి. తుపాను ప్రభావం పూర్తిగా తగ్గే వరకు క్షేత్రస్థాయి సిబ్బందితో సహా యంత్రాంగమంతా గ్రామాల్లోనే ఉండాలి. ప్రజల ప్రాణాల రక్షణకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలి” అని పవన్ కళ్యాణ్ ఆదేశించారు.

ఐపీఎల్‌కు ధోనీ గుడ్‌బై

చెన్నై (జర్నలిస్ట్‌ఫైల్) : టీమ్‌ఇండియా మాజీ కెప్టెన్, మిస్టర్ కూల్ మహేంద్రసింగ్ ధోనీ ఐపీఎల్‌కు ఆటగాడిగా వీడ్కోలు పలికాడు. 2027 సీజన్‌కు ముందు ఈ కీలక నిర్ణయం తీసుకున్నాడు. ఇకపై చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్‌కే) జట్టుకు మెంటార్‌గా వ్యవహరించనున్నాడు. ఈ విషయాన్ని సీఎస్‌కే తన అధికారిక ఎక్స్ ఖాతా ద్వారా వెల్లడించింది. 2027 ఐపీఎల్ సీజన్ నుంచి ధోనీ మెంటార్‌గా కొత్త అధ్యాయాన్ని ప్రారంభించనున్నట్లు ప్రకటించింది. ‘ధోనీ లేకుండా సీఎస్‌కే లేదు. రెండు దశాబ్దాలుగా మేమంతా కలిసే ఎదిగాం. విజయాలు, అపజయాలు ఎదురైనా మా అనుబంధం కొనసాగింది’ అని సీఎస్‌కే యజమాని ఎన్. శ్రీనివాసన్ పేర్కొన్నారు.

ధోనీ నాయకత్వంలో చెన్నై సూపర్ కింగ్స్ ఐదుసార్లు ఐపీఎల్ టైటిల్‌ను కైవసం చేసుకుంది. కెప్టెన్‌గానే కాకుండా బ్యాటర్‌గా, వికెట్ కీపర్‌గా తనదైన ముద్ర వేశాడు. సీఎస్‌కే తరఫున అత్యధిక పరుగులు చేసిన ఆటగాళ్లలో రెండో స్థానంలో నిలిచాడు. ఆ జట్టు తరఫున 272 మ్యాచ్‌లు ఆడి 5,314 పరుగులు సాధించాడు. అద్భుతమైన ఫినిషర్‌గా పేరొందిన ధోనీ.. ఎన్నో ఉత్కంఠభరిత మ్యాచ్‌ల్లో జట్టుకు విజయాలను అందించాడు. 2008లో ఐపీఎల్ ప్రారంభమైనప్పటి నుంచి చెన్నైతో అతడి అనుబంధం ప్రత్యేకంగా నిలిచింది. ఆటగాడిగా, కెప్టెన్‌గా జట్టుకు ఎన్నో చిరస్మరణీయ



విజయాలను అందించిన ధోనీ.. ఇప్పుడు మెంటార్‌గా కొత్త బాధ్యతలు చేపట్టనున్నాడు.

రూ.14 కోట్లతో ప్రస్థానం ప్రారంభం: 2008లో జరిగిన తొలి ఐపీఎల్ వేలంలో చెన్నై సూపర్ కింగ్స్ ధోనీని రూ.14 కోట్లకు కొనుగోలు చేసింది. అప్పటికే టీ20 ప్రపంచకప్‌ను భారత్‌కు అందించిన కెప్టెన్‌గా అతడిపై భారీ అంచనాలున్నాయి. వాటికి తగ్గట్టుగానే తొలి సీజన్ నుంచే జట్టును విజయవంతంగా నడిపించాడు. 2010లో ముంబయి ఇండియన్స్‌ను ఓడించి చెన్నై తొలిసారి ఐపీఎల్ విజేతగా నిలిచింది. ఆ మరుసటి ఏడాది 2011లోనూ టైటిల్‌ను నిలబెట్టుకుని సత్తా చాటింది.

ఒత్తిడిలోనూ ప్రశాంతంగా వ్యవహరించడం, కీలక సమయాల్లో సరైన నిర్ణయాలు తీసుకోవడం ధోనీ ప్రత్యేకత. అందుకే అతడికి ‘కెప్టెన్ కూల్’ అనే పేరు స్థిరపడింది. అవసరానికి అనుగుణంగా బ్యాటింగ్ స్థానంలో మార్పులు చేస్తూ ఎన్నో సాహసోపేత నిర్ణయాలు తీసుకున్నాడు. 2018, 2021, 2023 సీజన్లలోనూ చెన్నైకి టైటిళ్లు అందించి మొత్తం ఐదు ట్రోఫీలతో జట్టును అగ్రస్థానంలో నిలిపాడు. రోహిత్ శర్మతో కలిసి అత్యధిక ఐపీఎల్ టైటిళ్లు సాధించిన కెప్టెన్లలో ఒకరిగా చరిత్ర సృష్టించాడు. 2023 ఫైనల్ ధోనీ కెరీర్‌లో ప్రత్యేకంగా నిలిచిపోయింది. మోకాలి గాయంతో ఇబ్బంది పడుతూనే జట్టును విజేతగా నిలిపాడు. విజయం అనంతరం రవీంద్ర జడేజాను ఆత్మీయంగా హత్తుకున్న దృశ్యం అభిమానుల మనసుల్లో చెరగని ముద్ర వేసింది. చెన్నైలోని ఎంఏ చిదంబరం స్టేడియం (చెపాక్)లో పసుపు జెర్సీల మధ్య మార్మోగే ‘ధోనీ.. ధోనీ’ నినాదాలు అతడికి అభిమానులతో ఉన్న అనుబంధానికి నిదర్శనం. 2024లో రుతురాజ్ గైక్వాడ్‌కు కెప్టెన్సీ బాధ్యతలు అప్పగించి యువతరానికి నాయకత్వ అవకాశాన్ని కల్పించాడు. 2025 సీజన్‌లో తాత్కాలికంగా మళ్లీ జట్టును నడిపించాడు. అయితే 2026 సీజన్‌లో కండరాల గాయం కారణంగా మైదానానికి దూరంగా ఉన్నాడు. తాజాగా ఆటగాడిగా తన సుదీర్ఘ ప్రయాణానికి ముగింపు పలుకుతూ మెంటార్‌గా కొత్త ఇన్నింగ్స్‌కు సిద్ధమయ్యాడు. మైదానంలో తన వ్యూహాలతో ప్రత్యర్థులను కట్టడి చేసిన ధోనీ.. ఇకపై తెరవెనుక నుంచి సీఎస్‌కే విజయాలకు మార్గనిర్దేశం చేయనున్నాడు.

పోటీకి స్వస్తి.. సహకారానికి శ్రీకారం

(మొదటి పేజీ తరువాయి)

ఈ నేపథ్యంలో ఈ ఏడాది సమావేశం ‘కలిసికట్టుగా భవిష్యత్తును తీర్చిదిద్దుకుందాం’ అనే ఇతివృత్తంతో నిర్వహించడం ప్రాధాన్యం సంతరించుకుందని తెలిపారు.

2045, 2047 లక్ష్యాల దిశగా.. : భారత్ అభివృద్ధి, ఆగ్నేయాసియా దేశాల శ్రేయస్సు పరస్పరం ముడిపడి ఉన్నాయని మోదీ పేర్కొన్నారు. ఆగ్నేయాసియా దేశాల సమాజ దార్శనికత–2045, వికసిత భారత్–2047 లక్ష్యాలు ఉమ్మడి ఆకాంక్షలను నెరవేర్చడంలో కీలక పాత్ర పోషిస్తాయని విశ్వాసం వ్యక్తం చేశారు.

ఈ ప్రాంతాన్ని శాంతి, స్థిరత్వానికి ప్రతీకగా మార్చే శక్తి, సంకల్పం భారత్, ఆగ్నేయాసియా దేశాలకు ఉన్నాయని అన్నారు. ఈ సమావేశం ద్వారా ఇరుపక్షాల సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యం మరింత బలోపేతం కావడంతోపాటు సురక్షితమైన, అందరినీ కలుపుకొనిపోయే, సంపన్నమైన ఇండో–పసిఫిక్ ప్రాంత నిర్మాణానికి దోహదపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

11 దేశాలతో ఆగ్నేయాసియా కూటమి : 1967లో ఏర్పాటైన ఆగ్నేయాసియా దేశాల సంఘం ఆర్థిక వృద్ధి, రాజకీయ స్థిరత్వం, భద్రత, సాంస్కృతిక సహకారానికి ప్రాధాన్యమిస్తోంది. బ్రూనై, కంబోడియా, ఇండోనేషియా, లావోస్, మలేషియా, మయన్మార్, ఫిలిప్పీన్స్, సింగపూర్, థాయ్‌లాండ్, తైమూర్–లెస్టే, వియత్నాం ఇందులో సభ్య దేశాలుగా ఉన్నాయి. భారత్, అమెరికా, చైనా, జపాన్, ఆస్ట్రేలియా తదితర



దేశాలు ఈ కూటమితో ప్రత్యేక భాగస్వామ్య సంబంధాలను కొనసాగిస్తున్నాయి. :

ఫిలిప్పీన్స్‌లో చారిత్రక గురుద్వారా అభివృద్ధికి మోదీ శంకుస్థాపన : విదేశీ గడ్డపై భారతీయ సంస్కృతి, ఆధ్యాత్మిక సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తున్న చారిత్రక ప్రార్థనా మందిరం అభివృద్ధికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శ్రీకారం చుట్టారు. ఫిలిప్పీన్స్ రాజధాని మనీలాలో ఉన్న పురాతన గురుద్వారా ఖల్సా దివాన్ పునరాభివృద్ధి పనులకు మంగళవారం ఆయన శంకుస్థాపన చేశారు. మూడు రోజుల ఫిలిప్పీన్స్ పర్యటనలో భాగంగా ఈ చారిత్రక ప్రార్థనా మందిరాన్ని సందర్శించిన ప్రధాని, అక్కడ నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

ఈ కార్యక్రమంలో సెనేటర్ ఫ్రాన్సిస్ జోసెఫ్ ఎస్కుడెరో, మనీలా నగర మేయర్ ఫ్రాన్సిస్కో ఇస్కో మోరెనో తదితరులు పాల్గొన్నారు. అనంతరం గురుద్వారాలో ప్రధాని మోదీ స్వచ్ఛంద సేవా కార్యక్రమంలో భాగంగా శ్రమదానం చేశారు.

గురుద్వారా ఖల్సా దివాన్‌కు సుదీర్ఘ చరిత్ర ఉంది. 1901లో తొలిసారిగా దీనిని స్థాపించారు. 1903లో వ్యవస్థీకృత సంస్థగా రూపుదిద్దుకోగా, 1924లో ఖల్సా దివాన్ పేరుతో అధికారికంగా నమోదు చేశారు. ఫిలిప్పీన్స్‌లో ఏర్పాటైన తొలి గురుద్వారాగా ఇది ప్రత్యేక గుర్తింపు పొందింది.

ముఖ్యంగా మనీలాలో నివసిస్తున్న సిక్కులు, పంజాబీ కుటుంబాలకు తరతరాలుగా ఈ గురుద్వారా ఆధ్యాత్మిక, సాంస్కృతిక కేంద్రంగా కొనసాగుతోంది. ప్రార్థనలు, మతపరమైన కార్యక్రమాలకే పరిమితం కాకుండా సిక్కు గురువుల బోధనలు, సంప్రదాయాలు, సేవాభావాన్ని భావితరాలకు అందించే వేదికగా నిలుస్తోంది. గురుద్వారా ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక కార్యక్రమాలతోపాటు పలు సామాజిక, సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. సిక్కు సమాజంతోపాటు ఇతర వర్గాల ప్రజలకు కూడా సేవలందిస్తోంది. మనీలాలోని భారతీయ సంతతికి చెందిన కుటుంబాలను ఒకే వేదికపైకి తీసుకురావడంలో, వారి మతపరమైన, సాంస్కృతిక వారసత్వాన్ని కాపాడటంలో కీలక పాత్ర పోషిస్తోంది. చారిత్రక ప్రాధాన్యం కలిగిన ఈ గురుద్వారా పునరాభివృద్ధి కార్యక్రమం ద్వారా భవిష్యత్తు తరాలకు సిక్కు సంప్రదాయాలు, సంస్కృతిని మరింత సమర్థంగా అందించేందుకు అవకాశం కలగనుంది. ఈ చారిత్రక ప్రార్థనా మందిరాన్ని సందర్శించడం, ఇక్కడ సేవ చేసే అవకాశం లభించడం తన అదృష్టంగా భావిస్తున్నట్లు మోదీ సామాజిక మాధ్యమ వేదికలో పేర్కొన్నారు.

ఎస్ఐఆర్‌పై 48 ప్రశ్నలు విచారిస్తాం..

న్యూఢిల్లీ (జర్నలిస్ట్‌ఫైల్) : దేశవ్యాప్తంగా ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియపై ప్రతిపక్ష ఇండియా బ్లాక్ నేతలు దాఖలు చేసిన పిటిషన్‌పై సమగ్ర విచారణ జరిపేందుకు అత్యున్నత న్యాయస్థానం అంగీకరించింది. ఈ ప్రక్రియకు సంబంధించి కేంద్ర ఎన్నికల సంఘం (ఇసిఐ) ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్, ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషిలతోపాటు ఉన్నతాధికారులకు 48 ప్రశ్నలు (ఇంటరాగేటరీస్) సంధిస్తూ ప్రతిపక్ష నేతలు దరఖాస్తు చేశారు. దీనిపై తదుపరి విచారణను డిసెంబర్ 9కి వాయిదా వేస్తున్నట్లు సిజెఐ జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం మంగళవారం తెలిపింది. దేశవ్యాప్తంగా ఎస్ఐఆర్ ప్రక్రియలో సుమారు 13 కోట్ల మంది ఓటర్ల పేర్లు తొలగించడాన్ని ప్రతిపక్ష నేతలు విమర్శిస్తున్నారు. ఎన్నికల సంఘం ఎస్ఐఆర్‌ను ఏకగ్రీవంగా నిర్ణయించిం దంటూ అక్టోబర్ 26న దాఖలు చేసిన అఫిడవిట్‌లో పేర్కొన్న అంశాల విశ్వసనీయతను వారు



ప్రశ్నిస్తున్నారు. ఎన్నికల కమిషనర్లందరి ఆమోదంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్ప దానికి ఇసి ఎలాంటి ఆధారాలనూ సమర్పించ లేదని ఇండియా బ్లాక్ నాయకులు తెలిపారు.

అక్వాన్ తుపాన్‌పై ప్రభుత్వం అప్రమత్తం



అమరావతి, నవంబర్ 17(జర్నలిస్ట్ ఫైల్) : బంగాళాఖాతంలో ఏర్పడిన అక్వాన్ తుపాన్ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. తుపాన్ ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు ముందస్తు చర్యలు చేపట్టాలని హోంమంత్రి అనిత అధికారులను ఆదేశించారు. మంగళవారం విపత్తుల నిర్వహణ సంస్థ, రియల్ టైమ్ గవర్నెన్స్ సొసైటీ అధికారులతో ఆమె సమీక్ష నిర్వహించారు. తీరప్రాంత జిల్లాల కలెక్టర్లు, పోలీసు సూపరింటెండెంట్లు సమన్వయంతో పనిచేస్తూ ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అధికారుల సమాచారం ప్రకారం అక్వాన్ తుపాన్ మంగళవారం సాయంత్రానికి తీవ్ర తుపానుగా, ఎల్లుండి ఉదయానికి అతి తీవ్ర తుపానుగా మారే అవకాశం ఉంది. శుక్రవారం మధ్యాహ్నం నెల్లూరు నుంచి తుని మధ్య తీరాన్ని దాటే సూచనలు ఉన్నాయని అధికారులు హోంమంత్రికి వివరించారు. తుపాన్ ప్రభావంతో గురు, శుక్రవారాల్లో కోస్తాంధ్ర జిల్లాల్లో బలమైన ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని, కొన్ని ప్రాంతాల్లో అత్యంత భారీ వర్షాలు, మరికొన్ని చోట్ల భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశముందని తెలిపారు. ఈ సందర్భంగా హోంమంత్రి అనిత మాట్లాడుతూ, గతంలో సమష్టి కృషితో రెండు తుపాన్లను సమర్థంగా ఎదుర్కొన్నామని, అదే స్ఫూర్తితో ప్రస్తుత తుపాన్‌ను కూడా ఎదుర్కొనేందుకు అన్ని శాఖల అధికారులు సిద్ధంగా ఉండాలని అన్నారు. విపత్తు సమయంలో ప్రభుత్వం ప్రజలకు పూర్తి భరోసా కల్పించాలని, క్షేత్రస్థాయిలో అధికారులు అందుబాటులో ఉంటూ పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. రానున్న నాలుగు రోజులపాటు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హోంమంత్రి విజ్ఞప్తి చేశారు. మత్స్యకారులు ఎట్టి పరిస్థితుల్లోనూ సముద్రంలో వేటకు వెళ్లరాదని స్పష్టం చేశారు. తీరప్రాంత ప్రజలు వాతావరణ పరిస్థితులను గమనిస్తూ అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అదేవిధంగా రైతాంగం వ్యవసాయ పనుల్లో ముందస్తు జాగ్రత్తలు పాటించాలని, కోతకు సిద్ధంగా ఉన్న పంటలను వర్షాలు, ఈదురుగాలుల నుంచి కాపాడుకునేలా రైతులకు వ్యవసాయ శాఖ అధికారులు తగిన సూచనలు అందించాలని ఆదేశించారు. తుపాన్ ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేయాలని, అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు యంత్రాంగం పూర్తి సంసిద్ధతతో ఉండాలని హోంమంత్రి అనిత స్పష్టం చేశారు.

కోనసీమలో గ్యాస్ బ్లోఅవుట్

(మొదటి పేజీ తరువాయి)

లైట్లు, గ్యాస్ స్టవ్‌లు వినియోగించవద్దని స్థానికులకు సూచించారు. గ్యాస్ కారణంగా అగ్నిప్రమాదం సంభవించే అవకాశం ఉండటంతో డీజిల్ జనరేటర్లు, విద్యుత్ పరికరాలను ప్రమాద ప్రాంతం నుంచి దూరంగా తరలించారు. సమీప జాతీయ రహదారిపై వాహనాల రాకపోకలను సైతం తాత్కాలికంగా నిలిపివేశారు. సురక్షిత ప్రాంతాలకు తరలించిన కుటుంబాలకు మధ్యాహ్నం, రాత్రి భోజన ఏర్పాట్లను జిల్లా యంత్రాంగం పర్యవేక్షించింది.

మడ్ పంపింగ్‌తో అదుపులోకి.. : బ్లోఅవుట్‌ను నియంత్రించేందుకు ఓఎన్జీసీ ప్రత్యేక సాంకేతిక నిపుణుల బృందాలు రంగంలోకి దిగాయి. మడ్ పంపింగ్ విధానంతో పాటు స్ప్రింక్లర్, వాటర్ అంబ్రెల్లా పద్ధతులను ఉపయోగించి గ్యాస్ లీకేజీని నియంత్రించేందుకు చర్యలు చేపట్టాయి. ఈ ప్రయత్నాలు ఫలించడంతో వెల్ నంబరు–7 నుంచి వెలువడుతున్న గ్యాస్ లీకేజీ అదుపులోకి వచ్చింది. మడ్ పంపింగ్ ద్వారా బ్ల

విద్యార్థుల ఆరోగ్యంపై ఆరా



అనంతపురం (జర్నలిస్ట్ ఫైల్) : జిల్లా గుమ్మగట్ట కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయం (కేజీబీవీ)లో సుమారు 40 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. రాత్రి భోజనంలో సాంబారు తిన్న అనంతరం విద్యార్థులకు అనారోగ్య లక్షణాలు కనిపించడంతో పాఠశాల సిబ్బంది అప్రమత్తమై వైద్య సేవలు అందించేందుకు చర్యలు చేపట్టారు.

వీరిలో నలుగురు విద్యార్థులను మెరుగైన వైద్య చికిత్స నిమిత్తం గుమ్మగట్ట ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. మిగిలిన విద్యార్థులకు వసతి గృహంలోనే వైద్య సిబ్బంది అవసరమైన చికిత్స అందిస్తున్నారు. విద్యార్థుల్లో కనిపిస్తున్న అనారోగ్య లక్షణాలను బట్టి వైద్య సేవలు అందిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

ఈ ఘటనపై వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ స్పందించారు. డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ ఆర్. వెంకటరమణతో పాటు జిల్లా అధికారులతో మాట్లాడి ఘటనకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం విద్యార్థులందరి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని, పరిస్థితి పూర్తిగా అదుపులోనే ఉందని అధికారులు మంత్రికి వివరించారు.

ఈ సందర్భంగా పాఠశాలలో ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించాలని మంత్రి అధికారులను ఆదేశించారు. విద్యార్థులందరికీ సమగ్ర వైద్య పరీక్షలు నిర్వహించాలని, అవసరమైన మందులు అందుబాటులో ఉంచాలని సూచించారు. ప్రతి విద్యార్థి ఆరోగ్య పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తూ ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు.

విద్యార్థుల ఆరోగ్య భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, అనారోగ్యానికి గల కారణాలను గుర్తించి తగిన నివారణ చర్యలు చేపట్టాలని మంత్రి అధికారులకు సూచించారు.

ఉద్యోగ భద్రతపై భరోసా ఇవ్వలేము



శాన్‌ఫ్రాన్సిస్కో : మైక్రోసాఫ్ట్‌లో రాబోయే సంవత్సరాల్లో ఉద్యోగాల స్వరూపం, పని విధానాలు మారనున్నాయని, సంస్థలో ఉద్యోగుల భవిష్యత్తు భద్రతపై భరోసా ఇవ్వలేమని ఆ కంపెనీ సిఇఒ సత్య నాదెళ్ల తెలిపారు. ఓ పాడ్‌కాస్ట్ ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ.. భారత్, అమెరికా, బ్రిటన్, కెనడాల్లోని ఉద్యోగుల కోసం ప్రకటించిన స్వచ్ఛంద ఉద్యోగ విరమణ (విఆర్ఎస్) ఉద్దేశాన్ని తెలిపారు. సంస్థాగత మార్పులకు అనుగుణంగా ఉద్యోగులు తమ కెరీర్, దీర్ఘకాలిక ఆర్థిక అవకాశాలకు తగిన నిర్ణయాలు తీసుకునేందుకు ఈ అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. మైక్రోసాఫ్ట్‌లోనే కాకుండా ఇతర సంస్థల్లోనూ విలువైనవిగా నిలిచే నైపుణ్యాలను ఉద్యోగులు అభివృద్ధి చేసుకోవాలని కంపెనీ కోరుకుంటోందన్నారు. రానున్న మార్పులకు అనుగుణంగా టీమ్‌ల పరిమాణం, పని ప్రవాహం, ఉద్యోగుల నిర్వహణ విధానాలను మార్చాల్సి ఉంటుందని చెప్పారు. ఈ ప్రక్రియలో పారదర్శకంగా వ్యవహరించడంతో పాటు కొత్త అవకాశాల కల్పన, ఉద్యోగుల వృత్తిపరమైన ఎదుగుదలకు అవసరమైన శిక్షణపై దృష్టి పెడతామని తెలిపారు. భారత్‌లో మైక్రోసాఫ్ట్‌కు సుమారు 23 వేల మంది ఉద్యోగులు ఉన్నారు. విఆర్ఎస్‌కు అర్హులైన ఉద్యోగులు తమ నిర్ణయాన్ని తెలియజేసేందుకు డిసెంబరు 1 వరకు గడువు ఉంది.

దిగజారుతున్న ట్రంప్ రేటింగ్



వాషింగ్టన్ : అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ రేటింగ్ మరింత దిగజారింది. ఆయన ఆమోద రేటింగ్ రానురానూ కనిష్ట స్థాయికి చేరుతోంది. నాలుగు రోజుల పాటు రాయిటర్స్/ఇప్సోస్ నిర్వహించిన తాజా పోల్ ప్రకారం అధ్యక్ష భవనంలో ట్రంప్ పనితీరును కేవలం 32 శాతం మంది అమెరికన్లు మాత్రమే సమర్థించారు. అక్టోబర్ మధ్య కాలం నుంచి రాయిటర్స్ / ఇప్సోస్ నాలుగు పోల్స్ నిర్వహించగా అన్నింటిలోనూ ట్రంప్ రేటింగ్ దాదాపుగా ఇలాగే ఉంది. ఇరాన్ యుద్ధం ఆయన రేటింగ్‌ను బాగా దిగజార్చింది. ఈ యుద్ధం కారణంగా అమెరికాలో జీవన వ్యయం పెరిగింది. ఇంధన ధరలు కొండెక్కి కూర్చున్నాయి. ప్రజాగ్రహం కారణంగానే ఈ నెల 3వ తేదీన జరిగిన మధ్యంతర ఎన్నికల్లో రిపబ్లికన్లు ఘోర పరాజయాన్ని మూటకట్టుకోవాల్సి వచ్చింది. ఇరాన్‌పై జరిపిన యుద్ధాన్ని కేవలం 31 శాతం మంది అమెరికన్లు మాత్రమే సమర్థించారు.

కాంగ్రెస్ నాయకత్వం విషయంలో డెమొక్రాట్లలో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. సెనెటర్ చక్ షూమర్ అభ్యర్థిత్వంపై సానుకూలత కంటే వ్యతిరేకతే ఎక్కువగా కన్పిస్తోంది. ప్రతినిధిసభ సభ్యుడు హకీమ్ జెఫ్రీస్‌ను సమర్థించే వారి సంఖ్య మాత్రం అధికంగా ఉంది. డెమొక్రాట్లలో 34 శాతం మంది షూమర్‌ను సమర్థిస్తుండగా, 43 శాతం మంది వ్యతిరేకించారు. రాయిటర్స్/ఇప్సోస్ పోల్‌లో జెఫ్రీస్‌కే ఎక్కువ ఆదరణ కన్పిస్తోంది. 40 శాతం మంది డెమొక్రాట్లు ఆయనకు అనుకూలంగా ఉండగా, 29 శాతం మంది వ్యతిరేకించారు. రిపబ్లికన్లలో ట్రంప్‌ను 75 శాతం మంది ఇష్టపడ్డారు. ఉపాధ్యక్షుడు జెడి వాన్స్‌ను సమర్థిస్తున్న వారి సంఖ్య 77 శాతంగా ఉంది.

పీఆర్సీ నివేదికను త్వరితగతిన సమగ్రంగా రూపొందించాలి

- ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, ప్రభుత్వ శాఖల డేటాబేస్‌ను సమర్థవంతంగా వినియోగించుకోవాలి
- గత పీఆర్సీలో ఎదురైన సమస్యలు, లోపాలు పునరావృతం కాకుండా చూడాలి
- 12వ వేతన సవరణ సంఘం చైర్మన్ దినేష్ కుమార్‌ను కోరిన ఏపీ జేఏసీ చైర్మన్ విద్యాసాగర్, జేఏసీ నాయకులు





విజయవాడ, నవంబర్ 17 (జర్నలిస్ట్ ఫైల్): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్ల ఆకాంక్షలకు అనుగుణంగా 12వ వేతన సవరణ సంఘం (పీఆర్సీ) నివేదికను వీలైనంత త్వరగా, సమగ్రంగా రూపొందించాలని ఏపీ జేఏసీ చైర్మన్, ఏపీ ఎన్జీజీఓస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు అలపర్తి విద్యాసాగర్ కోరారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, ప్రభుత్వ శాఖల వద్ద అందుబాటులో ఉన్న సమగ్ర డేటాబేస్‌ను సమర్థవంతంగా వినియోగించుకుని నివేదిక తయారీ ప్రక్రియను వేగవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

12వ వేతన సవరణ సంఘం చైర్మన్‌గా నియమితులైన దినేష్‌కుమార్ ను ఏపీ జేపీసీ, ఏపీ ఎన్జీజీఓస్ అసోసియేషన్ నాయకులు మంగళవారం వెలగపూడి సచివాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్ల తరఫున పలు కీలక అంశాలను కమిటీ దృష్టికి తీసుకెళ్లారు. పీఆర్సీ నివేదిక కోసం రాష్ట్రవ్యాప్తంగా ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారని, అందువల్ల కమిటీ తన అధ్యయనాన్ని వేగవంతం చేసి నివేదికను త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. గత పీఆర్సీ సమయంలో ఉద్యోగులకు సంబంధించిన వివిధ భత్యాలు, ఇతర సర్వీసు అంశాలపై ఉత్తర్వుల జారీ విషయంలో అనేక సమస్యలు, జాప్యాలు చోటుచేసుకున్నాయని ప్రస్తావించారు. ఈసారి అటువంటి పరిస్థితులు పునరావృతం కాకుండా అన్ని అంశాలను సమగ్రంగా పరిశీలించి ఉద్యోగులకు న్యాయం జరిగేలా సిఫార్సులు చేయాలని విజ్ఞప్తి చేశారు.

ప్రస్తుతం ప్రభుత్వ శాఖల వద్ద ఉద్యోగుల వేతనాలు, సర్వీసు వివరాలు, భత్యాలు, ఇతర ఆర్థిక అంశాలకు సంబంధించిన సమాచారం డిజిటల్ రూపంలో అందుబాటులో ఉందని, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవడం ద్వారా సమాచార సేకరణ, విశ్లేషణ ప్రక్రియను వేగవంతం చేయవచ్చని వివరించారు. తద్వారా పీఆర్సీ నివేదికను సమగ్రంగా, వాస్తవ సమాచార ఆధారంగా రూపొందించేందుకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. గత మూడు సంవత్సరాలుగా ఉద్యోగులు ఎదుర్కొన్న కాలపరమైన నష్టాన్ని, ఆర్థిక నష్టాన్ని కూడా పరిగణనలోకి తీసుకుని పీఆర్సీ సిఫార్సులు రూపొందించాలని నాయకులు కోరారు.

ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లకు సంబంధించిన అన్ని సమస్యలు, వారి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని న్యాయబద్ధమైన సిఫార్సులు చేయాలని విజ్ఞప్తి చేశారు.

ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. వెంకటేశ్వర్లు, ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షురాలు మంజుల, ప్రధాన కార్యదర్శి బసవలింగం, గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు జానీ పాషా, కార్యదర్శి అంకమ్మ రాజు, ఏపీ పెన్షనర్స్ అసోసియేషన్ తరఫున జి. నారాయణరావు, విష్ణువర్ధన్ రావు, ట్రెజరీ అసోసియేషన్ అధ్యక్షుడు పాము శ్రీనివాసరావు, కార్యదర్శి రమణ రెడ్డి, అనిమల్ హస్బెండరీ ఎంప్లాయీస్ ఫెడరేషన్ చైర్మన్ సేవా నాయక్, కార్యదర్శి రామకృష్ణ, ఇరిగేషన్ ఎన్జీవోస్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి సి. హెచ్. కృష్ణారెడ్డి, రాష్ట్ర సహాధ్యక్షుడు పి. రమేష్, టెక్నికల్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమయాజులు, సీపీఎస్ ఎంప్లాయీస్ రాష్ట్ర అధ్యక్షుడు సి. మరియదాసు పాల్గొన్నారు.

అదేవిధంగా ఏపీ ఎన్జీజీఓస్ అసోసియేషన్ రాష్ట్రకోశాధికారి ఎన్. భారతి ప్రసాద్, రాష్ట్రప్రచార కార్యదర్శి డి. జానకి, రాష్ట్ర కార్యదర్శి ఎల్. రజనీష్ బాబు, గుంటూరు జిల్లా అధ్యక్షుడు జి. శ్రీనివాసరావు, ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు డి. సత్యనారాయణ రెడ్డి, విజయవాడ నగర శాఖ అధ్యక్షుడు చి. హెచ్. సి. వి. ఆర్. ప్రసాద్, క్యాపిటల్ సిటీ అధ్యక్షుడు చి. హెచ్. నాగభూషణం, కార్యదర్శి కిషోర్, ఆర్గనైజింగ్ కార్యదర్శి చి. హెచ్. శ్రీధర్, సంయుక్త కార్యదర్శి దాసు, పశ్చిమ గోదావరి జిల్లా అధ్యక్షుడు యు. పాండురంగారావు పాల్గొన్నారు. అలాగే ఏఐఎస్‌జీఈఎఫ్ మహిళా సబ్ కమిటీ కన్వీనర్ ఎం. రాజలక్ష్మి, ఎన్ఈసీ సభ్యురాలు శాంతిశ్రీ, ఏపీ ఎన్జీజీఓస్ అసోసియేషన్ రాష్ట్ర మహిళా విభాగం సంయుక్త కన్వీనర్ పి. సురేఖ, ఏ. పురుషోత్తమ నాయుడు తదితరులు పాల్గొన్నారు. పీఆర్సీ కమిటీ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్ల ఆకాంక్షలను పరిగణనలోకి తీసుకుని పారదర్శకంగా, సమగ్రంగా, నిర్ణీత కాలవ్యవధిలో నివేదికను రూపొందిస్తుందని నాయకులు ఆశాభావం వ్యక్తం చేశారు.

న్యాయవ్యవస్థపై అవిశ్వాసం కలిగించిన సుప్రీంకోర్టు తీర్పు : బిల్కిస్ బానో



న్యూఢిల్లీ (జర్నలిస్ట్ ఫైల్) : సుప్రీంకోర్టు తీర్పు తనకు న్యాయవ్యవస్థపై అవిశ్వాన్ని కలిగించిందని2002 గుజరాత్ అల్లర్ల బాధితురాలు బిల్సిస్ బానో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ ఉత్తర్వులకు వ్యతిరేకంగా పోరాడతానని స్పష్టం చేశారు. సీనియర్ న్యాయవాది శోభా గుప్తా ద్వారా బిల్కిస్ మంగళ వారం ఒక ప్రకటన విడుదల చేశారు. సోమవారం నాటి తీర్పు తనను దిగ్భ్రాంతికి, బాధకు గురిచేసిందని, న్యాయవ్యవస్థపై అవిశ్వాన్ని కలిగించిందని పేర్కొన్నారు. “మరోసారి, అంటే రెండవసారి కూడా సుప్రీంకోర్టు నన్ను పిలవకుండానే ఒక ఉత్తర్వు జారీ చేసిందంటే నమ్మలేకపోతున్నాను. తీర్పు గురించి నాకు పత్రికా కథనాల ద్వారా తెలిసింది” అని ఆ ప్రకటనలో తెలిపారు. “నాకు అన్యాయం చేసిన నిందితుల శిక్షను సుప్రీంకోర్టు ఎలా నిలిపివేయగలదు. కనీసం నాకు సమాచారం కూడా ఇవ్వలేదు. కోర్టులో నా వాదనను ఎందుకు వినలేదు ” అని బానో ప్రశ్నించారు. అక్టోబర్ 28న ఈ ఉత్తర్వులు జారీ చేయడానికి ముందు కూడా తనకు సమాచారం ఇవ్వలేదని, తన వాదనను కూడా వినిపించలేదని ఆమె తెలిపారు. “శిథిలమైన జీవితాన్ని తిరిగి నిర్మించుకున్నాను. నవ్వడం నేర్చుకున్నాను. కానీ, అక్టోబర్ 28 నాటి ఉత్తర్వులు నన్ను మరోసారి భయాందోళనకు గురిచేశాయి” అని అన్నారు. అక్టోబర్ 28 నాటి ఉత్తర్వులను తాను వ్యతిరేకిస్తున్నానని ఆ ప్రకటనలో పేర్కొన్నారు. “ నేను తప్పనిసరిగా ఈ పోరాటం చేయాలి. నా పిల్లల కోసం ఈ నిర్ణయం తీసుకున్నాను. వారు జీవితాంతం భయాలు, గాయాల జ్ఞాపకాలతో బతకాల్సిన అవసరం లేదు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న మహిళలందరి కోసం కూడా నేను ఈ పోరాటం చేస్తున్నాను. ఎందుకంటే ఏ మహిళా, బాధితురాలైనా, పౌరురాలైనా తమ అస్తిత్వాన్ని, సమానత్వ హక్కును నిరూపించుకునేందుకు నిరంతరం పరీక్షలను ఎదుర్కోవాల్సిన పరిస్థితి ఉండకూడదు. జీవితాంతం న్యాయం కోసం పోరాడాల్సిన దుస్థితి రాకూడదు” అని ఆమె ప్రకటనలో స్పష్టం చేశారు. సుప్రీంకోర్టు తీర్పుకు వ్యతిరేకంగా పోరాడతానని పునరుద్ఘాటించారు. 2002 గుజరాత్ అల్లర్ల కేసులో సుప్రీంకోర్టు సోమవారం ఇద్దరు నిందితుల జీవిత ఖైదును రద్దు చేయడంతో పాటు బెయిల్ మంజూరు చేసిన సంగతి తెలిసిందే.

ఎస్ఐఆర్ తరువాత 75 లక్షల ఓట్లు చేర్పు

న్యూఢిల్లీ : ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియ తరువాత తుది ఓటర్ల జాబితాలు ప్రచురించిన కొన్ని నెలల వ్యవధిలోనే మళ్లీ 75 లక్షల ఓట్లను చేర్చడం సంచలనంగా మారింది. ఇటీవల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఎస్ఆర్) ప్రక్రియ నిర్వహించిన సంగతి తెలిసిందే. 13 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో ఈ ఎస్ఐఆర్ తరువాత ప్రచురించిన ముసాయిదా ఓటర్ల జాబితాలలో ఈ 75 లక్షల కొత్త పేర్లను చేర్చారు. ఈ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలన్నింటి లోనూ కొన్ని నెలల క్రితమే ఎస్ఐఆర్‌ను నిర్వహించారు. ఎస్ఐఆర్‌కు ముందు ఈ రాష్ట్రాల్లోని మొత్తం ఓటర్ల సంఖ్య 49.61 కోట్లుగా ఉండగా, ఎస్ఐఆర్ తర్వాత అది 45.22 కోట్లకు తగ్గింది. ఇప్పుడు మళ్లీ ముసాయిదా ఎస్-ఎస్ఆర్ జాబితాతో 45.96 కోట్లకు పెరిగింది. మొత్తం మీద 1.64 శాతం పెరుగుదల నమోదైంది. ఉత్తర ప్రదేశ్‌లో సంఖ్యాపరంగా అత్యధికంగా 18.84 లక్షల పేర్లు ఓటర్ల జాబితాలో చేర్చారు. గోవాలో అత్యధికంగా 3.01 శాతం పేర్లు చేర్చారు. 2025లో ఎస్ఐఆర్ ప్రక్రియను చేపట్టిన మొదటి రాష్ట్రమైన బీహార్‌లో 13.89 లక్షల పేర్లు చేర్చారు. రాజస్థాన్‌లో 11.48 లక్షలకు పైగా ఓటర్లు చేర్చారు. ఆ తర్వాతి స్థానాల్లో వరుసగా ఉత్తరాఖండ్ (1.19 లక్షలు), మధ్యప్రదేశ్ (8.9 లక్షలు), తమిళనాడు (10.39 లక్షలు) ఉన్నాయి.

త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరిగే ఉత్తరాఖండ్, ఉత్తర ప్రదేశ్, పంజాబ్‌తో సహా 17 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలలో అక్టోబర్ 15న ఎస్ఎస్ఆర్‌ను తొలిసారిగా ప్రకటించారు. ఈ నెల 5న మరో ఆరు రాష్ట్రాలకు దీనిని విస్తరించారు. కర్ణాటక, మేఘాలయలో కూడా ఎస్ఎస్ఆర్‌ను నిర్వహిస్తామని అధికారులు ఈ నెల 16న ప్రకటించారు.

‘పిఎం-సూర్య ఘర్’ అమలులో 4వ స్థానం



అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) : పిఎం-సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ యోజన అమలులో రాష్ట్రం 4వ స్థానంలో నిలిచిందని ఇంధనశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె విజయానంద్ వెల్లడించారు. విజయవాడలోని విద్యుత్ సౌధలో ఎపి ట్రాన్స్‌కో జెఎమ్‌డి సూర్యసాయి ప్రవీణ్ చంద్, డిస్కమ్‌ల సిఎమ్‌డిలు, నెడ్‌క్యాప్ విసి ఎం కమలాకరబాబు, ఎస్ఇలు, కెఆర్ఇసిఎస్, ఇపిసి, రెస్కో సంస్థల ప్రతినిధులతో మంగళవారం ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా విజయానంద్ మాట్లాడుతూ.. ఈ నెల 15వ తేదీ నాటికి రాష్ట్ర వ్యాప్తంగా 7,39,260 ఇళ్లపై రూఫ్ టాప్ సోలార్ వ్యవస్థలు ఏర్పాటు చేశామన్నారు. దేశ వ్యాప్తంగా 56,97,531 ఇళ్లపై ఏర్పాటు చేయగా, అందులో రాష్ట్రం వాటా దాదాపు 13 శాతమని తెలిపారు. ఉత్తరప్రదేశ్, గుజరాత్, మహారాష్ట్ర తొలి 3 స్థానాల్లో ఉన్నాయన్నారు. యుఎల్ఎ విధానంలో ఎస్సి, ఎస్టి లబ్ధిదారుల కోసం 5,09,004 ఇళ్లపైనా, క్యాపెక్స్ విధానంలో వినియోగదారుల పెట్టుబడితో 2,30,256 ఇళ్లపైనా సోలార్ ప్యానల్స్ అమర్చినట్లు పేర్కొన్నారు. అలాగే చిత్తూరు జిల్లాలో ప్రయోగాత్మక సోలార్ ప్రాజెక్టు పురోగతిని ఆయన సమీక్షించారు.

ఆంధ్ర వైద్య కళాశాల అభివృద్ధికి అంకానా భారీ చేయూత

- రూ.20 కోట్లతో నిర్మించిన పరిశోధన కేంద్ర భవనం త్వరలో ప్రారంభం
- రూ.7.95 కోట్లతో లెక్చర్ గ్యాలరీల నిర్మాణానికి ముందుకొచ్చిన అంకానా
- ఇప్పటికే రూ.50 కోట్లతో శతాబ్ది భవనం నిర్మాణం
- పూర్వ వైద్య విద్యార్థుల దాతృత్వాన్ని కొనియాడిన మంత్రి సత్యకుమార్ యాదవ్



అమరావతి, నవంబర్ 17 (జర్నలిస్ట్ ఫైల్): విదేశాల్లో స్థిరపడినా.. తాము చదువుకున్న కళాశాల అభివృద్ధిని పూర్వ విద్యార్థులు మరువలేదు. విశాఖపట్నంలోని ఆంధ్ర వైద్య కళాశాల రూపురేఖలు మార్చేలా కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు చేపడుతూ ఆంధ్రా మెడికల్ కాలేజ్ పూర్వ విద్యార్థులు(అంకొసా), అలుమ్నీ అసోసియేషన్ ఆఫ్ నార్త్ అమెరికా (అంకానా) పూర్వ విద్యార్థులు స్ఫూర్తిగా నిలుస్తున్నారు. రాష్ట్రంలోనే అత్యంత ప్రాచీనమైన ఈ కళాశాల అవసరాలకు అనుగుణంగా భవన నిర్మాణాలు చేపడుతూ విద్యార్థులకు సౌకర్యాలను మెరుగుపరుస్తున్నారు. ఇప్పటికే రూ.50 కోట్లతో శతాబ్ది పూర్వ విద్యార్థుల భవనాన్ని నిర్మించారు. మరో రూ.20 కోట్లతో అత్యాధునిక క్లినికల్ అండ్ బయోమెడికల్ పరిశోధన కేంద్ర భవనాన్ని నిర్మించారు. ఈ భవనం ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉంది. తాజాగా విద్యార్థుల అవసరాల కోసం లెక్చర్ గ్యాలరీలను పూర్తిగా తమ రూ.7.95 కోట్లతో నిర్మించేందుకు అంకానా ముందుకొచ్చింది. డిఎంఈ నుంచి వచ్చిన ఈ ప్రతిపాదనలకు వైద్య,ఆరోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆమోదం తెలిపారు.

రూ.20 కోట్లతో పరిశోధన కేంద్ర భవన నిర్మాణం పూర్తి

ఆంధ్ర వైద్య కళాశాల శతాబ్ది ఉత్సవాల సందర్భంగా చేపట్టిన క్లినికల్ అండ్ బయోమెడికల్ పరిశోధన కేంద్ర భవన నిర్మాణం పూర్తయింది. త్వరలో దీన్ని ప్రారంభించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. ఈ కేంద్రం నిర్మాణానికి అవసరమైన రూ.20కోట్లను అంకానా పూర్తిగా భరించింది. కళాశాల, కింగ్ జార్జి ఆసుపత్రి ప్రాంగణంలో 20 వేల చదరపు అడుగులకు పైగా విస్తీర్ణంలో నిర్మించిన ఈ కేంద్రం అందుబాటులోకి వస్తే వైద్య పరిశోధనలకు కొత్త వేదికగా నిలవనుంది. వైద్య అధ్యాపకులు, పీజీ విద్యార్థులకు పరిశోధన అవకాశాలు పెరుగుతాయని డిఎంఈ డాక్టర్ విష్ణువర్ధన్ తెలిపారు.

లెక్చర్ గ్యాలరీల నిర్మాణానికి రూ.7.95 కోట్లు

సుమారు 300 మంది కూర్చునే సామర్థ్యంతో లెక్చర్ గ్యాలరీలు, క్లోక్ రూమ్‌లతో కూడిన మూడు అంతస్తుల భవనాన్ని నిర్మించేందుకు అంకానా సిద్ధమని ప్రకటించింది. ఈ నేపథ్యంలో రూ.7.95 కోట్ల అంచనా వ్యయంతో భవన నిర్మాణానికి ప్రభుత్వం పరిపాలనా అనుమతులు ఇచ్చింది. ఈ భవనాన్ని పూర్తిగా తమ నిధులతో నిర్మించేందుకు అంకానా ముందుకొచ్చినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కెవియస్ఎం సంధ్యాదేవి తెలిపారు.

తల్లిపాల బ్యాంకు ఏర్పాటుకూ సహకారం

కింగ్ జార్జి ఆసుపత్రిలో సుమారు రూ.2.30 కోట్లతో సుశేన మదర్స్ మిల్క్ బ్యాంకు, సమగ్ర పాలిచ్చే నిర్వహణ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నారు. ఈ ప్రాజెక్టుకు అంకానా, సుశేన హెల్త్ ఫౌండేషన్ ప్రధానంగా నిధులు సమకూరుస్తుండగా, ఆంధ్ర వైద్య కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం కూడా సహకరిస్తోంది. నెలలు నిండకముందే పుట్టిన పిల్లలు, తక్కువ బరువుతో జన్మించిన శిశువులు, తీవ్ర అనారోగ్యంతో ఉన్న నవజాత శిశువులకు పరీక్షించి, శుద్ధి చేసిన తల్లిపాలను అందించేందుకు ఈ కేంద్రం ఉపయోగపడుతుంది.


రూ.60 కోట్లతో ఎంసీహెచ్ భవన నిర్మాణం చేపట్టేందుకు అంకానా సానుకూలత

రూ.60 కోట్ల అంచనా వ్యయంతో ఎంసీహెచ్ (మాతా శిశు సంరక్షణ) భవన నిర్మాణానికి అంకానా ముందుకొచ్చింది. ఈ ప్రాజెక్టుకు అవసరమైన నిధులు సమకూర్చేందుకు సంసిద్ధత వ్యక్తం చేసింది. ఇటీవల స్థల పరిశీలన జరగ్గా, భవన నిర్మాణంపై సంప్రదింపులు కొనసాగుతున్నాయని కళాశాల ప్రిన్సిపాల్ తెలిపారు.

రూ.50 కోట్లతో శతాబ్ది భవనం: ఆంధ్ర వైద్యకళాశాల శతాబ్ది ఉత్సవాల సందర్భంగా రూ.50 కోట్లతో శతాబ్ది పూర్వ విద్యార్థుల భవనాన్ని నిర్మించారు. ఇందులో సుమారు 600 మంది కూర్చునే సామర్థ్యమున్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆడిటోరియం ఉంది. ఈ నిర్మాణానికి అంకానా సుమారు రూ.40 కోట్లు సమకూర్చింది. ఆంధ్ర వైద్య కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం, ఇతర పూర్వ విద్యార్థులూ సహకరించారు. ప్రస్తుతం ఈ భవనాన్ని సదస్సులు, సమావేశాలు, శిక్షణ కార్యక్రమాలు, అధ్యాపకులు--విద్యార్థుల పరస్పర చర్చలకు వినియోగిస్తున్నారు. ఈ భవనాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రారంభించారు. పండేళ్ల చరిత్ర కలిగిన ఆంధ్ర వైద్య కళాశాల అభివృద్ధికి నిరాటకంగా, నిస్వార్థంగా నిధులు సమకూరుస్తూ భావి వైద్యులకు స్ఫూర్తిగా నిలుస్తున్న అంకానా ప్రతినిధుల దాతృత్వాన్ని మంత్రి కొనియాడారు.

జర్నలిస్ట్ ఫైల్ JOURNALIST FILE
సంపాదక స్వరం EDITORIAL
ప్రజా ప్రయోజనం | వాస్తవ విశ్లేషణ | బాధ్యతాయుత అభిప్రాయం

కృష్ణ జన్మభూమి చుట్టూ యూపీ ఎన్నికల రాజకీయం



భారత రాజకీయాల్లో ఆధ్యాత్మిక విశ్వాసాలు, సాంస్కృతిక వారసత్వం, అభివృద్ధి అంశాలు ఎన్నికల అజెండాను ప్రభావితం చేస్తుంటాయి. ఉత్తరప్రదేశ్ రాజకీయాల్లో అయోధ్య రామమందిర ఉద్యమం ఒక కీలక మలుపుగా నిలిచింది. ఇప్పుడు 2027 అసెంబ్లీ ఎన్నికలకు సమాయత్తమవుతున్న భారతీయ జనతా పార్టీ (బీజేపీ) మధురలోని శ్రీకృష్ణ జన్మభూమి అంశంపై మరోసారి దృష్టి సారించడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. అయోధ్య తర్వాత మధురను ఎన్నికల చర్చలోకి తీసుకురావడం వెనుక ఉన్న రాజకీయ వ్యూహం ఏమిటన్నది ఇప్పుడు దేశవ్యాప్తంగా ఆసక్తికర చర్చగా మారింది.

నవంబర్ 16, 17 తేదీల్లో మధురలో నిర్వహించిన బీజేపీ రెండు రోజుల మేధోమథన సమావేశం ఈ పరిణామాలకు వేదికైంది. జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్, ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్, ఉప ముఖ్యమంత్రులు కేశవ్ ప్రసాద్ మౌర్య, బ్రజేశ్ పాఠక్, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పంకజ్ చౌధరి తదితర ముఖ్య నాయకులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. బూత్ స్థాయి నుంచి పార్టీ సంస్థాగత బలోపేతం, ప్రభుత్వ పథకాల లబ్ధిదారులతో సంబంధాలు, యువత, మహిళలు, వివిధ సామాజిక వర్గాల మద్దతు, ప్రతిపక్షాల వ్యూహాలకు ప్రతివ్యూహాలు వంటి అంశాలు చర్చకు వచ్చాయి. ఈ సమావేశానికి మధురను వేదికగా ఎంచుకోవడం వెనుక రాజకీయ, సాంస్కృతిక ప్రాధాన్యం స్పష్టంగా కనిపిస్తోంది. అయోధ్యలో రామమందిర నిర్మాణం, వారణాసిలో కాశీ విశ్వనాథ ధామ్ అభివృద్ధి తర్వాత బ్రజ్ ప్రాంతంపై బీజేపీ ప్రత్యేక దృష్టి పెట్టినట్లు తాజా పరిణామాలు సూచిస్తున్నాయి. మధుర, బృందావనం, గోవర్ధనం, బర్సానా, గోకులం వంటి ప్రాంతాలు శ్రీకృష్ణుడి జీవితంతో ముడిపడిన ఆధ్యాత్మిక కేంద్రాలు. ఈ ప్రాంతాలకు ఉత్తరప్రదేశ్‌తో పాటు దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి భక్తులు తరలివస్తుంటారు. అందువల్ల ఇక్కడి ఆధ్యాత్మిక ప్రాధాన్యాన్ని అభివృద్ధి, పర్యాటకం, రాజకీయ చైతన్యంతో అనుసంధానించే ప్రయత్నం బీజేపీకి వ్యూహాత్మకంగా ఉపయోగపడవచ్చు.

మధుర సమావేశం సందర్భంగా ఉత్తరప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి కేశవ్ ప్రసాద్ మౌర్య చేసిన వ్యాఖ్యలు ఈ చర్చకు మరింత రాజకీయ ప్రాధాన్యం తీసుకొచ్చాయి. అయోధ్య రామమందిర ఉద్యమాన్ని ప్రస్తావిస్తూ 'అయోధ్య తర్వాత మధుర వంతు' అనే సంకేతాన్ని ఇచ్చారు. మధురలో శ్రీకృష్ణ జన్మస్థానంలో అయోధ్య రామమందిరం తరహాలో గొప్ప ఆలయం నిర్మించాలన్న ఆకాంక్షను ఎంపీ హేమమాలిని కూడా వ్యక్తం చేశారు. ఈ అంశంపై పార్టీ నాయకత్వం చర్చలు జరుపుతున్నప్పటికీ, సమావేశం నుంచి వెలువడిన అధికారిక నిర్ణయం ఏదీ ఇప్పటివరకు ప్రకటించలేదు. కాబట్టి రాజకీయ నేతల వ్యాఖ్యలను తుది నిర్ణయాలుగా భావించడం సరికాదు.

న్యాయస్థానాల పరిధిలో వివాదం : మధురలోని శ్రీకృష్ణ జన్మభూమి–షాహీ ఈద్గా మసీదు వివాదం దశాబ్దాలుగా కొనసాగుతోంది. కత్రా కేశవ్‌దేవ్ ప్రాంతంలోని 13.37 ఎకరాల స్థలానికి సంబంధించి హిందూ పక్షం, ముస్లిం పక్షాల మధ్య వివాదం న్యాయస్థానాల్లో విచారణలో ఉంది. 1968లో కుదిరినట్లు చెబుతున్న ఒప్పందం చెల్లుబాటును కూడా పిటిషనర్లు సవాలు చేస్తున్నారు. అలహాబాద్ హైకోర్టులో పలు వ్యాజ్యాలు పెండింగ్‌లో ఉన్నాయి. 2024లో హైకోర్టు కొన్ని పిటిషన్ల విచారణార్హత్తపై మసీదు కమిటీ అభ్యంతరాలను తిరస్కరించినప్పటికీ, దానిని వివాదంపై తుది తీర్పుగా పరిగణించరాదు. సుప్రీంకోర్టులోనూ సంబంధిత అంశాలపై విచారణ కొనసాగుతోంది. అక్టోబర్ 13న అలహాబాద్ హైకోర్టు కేసులకు సంబంధించిన రికార్డుల స్థితిని పరిశీలించి, తదుపరి విచారణను నవంబర్ 20కి వాయిదా వేసింది.

ఇక్కడ అత్యంత కీలకమైన అంశం న్యాయవ్యవస్థపై గౌరవం. చారిత్రక, మతపరమైన వాదనలు ఎంత బలంగా ఉన్నా వాటికి చట్టబద్ధమైన పరిష్కారం న్యాయస్థానాల ద్వారానే రావాలి. రాజకీయ నాయకుల వ్యాఖ్యలు, కార్యకర్తల డిమాండ్లు లేదా ఎన్నికల సభల్లో చేసే ప్రకటనలు న్యాయప్రక్రియకు ప్రత్యామ్నాయం కాలేవు. వివాదాస్పద స్థలాల విషయంలో చట్టాలు, రాజ్యాంగ విలువలు, న్యాయస్థానాల ఆదేశాలు పాటించడం ప్రజాస్వామ్య వ్యవస్థకు అత్యవసరం. విశ్వాసాలను గౌరవించడంతో పాటు సామాజిక సామరస్యాన్ని కాపాడటం కూడా పాలకుల బాధ్యత.

ఎన్నికల లెక్కలు.. అభివృద్ధి ప్రాధాన్యం : 2027 ఎన్నికల్లో మధుర అంశం బీజేపీకి ఎంతవరకు రాజకీయ ప్రయోజనం చేకూరుస్తుందనేది ఆసక్తికరమైన ప్రశ్న. పశ్చిమ ఉత్తరప్రదేశ్‌లో కుల, సామాజిక సమీకరణాలు ఎన్నికల ఫలితాలను ప్రభావితం చేస్తాయి. ఈ నేపథ్యంలో శ్రీకృష్ణ జన్మభూమి అంశం ద్వారా హిందూ ఓటర్లలో ఐక్యతను పెంచుకోవాలన్న వ్యూహం బీజేపీకి ఉండవచ్చని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. మరోవైపు సమాజ్‌వాదీ పార్టీ వంటి ప్రతిపక్షాలు సామాజిక న్యాయం, వెనుకబడిన వర్గాలు, దళితులు, మైనారిటీల సమస్యలను ప్రధానంగా ప్రస్తావిస్తున్నాయి. ఈ భిన్నమైన రాజకీయ అజెండాల మధ్య 2027 ఎన్నికల పోరు మరింత ఆసక్తికరంగా మారనుంది.

అయితే ఉత్తరప్రదేశ్ వంటి పెద్ద రాష్ట్రంలో ఎన్నికల విజయం ఒక్క మతపరమైన అంశంపైనే ఆధారపడదు. శాంతిభద్రతలు, మహిళల భద్రత, నిరుద్యోగం, వ్యవసాయ సంక్షోభం, విద్య, వైద్యం, మౌలిక సదుపాయాలు, ధరల పెరుగుదల, సంక్షేమ పథకాల అమలు వంటి అంశాలు ప్రజల దైనందిన జీవితాన్ని ప్రభావితం చేస్తాయి. బీజేపీ మధుర సమావేశంలోనూ బూత్ స్థాయి సంస్థాగత బలోపేతం, ప్రభుత్వ పథకాల లబ్ధిదారులతో సంబంధాలు, మహిళలు, యువత, కొత్త ఓటర్లను చేరుకోవడం వంటి అంశాలకు ప్రాధాన్యం ఇచ్చినట్లు సమాచారం. ఉప ముఖ్యమంత్రి కేశవ్ మౌర్య శ్రీకృష్ణ జన్మభూమి అంశాన్ని ఎన్నికల ప్రచారంలో కీలకంగా ప్రస్తావించగా, పార్టీ ఎన్నికల వ్యూహంలో శాంతిభద్రతలు, మహిళల భద్రత, సంక్షేమ పథకాల లబ్ధిదారుల చేరువ కూడా ముఖ్యమైనవిగా కనిపిస్తున్నాయి.

మధురను ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయడానికి కూడా విస్తృత అవకాశాలున్నాయి. యాత్రికులకు మెరుగైన రవాణా సదుపాయాలు, పరిశుభ్రమైన ఘాట్లు, పారిశుద్ధ్యం, తాగునీరు, వసతి, భద్రత, స్థానిక కళలు, హస్తకళలకు మార్కెట్ కల్పించడం ద్వారా స్థానిక ఆర్థిక వ్యవస్థకు ఊతమివ్వవచ్చు. ఆలయాల అభివృద్ధితో పాటు బృందావనం, గోవర్ధనం, బర్సానా, గోకులం వంటి ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాలి. భక్తుల రాక పెరగడం స్థానిక ప్రజలకు ఉపాధి, వ్యాపార అవకాశాలను కల్పించాలి.

విశ్వాసానికి గౌరవం.. ప్రజాస్వామ్యానికి విలువ : రాజకీయ పార్టీలు మత, సాంస్కృతిక అంశాలను తమ సిద్ధాంతపరమైన అజెండాలో భాగంగా ప్రస్తావించడం ప్రజాస్వామ్యంలో సహజం. అయితే ఎన్నికల ప్రయోజనాల కోసం సున్నితమైన మతపరమైన వివాదాలను రెచ్చగొట్టే ధోరణి సమాజానికి మేలు చేయదు. ఒక వర్గం విశ్వాసాలను గౌరవించడం మరో వర్గం హక్కులను విస్మరించడం ద్వారా సాధ్యం కాదు. పరస్పర గౌరవం, చట్టబద్ధత, శాంతి, సామరస్యమే భారత రాజ్యాంగం నిర్దేశించిన మార్గం. అయోధ్య అనుభవం తర్వాత మధురపై బీజేపీ దృష్టి సారించడం రాజకీయంగా ఒక వ్యూహాత్మక అడుగే కావచ్చు. కానీ ఈ అంశంపై భవిష్యత్తు పరిణామాలు న్యాయస్థానాల తీర్పులు, చట్టపరమైన ప్రక్రియల ఆధారంగానే నిర్ణయించబడాలి. ఎన్నికల్లో ప్రజల మద్దతు పొందాలంటే ఆధ్యాత్మిక భావోద్వేగాలతో పాటు పాలనా పనితీరును కూడా నిరూపించుకోవాలి. మధురకు ఆధ్యాత్మిక వైభవం ఎంత ముఖ్యమో, అక్కడి ప్రజలకు అభివృద్ధి, ఉపాధి, భద్రత, సామరస్యం కూడా అంతే ముఖ్యం. ఎన్నికల అజెండా ఈ సమతౌల్యాన్ని కాపాడినప్పుడే ప్రజాస్వామ్యానికి నిజమైన ప్రయోజనం చేకూరుతుంది.



యమునా నురగలు..

పాలకులకు పర్యావరణ హెచ్చరిక

- **పూజించే నదులనే కలుషితం చేస్తే ఎలా?**
- **నదుల పవిత్రత ఆచారాల్లో కాదు.. ఆచరణలో కనిపించాలి**
- **పండుగల వేళ హడావుడి కాదు, శాశ్వత ప్రక్షాళనే పరిష్కారం**

భారతీయ సంస్కృతిలో నదులకు ప్రత్యేకమైన స్థానం ఉంది. అవి కేవలం నీటి వనరులు మాత్రమే కాదు.. కోట్లాది ప్రజల విశ్వాసాలకు, ఆచార సంప్రదాయాలకు, జీవనాధారాలకు ప్రతీకలు. గంగ, యమున వంటి నదులను పవిత్రంగా భావించి పూజించే సంప్రదాయం తరతరాలుగా కొనసాగుతోంది. అయితే అదే నదులు నేడు మానవ నిర్లక్ష్యానికి, పారిశ్రామిక కాలుష్యానికి బలవుతూ ఉండటం ఆందోళన కలిగిస్తోంది. ఢిల్లీలో ఛత్ పూజ సందర్భంగా యమునా నదిలో కనిపించిన తెల్లటి నురగలు ఈ దుస్థితికి మరోసారి అద్దం పట్టాయి.

సూర్యభగవానుడికి అర్ఘ్యం సమర్పిస్తూ భక్తిశ్రద్ధలతో నిర్వహించే ఛత్ పూజకు ఉత్తర భారతదేశంలో విశేష ప్రాధాన్యం ఉంది. ముఖ్యంగా బిహార్, ఉత్తరప్రదేశ్, జార్ఖండ్ ప్రాంతాలకు చెందిన ప్రజలు ఈ పండుగను అత్యంత నిష్ఠతో జరుపుకుంటారు. ఢిల్లీలోనూ వేలాది మంది భక్తులు యమునా తీరంలో పూజా కార్యక్రమాల్లో పాల్గొంటారు. అయితే ఈ ఏడాది పండుగ సమయంలో నది నీటిపై దట్టంగా పేరుకున్న తెల్లటి నురగలు భక్తుల ఆరోగ్య భద్రతపై ప్రశ్నలు లేవనెత్తాయి. పవిత్ర స్నానాలు ఆచరించాల్సిన నీరు కలుషితమై కనిపించడం భక్తిభావనకు, పర్యావరణ వాస్తవానికి మధ్య ఉన్న వైరుధ్యాన్ని స్పష్టం చేసింది.

యమునాలో ఈ నురగలు అకస్మాత్తుగా ఏర్పడినవి కావు. శుద్ధి చేయని మురుగునీరు, గృహాలు, పరిశ్రమల నుంచి వెలువడే డిటర్జెంట్లు, రసాయన వ్యర్థాలు నదిలో కలవడం ప్రధాన కారణాలుగా పర్యావరణ నిపుణులు పేర్కొంటున్నారు. నదిలో నీటి ప్రవాహం తగ్గినప్పుడు కాలుష్య కారకాలు ఒకేచోట ఎక్కువగా పేరుకుపోతాయి. బ్యారేజీల వద్ద నీటి కదలికతో అవి నురగల రూపంలో కనిపిస్తాయి. ఈ సమస్య ప్రతి ఏడాది శీతాకాలం సమీపంలో, ముఖ్యంగా ఛత్ పూజ సమయంలో వెలుగులోకి వస్తున్నా శాశ్వత పరిష్కారం దిశగా ఆశించిన పురోగతి కనిపించడం లేదు.

ఇది కేవలం నది అందవిహీనంగా కనిపిస్తోందనే సమస్య కాదు. నీటిలోని కాలుష్యం ప్రజారోగ్యానికీ, జలచరాల మనుగడకూ ముప్పుగా మారే ప్రమాదం ఉంది. ఢిల్లీ కాలుష్య నియంత్రణ కమిటీ సెప్టెంబర్ 2026లో సేకరించిన నమూనాల వివరాల ప్రకారం, ఐఎన్‌బీటీ వంతెన వద్ద మల కాలిఫార్మ్ స్థాయి 35,000 ఎంఎన్‌పీ/100 మిల్లీలీటర్లుగా నమోదైంది. స్నానానికి నిర్దేశించిన గరిష్ఠ పరిమితి 2,500తో పోలిస్తే ఇది చాలా ఎక్కువ. అదే ప్రాంతంలో నీటిలో కరిగిన ఆక్సిజన్ స్థాయి కూడా నిర్దేశిత ప్రమాణం కంటే తక్కువగా నమోదైంది. ఈ గణాంకాలు నది నీటి నాణ్యతపై తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి.

నురగలను తొలగించేందుకు నదిపై రసాయన ద్రావణాలు చల్లడం, యంత్రాలతో ఉపరితలాన్ని శుభ్రం చేయడం తాత్కాలిక చర్యలే. అవి కనిపించే కాలుష్యాన్ని కొంతవరకు తగ్గించవచ్చేమో కానీ నదిలోకి చేరుతున్న మురుగునీటిని, పారిశ్రామిక వ్యర్థాలను అరికట్టలేవు. ఛత్ పూజకు ముందు ఢిల్లీ ప్రభుత్వం నురగ తొలగింపు చర్యలు చేపట్టడంతో పాటు శాశ్వత పరిష్కారాలపై అధ్యయనాలు ప్రారంభించినట్లు వార్తలు వచ్చాయి. అయితే నది ప్రక్షాళనకు పండుగల క్యాలెండర్‌తో సంబంధం ఉండకూడదు. ఏడాది పొడవునా నిరంతర చర్యలు అవసరం.

యమునా కాలుష్యంపై రాజకీయ ఆరోపణలు, ప్రత్యారోపణలు ప్రతి ఏడాది వినిపిస్తున్నాయి. అధికారంలో ఉన్నవారు ప్రక్షాళన పనులు జరుగుతున్నాయని చెబుతుంటే, ప్రతిపక్షాలు వైఫల్యాలను ఎత్తిచూపుతున్నాయి. గత ప్రభుత్వాల నిర్లక్ష్యాన్ని ప్రస్తుత పాలకులు ప్రస్తావించడం, ప్రస్తుత పరిస్థితికి ప్రతిపక్షాలను బాధ్యులుగా చేయడం రాజకీయంగా సులభమే. కానీ ప్రజలకు కావాల్సింది ఎవరి మీద ఎవరు నిందలు వేస్తున్నారనే చర్చ కాదు.. స్వచ్ఛమైన యమునా. ప్రభుత్వాలు మారినా నది పరిస్థితి మారకపోవడం పాలనా వ్యవస్థల సమష్టి వైఫల్యాన్ని సూచిస్తోంది.

ఈ సమస్యకు పరిష్కారం సమగ్ర కార్యాచరణలోనే ఉంది. మొదటగా ఢిల్లీ నగరంలోని మురుగునీరు శుద్ధి చేయకుండా యమునాలోకి చేరకుండా చూడాలి. మురుగునీటి శుద్ధి కేంద్రాల సామర్థ్యాన్ని పెంచడంతో పాటు అవి నిరంతరం సమర్థంగా పనిచేస్తున్నాయో పర్యవేక్షించాలి. పరిశ్రమల నుంచి వెలువడే వ్యర్థాలపై కఠిన నియంత్రణ ఉండాలి. నదికి అవసరమైన కనీస నీటి ప్రవాహం కొనసాగేందుకు హర్యానా, ఢిల్లీ తదితర రాష్ట్రాలు సమన్వయంతో వ్యవహరించాలి. నీటి నాణ్యతకు సంబంధించిన నివేదికలను ప్రజలకు అందుబాటులో ఉంచి, కాలుష్యానికి కారణమైన సంస్థలపై బాధ్యత నిర్ధారించాలి.


నదుల ప్రక్షాళన అనేది ఒక ప్రభుత్వానికి మాత్రమే పరిమితమైన కార్యక్రమం కాదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, స్థానిక సంస్థలు, పారిశ్రామిక వర్గాలు, ప్రజలు సమష్టిగా బాధ్యత తీసుకోవాలి. మురుగునీటిని నదుల్లోకి వదలకూడదనే అవగాహన గృహస్థాయి నుంచే మొదలవ్వాలి. పర్యావరణ చట్టాల అమలులో రాజీ పడకుండా, ఉల్లంఘనలకు పాల్పడేవారిపై కఠిన చర్యలు తీసుకోవాలి.

భక్తి పేరుతో ప్రజలు కలుషిత నీటిలోకి దిగాల్సిన పరిస్థితి రావడం ఆలోచించాల్సిన అంశం. భక్తుల విశ్వాసాలను గౌరవించడం అంటే వారికి సురక్షితమైన వాతావరణాన్ని కల్పించడం కూడా. పండుగల సమయంలో ఘాట్లను అందంగా తీర్చిదిద్దడం, తాత్కాలిక ఏర్పాట్లు చేయడం ప్రభుత్వాల బాధ్యతలో ఒక భాగం మాత్రమే. అంతకంటే ముఖ్యంగా నదిలోకి చేరే కాలుష్యాన్ని మూలాల వద్దే అరికట్టాలి.

యమునా నది పరిస్థితి దేశంలోని ఇతర నదులకూ ఒక హెచ్చరిక. నదులను తల్లులుగా పూజిస్తూ, అదే సమయంలో వాటిలోకి మురుగునీరు, రసాయన వ్యర్థాలను వదిలేస్తే మన భక్తికి అర్థం ఏముంటుంది? నదుల పవిత్రతను కేవలం ఆచారాల్లోనే కాకుండా ఆచరణలోనూ కాపాడాలి. ఛత్ పూజ సందర్భంగా యమునా నదిపై కనిపించిన నురగలు పండుగ ముగిసిన తర్వాత మరుగున పడకూడదు. అవి పాలకులకు, ప్రజలకు పర్యావరణ బాధ్యతను గుర్తుచేసే హెచ్చరికగా మిగలాలి. నదులను పూజించడం కన్నా ముందు వాటిని కాలుష్యరహితంగా ఉంచడం మనందరి బాధ్యత.

కొల్లేరు కన్నీటికి శాశ్వత పరిష్కారం ఎప్పుడు?

- **ఉప్పుటేరు రెగ్యులేటర్ల నిర్మాణంపై గ్రామాల ఆశలు..**
- **వరదలు, ఉప్పునీటి చొరబాటు నుంచి ప్రజలకు రక్షణ కల్పించాలి**
- **పర్యావరణ పరిరక్షణకూ ప్రాధాన్యం ఇవ్వాలి**



ఆంధ్రప్రదేశ్ ప్రకృతి సంపదలో కొల్లేరు సరస్సుకు ప్రత్యేక స్థానం ఉంది. కృష్ణా, గోదావరి డెల్టాల మధ్య విస్తరించిన ఈ మంచినీటి సరస్సు వేలాది కుటుంబాలకు జీవనాధారం. రైతులు, మత్స్యకారులు, స్థానిక గ్రామాల ప్రజల ఆర్థిక, సామాజిక జీవనంతో కొల్లేరు విడదీయలేని అనుబంధాన్ని కలిగి ఉంది. వలస పక్షులకు ఆవాసంగా, వరద నీటిని నిల్వ చేసి సమతుల్యం చేసే సహజ జలాశయంగా కూడా దీనికి విశిష్టత ఉంది. అయితే కొల్లేరు పరిసర గ్రామాల ప్రజలు ఎదుర్కొంటున్న వరద ముప్పు, ఉప్పునీటి చొరబాటు, సాగునీరు--చేపల చెరువుల సమస్యలు దశాబ్దాలుగా పరిష్కారం కోసం ఎదురుచూస్తున్నాయి.

ఉప్పుటేరు ద్వారా కొల్లేరు నీరు సముద్రంలోకి ప్రవహిస్తుంది. అదే సమయంలో సముద్రపు ఉప్పునీరు వెనక్కి చొచ్చుకువచ్చే పరిస్థితులు ఏర్పడితే సరస్సు నీటి నాణ్యత, వ్యవసాయం, ఆక్వా రంగంపై ప్రతికూల ప్రభావం పడుతుంది. ఈ సమస్యకు పరిష్కారంగా ఉప్పుటేరుపై రెగ్యులేటర్ల నిర్మాణం చేపట్టాలని స్థానికులు చాలాకాలంగా కోరుతున్నారు. నీటి ప్రవాహాన్ని అవసరానికి అనుగుణంగా నియంత్రించడం, ఉప్పునీటి వెనుక ప్రవాహాన్ని అడ్డుకోవడం, వరద సమయాల్లో నీటిని సమర్థంగా బయటకు పంపించడం వంటి ప్రయోజనాలు ఈ నిర్మాణాల ద్వారా కలగవచ్చన్నది వారి అభిప్రాయం. తాజాగా ఎన్డీఏ ప్రభుత్వానికి గ్రామస్థులు మరోసారి విజ్ఞప్తి చేయడం ఈ సమస్య తీవ్రతను తెలియజేస్తోంది.

ఈ డిమాండ్ కొత్తది కాదు. 2015లోనూ ఉప్పుటేరుపై రెగ్యులేటర్ నిర్మాణం చేపట్టాలని ఆక్వా రైతులు, మత్స్య రంగ ప్రతినిధులు ప్రభుత్వాన్ని కోరారు. 2009లో నిపుణుల బృందం కూడా నీటి ప్రవాహ నియంత్రణకు రెగ్యులేటర్ అవసరాన్ని ప్రస్తావించినట్లు అప్పటి వార్తా కథనాలు వెల్లడించాయి. అయినప్పటికీ సమస్యకు పూర్తిస్థాయి పరిష్కారం లభించలేదు.

2024లో కొల్లేరు పరిసర ప్రాంతాల్లో భారీగా వరద నీరు చేరడంతో అనేక గ్రామాలు, రహదారులు నీట మునిగాయి. ఉప్పుటేరు ప్రవాహ సామర్థ్యం తగ్గడం, కాలువల్లో ఆక్రమణలు, సహజ నీటి మార్గాలకు ఆటంకాలు ఏర్పడటం వంటి అంశాలు వరద ప్రభావాన్ని పెంచినట్లు అప్పటి నివేదికలు పేర్కొన్నాయి. ప్రకృతి సహజంగా నీటిని బయటకు పంపే మార్గాలు కుంచించుకుపోతే దాని భారం చివరకు గ్రామాల ప్రజలే మోయాల్సి వస్తుంది.

రెగ్యులేటర్ల నిర్మాణానికి పర్యావరణ అనుమతులూ కీలకమే : అయితే ఈ సమస్యను కేవలం నిర్మాణాల కోణంలోనే చూడటం సముచితం కాదు. కొల్లేరు అంతర్జాతీయ ప్రాధాన్యం కలిగిన రామ్‌సర్ తడి నేల ప్రాంతం. 2002లో రామ్‌సర్ గుర్తింపు పొందిన ఈ సరస్సు జీవవైవిధ్యానికి, వలస పక్షుల మనుగడకు కీలకమైన ఆవాసం. సహజ నీటి ప్రవాహంలో మార్పులు, ఆక్రమణలు, అనియంత్రిత చేపల చెరువులు, కాలుష్యం వంటి సమస్యలు ఇప్పటికే సరస్సు పర్యావరణ సమతుల్యతను దెబ్బతీస్తున్నాయి. అందువల్ల అభివృద్ధి పనుల పేరుతో మరో ముప్పు తీసుకురాకూడదు.

2025 జనవరిలో జాతీయ హరిత ట్రిబ్యునల్ (ఎన్జీటీ) కొల్లేరు ఉప్పునీటి చొరబాటు నివారణకు ప్రతిపాదించిన ఆరు ప్రాజెక్టులపై కీలక ఆదేశాలు ఇచ్చింది. అవసరమైన పర్యావరణ, తీరప్రాంత నియంత్రణ, వన్యప్రాణి సంబంధిత అనుమతులు పొందకుండా పనులు చేపట్టరాదని స్పష్టం చేసింది. ప్రతిపాదిత రెగ్యులేటర్ల వల్ల సరస్సు జలప్రవాహ వ్యవస్థ, జీవవైవిధ్యంపై ఎలాంటి ప్రభావం ఉంటుందో శాస్త్రీయంగా పరిశీలించాలని సూచించింది. అంటే రెగ్యులేటర్ల నిర్మాణానికి వ్యతిరేకంగా మాత్రమే ఈ ఆదేశాలను చూడకూడదు; చట్టబద్ధమైన అనుమతులు, పర్యావరణ అధ్యయనాలు పూర్తి చేయాలన్నదే ప్రధాన ఉద్దేశం.

ఈ నేపథ్యంలో ప్రభుత్వం ముందున్న బాధ్యత మరింత కీలకంగా మారింది. ఒకవైపు కొల్లేరు పరిసర గ్రామాల ప్రజల జీవనోపాధి, వరద రక్షణ, ఉప్పునీటి చొరబాటు సమస్యలకు పరిష్కారం చూపాలి. మరోవైపు సరస్సు సహజ స్వరూపాన్ని, పక్షుల ఆవాసాలను, జలచరాల మనుగడను కాపాడాలి. ఈ రెండింటినీ పరస్పర విరుద్ధ అంశాలుగా చూడకుండా సమన్వయంతో ముందుకు సాగాలి. నీటిపారుదల, అటవీ, పర్యావరణ, మత్స్య, రెవెన్యూ శాఖలు సమగ్ర ప్రణాళికతో పనిచేయాలి.

గతంలో కొల్లేరు అభివృద్ధి, సంరక్షణ కోసం ప్రత్యేక కమిటీలు, ప్రాజెక్టులు ప్రతిపాదించినా ఆశించిన ఫలితాలు పూర్తిస్థాయిలో కనిపించలేదు. 2025లో రాష్ట్ర ప్రభుత్వం కొల్లేరు సరస్సు నిర్వహణ ప్రాధికార సంస్థను ఏర్పాటు చేయడం మంచి ముందడుగు. సరస్సు నీటి నాణ్యత మెరుగుదల, పూడిక నివారణ, సహజ నీటి ప్రవాహాల పునరుద్ధరణ, జీవవైవిధ్య పరిరక్షణ, స్థానిక ప్రజల జీవనోపాధికి మద్దతు వంటి బాధ్యతలను ఈ సంస్థకు అప్పగించారు. ఈ వ్యవస్థ కాగితాలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో చురుకుగా పనిచేయాల్సిన అవసరం ఉంది.

ప్రజల ప్రయోజనాలు.. ప్రకృతి పరిరక్షణ రెండూ ముఖ్యం : కొల్లేరు సమస్యలో మరో ముఖ్యమైన అంశం ఆక్రమణలు. సరస్సు పరిధిలో ఆక్రమ చేపల చెరువులు, అనధికారిక కట్టడాలు, సహజ నీటి మార్గాలకు అడ్డంకులు ఏర్పడితే వరద ముప్పు పెరగడమే కాకుండా పర్యావరణ వ్యవస్థ కూడా దెబ్బతింటుంది. 2026 జూలైలో సుప్రీంకోర్టు నియమించిన కేంద్ర సాధికార కమిటీ అక్రమ చేపల చెరువుల తొలగింపు, ఆక్రమణలపై నివేదికలు, పక్షుల ఆవాసాల పరిరక్షణకు సంబంధించి అధికారులకు ఆదేశాలు ఇచ్చినట్లు వార్తలు వెలువడ్డాయి. కాబట్టి రెగ్యులేటర్ల నిర్మాణంతో పాటు ఆక్రమణల తొలగింపు, కాలువల పునరుద్ధరణ, కాలుష్య నియంత్రణకు సమాన ప్రాధాన్యం ఇవ్వాలి.

ఎన్డీఏ ప్రభుత్వం ఈ సమస్యపై ప్రత్యేక దృష్టి సారించి కాలపరిమితితో కూడిన కార్యాచరణ రూపొందించాలి. మొదట నిపుణుల కమిటీ ద్వారా సమగ్ర జలవనరుల అధ్యయనం చేయించాలి. రెగ్యులేటర్ల నిర్మాణం వల్ల వరద నియంత్రణ, ఉప్పునీటి చొరబాటు నివారణ, సరస్సు నీటి నిల్వ సామర్థ్యంపై కలిగే ప్రభావాలను శాస్త్రీయంగా అంచనా వేయాలి. అవసరమైన అన్ని అనుమతులను పారదర్శకంగా పొందాలి. అనంతరం పనులకు నిధులు కేటాయించి, నిర్దిష్ట గడువులో అమలు చేసేలా పర్యవేక్షణ వ్యవస్థను ఏర్పాటు చేయాలి. అదే సమయంలో ఉప్పుటేరులో ఆక్రమణలు తొలగించి, నీటి ప్రవాహానికి ఆటంకం కలిగిస్తున్న అడ్డంకులను శాశ్వతంగా తొలగించాలి.

కొల్లేరు ప్రాంత ప్రజలు ప్రభుత్వాన్ని కోరుతున్నది కేవలం రెగ్యులేటర్ల నిర్మాణం మాత్రమే కాదు.. వరదల భయం లేని జీవితం, ఉప్పునీటి ముప్పు లేని సాగు, స్థిరమైన ఉపాధి, భవిష్యత్తుపై భరోసా. వారి విజ్ఞప్తిని రాజకీయ డిమాండ్‌గా మాత్రమే చూడకుండా ప్రజల జీవన సమస్యగా గుర్తించాలి. అదే సమయంలో కొల్లేరు పర్యావరణ పరిరక్షణను కూడా విస్మరించకూడదు. కొల్లేరు ఒక సరస్సు మాత్రమే కాదు.. అది ప్రకృతి ఇచ్చిన వరం, పక్షుల విడిది, వేలాది కుటుంబాల జీవనాధారం. దాన్ని కాపాడటం ప్రభుత్వానికే కాదు, సమాజానికీ బాధ్యత. అభివృద్ధి పేరుతో ప్రకృతిని దెబ్బతీయకూడదు; పర్యావరణ పరిరక్షణ పేరుతో స్థానిక ప్రజల జీవన సమస్యలను నిర్లక్ష్యం చేయకూడదు. ప్రజల ప్రయోజనాలు, పర్యావరణ సమతుల్యత రెండింటినీ కాపాడే శాస్త్రీయ పరిష్కారమే కొల్లేరుకు నిజమైన మేలు చేస్తుంద.



అనంతా ప్లైవుడ్ పరిశ్రమ నిర్మాణానికి ఎమ్మెల్యేల శంకుస్థాపన

- ముప్పాళ్లలో నూతన పరిశ్రమ ఏర్పాటుకు శ్రీకారం
- కార్యక్రమంలో పాల్గొన్న జగ్గయ్యపేట ఎమ్మెల్యే తాతయ్య, నందిగామ ఎమ్మెల్యే సౌమ్య

జగ్గయ్యపేట, నవంబర్ 17(జర్నలిస్ట్‌ఫైల్):

ఎన్టీఆర్ జిల్లా చందర్లపాడు మండలం ముప్పాళ్ల గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేయనున్న అనంతా ప్లైవుడ్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ నిర్మాణ పనులకు సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమానికి జగ్గయ్యపేట ఎమ్మెల్యే, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య), నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు కొబ్బరికాయ కొట్టి, ప్రత్యేక పూజలు నిర్వహించి పరిశ్రమ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ తనయుడు శ్రీరాం కృష్ణ పవన్, శ్రీరాం చిన్నబాబు తనయుడు శ్రీరాం కృష్ణ సిద్ధార్థ రాయ్ పాల్గొన్నారు. అనంతరం పరిశ్రమ నిర్వాహకులు రాకేష్ టి.ఏ.వి., రోహిత్ పొన్నూరి, రవితేజ బుర్రి, వంశీకృష్ణ నూకల, శ్రీచక్రధర్ ముత్తంశెట్టి ఎమ్మెల్యేలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ పరిశ్రమ ఏర్పాటుతో స్థానికంగా పారిశ్రామిక అభివృద్ధికి మరింత ఊతం లభిస్తుందని, యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని ఎమ్మెల్యేలు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కూటమి పార్టీలకు చెందిన వివిధ హోదాల్లోని నాయకులు, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

తాడిగడప 28వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థిగా గుమ్మడి జస్లీన్ నామినేషన్

- రంగస్థల నటుడు జైరాజు కుటుంబ నేపథ్యం ఆమెకు కలిసొచ్చే అంశం



యనమలకుదురు, నవంబర్ 17(జర్నలిస్ట్‌ఫైల్):

తాడిగడప పురపాలక సంఘం ఎన్నికల వేడిలో భాగంగా 28వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థినిగా గుమ్మడి జస్లీన్ నామినేషన్ దాఖలు చేశారు. యనమలకుదురు గ్రామ సచివాలయ కార్యాలయంలో ఎన్నికల అధికారులకు ఆమె తన నామినేషన్ పత్రాలను అందజేశారు.ప్రముఖ రంగస్థల నటుడు గుమ్మడి జైరాజు మనుమడి భార్య అయిన జస్లీన్ బరిలోకి దిగడంతో 28వ వార్డు రాజకీయం ఆసక్తికరంగా మారింది. రాజకీయ నేపథ్యం ఉన్న కుటుంబం కావడంతో పాటు, స్థానికంగా ఆమెకు ఉన్న పరిచయాలు, ప్రజల్లో ఉన్న మంచి గుర్తింపు ఎన్నికల్లో కలిసొచ్చే అంశాలని స్థానికులు చర్చించుకుంటున్నారు. కుటుంబ ప్రతిష్ఠ, ప్రజాదరణ తోడవడంతో ఆమె విజయావకాశాలు మెరుగ్గా ఉన్నాయని గ్రామస్తులు అభిప్రాయపడుతున్నారు.

కొత్తచెరువు సర్పంచి అభ్యర్థిగా వడ్డే నాగమణి

కొత్తచెరువు, నవంబర్ 17(జర్నలిస్ట్‌ఫైల్):



కొత్తచెరువు మేజర్ గ్రామ పంచాయతీ వైఎస్సార్‌సీపీ సర్పంచి అభ్యర్థిగా వడ్డే నాగమణిని పార్టీ ఖరారు చేసింది. ఆమె గతంలో 2011 నుంచి 2016 వరకు ఎంపీపీగా పనిచేశారు. జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు వడ్డే నారాయణ సతీమణి అయిన నాగమణికి ఉన్న రాజకీయ అనుభవం, స్థానికంగా ప్రజలతో ఉన్న పరిచయాలను పరిగణనలోకి తీసుకుని పుట్టపర్తి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌ఛార్జి, మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి ఆమె అభ్యర్థిత్వాన్ని ఖరారు చేసినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. నాగమణి నాయకత్వంలో గ్రామ అభివృద్ధి, మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం లభిస్తుందని పార్టీ వర్గాలు ఆశాభావం వ్యక్తం చేశాయి.

న్యాయవాది ఇంటిపై దాడి ఘటనపై జగ్గయ్యపేటలో న్యాయవాదుల నిరసన

- కోర్టు విధులు బహిష్కరించి ఆందోళన
- దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్
- ఇంజక్షన్ ఆర్డర్ ఉన్నప్పటికీ ప్రహరీ గోడ కూల్చివేశారని ఆరోపణ



జగ్గయ్యపేట, నవంబర్ 17(జర్నలిస్ట్‌ఫైల్):

న్యాయవాది ప్రగడరాజు శేషుకుమారి ఇంటిపై దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ జగ్గయ్యపేట బార్ అసోసియేషన్ న్యాయవాదులు సోమవారం కోర్టు విధులను బహిష్కరించి నిరసన తెలిపారు. కోర్టు ఇంజక్షన్ ఆర్డర్ ఉన్నప్పటికీ కొందరు ఉద్దేశపూర్వకంగా చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని శేషుకుమారి ఇంటి ప్రహరీ గోడను కూల్చివేశారని, ఆమెపై భౌతిక దాడికి ప్రయత్నించారని న్యాయవాదులు ఆరోపించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ న్యాయవాది ఇంటిపై దాడికి పాల్పడటమే కాకుండా, ఆమెపై భౌతిక దాడికి ప్రయత్నించి, తిరిగి ఆమెపైనే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయడానికి ప్రయత్నించడం దారుణమని పేర్కొన్నారు. ఇటువంటి చర్యలను ప్రతి ఒక్కరూ ఖండించాలని పిలుపునిచ్చారు. కోర్టు ఉత్తర్వులను ఉల్లంఘించిన వారిపై కోర్టు ధిక్కరణ కింద కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పోలీసులు వెంటనే స్పందించి దాడికి పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు వారిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపాలని కోరారు. తమ డిమాండ్లపై స్పందించకపోతే న్యాయవాదులంతా ఐక్యంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు పసుపులేటి సత్య శ్రీనివాసరావు, జె. శ్రీనివాసరావు, నరసింహారెడ్డి, శేషుకుమారి, మాధురి, గోనెల వెంకటేశ్వర్లు, అన్నేపాక కాంతారావు, బూడిద నరసింహారావు, టి.ఎల్. నరసింహారావు, ఎం. ఆంజనేయులు, నాగరాజు, ప్రతాపరెడ్డి, ఆర్.వి.ఎల్. ప్రసాద్, బిక్షం తదితరులు పాల్గొన్నారు.

విజయేశ్వరాలయంలో 18 నుంచి ప్రవచన సప్తాహం

- 24వ తేదీ వరకు కార్తీక పురాణ ప్రవచనాలు
- ఏడుగురు ప్రముఖ పండితులతో ఆధ్యాత్మిక ప్రసంగాలు
- ధర్మ ప్రచార పరిషత్ ప్రోగ్రామ్ అసిస్టెంట్ సీవీకే ప్రసాద్ వెల్లడి
- ప్రచార బ్యానర్‌ను ఆవిష్కరించిన ఆలయ చైర్మన్, ఈవో



విజయవాడ, నవంబర్ 17(జర్నలిస్ట్‌ఫైల్):

మనగుడి కార్తీక మాస మహోత్సవాల్లో భాగంగా విజయవాడలోని శ్రీ గంగా పార్వతీ సమేత శ్రీ విజయేశ్వర స్వామి దేవస్థానంలో ఈ నెల 18 నుంచి 24వ తేదీ వరకు ప్రవచన సప్తాహం నిర్వహించనున్నారు. తిరుమల తిరుపతి దేవస్థానాలు, హిందూ ధర్మ ప్రచార పరిషత్ సంయుక్త ఆధ్వర్యంలో ప్రకాశం బ్యారేజీ వద్ద ఉన్న ఆలయంలో ప్రతిరోజూ ఉదయం 10 గంటలకు ఈ కార్యక్రమాలు ప్రారంభం కానున్నాయి. ఈ విషయాన్ని ధర్మ ప్రచార పరిషత్ ప్రోగ్రామ్ అసిస్టెంట్ సీవీకే ప్రసాద్ వెల్లడించారు. ఈ సప్తాహంలో ప్రముఖ సహస్రావధాని డాక్టర్ పాలపర్తి శ్యామలానంద ప్రసాద్, సంస్కృత ఉపన్యాసకులు ఆచార్య డాక్టర్ ధూళిపాళ రామకృష్ణ, టీటీడీ విశ్రాంత కోఆర్డినేటర్ మండలీక శ్రీకృష్ణకుమార్ తదితరులు కార్తీక పురాణానికి సంబంధించిన ఏడు అంశాలపై ప్రవచనాలు చేయనున్నారు. భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని పురాణ ప్రవచనాలను ఆలకించి స్వామివారి కృపకు పాత్రులు కావాలని నిర్వాహకులు కోరారు. కాగా, ప్రవచన సప్తాహం ప్రచార బ్యానర్‌ను ఆదివారం ఆలయ ప్రాంగణంలో చైర్మన్ దరిశి సీతామహాలక్ష్మి, కార్యనిర్వహణ అధికారి బి.సుబ్బారెడ్డి ఆవిష్కరించారు. అనంతరం భక్తులకు కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా ధార్మిక కమిటీ సభ్యులు బొగ్గరపు వెంకట బాలకోటేశ్వరరావు, నండూరు వెంకట తాండవకృష్ణ, ఆలయ కమిటీ సభ్యుడు శేషు, సీవీకే ప్రసాద్ పాల్గొన్నారు.

చిన్మయ గీతా పోటీల్లో వి.పి.ఎస్. విద్యార్థుల సత్తా

- జిల్లా స్థాయిలో పలు బహుమతులు కైవసం
- అత్యధిక విద్యార్థుల భాగస్వామ్యంలో పాఠశాలకు ద్వితీయ బహుమతి
- జాతీయ స్థాయి పోటీలకు తాతినేని మేధ ఎంపిక



విజయవాడ, నవంబర్ 17(జర్నలిస్ట్‌ఫైల్):

చిన్మయ మిషన్ ఆధ్వర్యంలో వన్‌టౌన్‌లో నిర్వహించిన చిన్మయ గీతా పోటీలు--2026లో మొగల్రాజపురంలోని వీరమాచనేని పద్దయ్య పబ్లిక్ స్కూల్ (వి.పి.ఎస్.) విద్యార్థులు ప్రతిభ చాటారు. భగవద్గీత శ్లోక పఠన పోటీల్లో పలు బహుమతులు సాధించి పాఠశాలకు గుర్తింపు తీసుకొచ్చారు. వివిధ పాఠశాలలకు చెందిన 700 మందికి పైగా విద్యార్థులు పాల్గొన్న ఈ పోటీల్లో 66 మంది విజేతలుగా నిలిచారు. జిల్లా స్థాయిలో అత్యధిక సంఖ్యలో విద్యార్థులను పోటీలకు పంపిన పాఠశాలల విభాగంలో వి.పి.ఎస్. ద్వితీయ బహుమతి సాధించింది.

విజేతల వివరాలు

గ్రూప్-ఏలో పుట్టా జైస్వి (యూకేజీ) ప్రథమ, చల్లా శ్రీకామాక్షి మానస (యూకేజీ) ప్రోత్సాహక బహుమతి పొందారు. గ్రూప్-బిలో డి.హర్షిత (రెండో తరగతి) తృతీయ, ఎం.సౌర్య కార్తికేయ శ్రీహాన్ (రెండో తరగతి) ప్రోత్సాహక బహుమతి సాధించారు. గ్రూప్-సిలో పి.దివ్య తృతీయ బహుమతి అందుకున్నారు. గ్రూప్-డిలో ఎం.శాన్వి (ఆరో తరగతి) ప్రథమ, జె.దివ్యతేజ్ (ఆరో తరగతి), కె.లలిత సుకృతి (ఐదో తరగతి) తృతీయ బహుమతులు గెలుచుకున్నారు. గ్రూప్-ఇలో తాతినేని మేధ (తొమ్మిదో తరగతి) ప్రథమ బహుమతి సాధించారు.

జాతీయ స్థాయికి మేధ

తాతినేని మేధ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్ర స్థాయి పోటీల్లో గ్రూప్-ఇ విభాగంలో ప్రథమ బహుమతి సాధించి ప్రత్యేక గుర్తింపు పొందారు. త్వరలో పూణేలో జరగనున్న జాతీయ స్థాయి పోటీలకు రాష్ట్రం తరఫున ఎంపికయ్యారు. విద్యార్థుల విజయాలపై పాఠశాల వైస్ ప్రిన్సిపాల్ కె.రోజ్ మేరీ, ప్రధానోపాధ్యాయురాలు జయలక్ష్మి, అకడమిక్ కోఆర్డినేటర్ డి.అనురాధ హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థులకు శిక్షణ ఇచ్చిన కేజీ సమన్వయకర్త వి.అన్నపూర్ణ, ఉపాధ్యాయులు సాయి లక్ష్మి, టి.ప్రియ, దీవెన, రామలక్ష్మిలను అభినందించారు.

250 మందికి డొక్కా సీతమ్మ చారిటబుల్ ట్రస్ట్ అన్నదానం





- పాత ప్రభుత్వ ఆసుపత్రిలో అన్నదాన కార్యక్రమం
- ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించిన సినీ, సీరియల్ నటి నాగమణి
- ట్రస్ట్ సేవా కార్యక్రమాలపై ప్రశంసలు

విజయవాడ, నవంబర్ 17(జర్నలిస్ట్‌ఫైల్):

పాత ప్రభుత్వ ఆసుపత్రిలో డొక్కా సీతమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం 250 మందికి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన సినీ, సీరియల్ నటి నాగమణి అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాల గురించి తెలుసుకున్న ఆమె, ట్రస్ట్ వ్యవస్థాపకురాలు అవుటుపల్లి విజయకుమారి, కమిటీ సభ్యులను అభినందించారు. ఈ సందర్భంగా నాగమణి మాట్లాడుతూ.. నేటి రోజుల్లో ఇంటికి వచ్చిన ఒక్కరికి భోజనం వండి పెట్టాలన్నా ఇబ్బందిపడే పరిస్థితులు ఉన్నాయని, అలాంటిది నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ పడకుండా ఎంతో రుచికరమైన భోజనాన్ని స్వయంగా తయారు చేసి ఇంతమందికి వడ్డించడం అభినందనీయమని అన్నారు. ఈ అన్నదాన కార్యక్రమంలో తాను కూడా భాగస్వామి కావడం ఎంతో సంతోషంగా ఉందని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో ముప్పూరు శ్రీకాంత్, నాగరాజ్, సంసాని విజయలక్ష్మి, గుబ్బల జ్యోతిశ్వరి, యర్రోజు అభిలాష్, ప్రశాంతి, నాగలక్ష్మి, దుర్గ, బేబీ రాణి, గిరిజ, అగ్నిగోత్రం నాగరాజమ్మ తదితరులు పాల్గొన్నారు.

'అక్వాన్'ను ఎదుర్కొనేందుకు విద్యుత్ శాఖ సిద్ధం

- త్వరితగతిన విద్యుత్ సరఫరా పునరుద్ధరణకు చర్యలు
- ఎపిఎస్ పిడిసిఎల్ సిఎండి శివశంకర్ లోతేటి వెల్లడి



తిరుపతి, నవంబరు 17(జర్నలిస్ట్‌ఫైల్):

అక్వాన్ తుఫాను కారణంగా ఈనెల 18 నుంచి 20వ తేదీ వరకు భారీ వర్షాలు కురిసే అవకాశం వున్న నేపథ్యంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడిన సందర్భాల్లో సరఫరాను త్వరితగతిన పునరుద్ధరించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని ఎపిఎస్పిడిసిఎల్ చైర్మన్ ఉ మేనేజింగ్ డైరెక్టర్ శివశంకర్ లోతేటి సూచించారు. తుఫాను ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు సన్నద్ధంలో భాగంగా ఎపిఎస్పిడిసిఎల్ సిఎండి శివ శంకర్ లోతేటి సంస్థ అధికారులతో సోమవారం సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సిఎండి మాట్లాడుతూ భారీ వర్షాలు కురిసే అవకాశం వున్న ప్రాంతాల్లో ఆయా సర్కిళ్ళ సూపరింటెండింగ్ ఇంజనీర్లు తుఫాను పట్ల అప్రమత్తంగా వుండాలని సూచించారు. భారీ వర్షాల కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడిన సందర్భాల్లో సరఫరాను యుద్ధ ప్రాతిపదికన పునరుద్ధరించేందుకు వీలుగా అధికారులు, సిబ్బందితో కూడిన ప్రత్యేక బృందాలు సిద్ధంగా ఉండాలని సూచించారు. సరఫరా పునరుద్ధరణకు అవసరమైన పరికరాల నిల్వ పరిస్థితిని ఈ సందర్భంగా సమీక్షించారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడడం, లైన్లు తెగిపడడం, స్తంభాలు ఒరిగిపోవడం/కూలిపోవడం, ట్రాన్స్ ఫార్మర్లు మరమ్మతుకు గురికావడం లాంటి సంఘటనల్ని గుర్తించినట్లయితే ప్రజలు వెంటనే సంస్థ టోల్-ఫ్రీ నంబర్లు: 1912 లేదా 1800 425 155333కు కాల్ చేసి సమాచారం అందించాలని సూచించారు. అదేవిధంగా సంస్థ వాట్సాప్ నంబరు: 91333 31912కు చాట్ చేయడం ద్వారా విద్యుత్ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావచ్చని తెలియజేశారు. వర్షం కురిసే సందర్భాల్లో ప్రజలు విద్యుత్ స్తంభాలను తాకవద్దని, లైన్ల కింద నిల్చోవద్దని తెలిపారు. అదేవిధంగా గృహాల్లో కూడా ఎటువంటి విద్యుత్ ప్రమాదాలు జరగకుండా వినియోగదారులు ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సిఎండి శివశంకర్ లోతేటి వినియోగదారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ (ప్రాజెక్ట్స్ ఉ ఐటీ, ఫైనాన్స్/ ఎఫ్ఏసి) పి. అయూబ్ ఖాన్, డైరెక్టర్ (టెక్నికల్) కే. గురవయ్య, చీఫ్ జనరల్ మేనేజర్లు జే. రమణా దేవి, ఆర్. పద్మ, కే. సంపత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కనిమెర్ల తండా సర్పంచ్ అభ్యర్థిగా అజ్మీర దుర్గాభవాని

ఎనిమిది మంది వార్డు సభ్యులతో కలిసి నామినేషన్ దాఖలు



మైలవరం, నవంబర్ 17(జర్నలిస్ట్‌ఫైల్):

మైలవరం మండలం కనిమెర్ల తండా గ్రామ సర్పంచ్ అభ్యర్థిగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మద్దతుతో పోటీ చేస్తున్న అజ్మీర లక్ష్మణరావు సతీమణి అజ్మీర దుర్గాభవాని ఎనిమిది మంది వార్డు సభ్యులతో కలిసి నామినేషన్ దాఖలు చేశారు. చంద్రాల సచివాలయంలో నామినేషన్ ప్రక్రియను పూర్తి చేశారు. ఈ సందర్భంగా నామినేషన్ కార్యక్రమానికి హాజరై విజయవంతం చేసిన వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, యువకులు, మహిళా నాయకులు, మహిళలు, పార్టీ సానుభూతిపరులకు నాయకులు కృతజ్ఞతలు తెలిపారు.కనిమెర్ల తండా గ్రామంలో అజ్మీర దుర్గాభవానిని భారీ మెజారిటీతో గెలిపించాలని వైఎస్సార్‌సీపీ నాయకులు, శ్రేణులు ఓటర్లను కోరారు.



సజావుగా నామినేషన్ల ప్రక్రియ

- ప్రక్రియపై నిరంతర పర్యవేక్షణ
- ఎక్కడా ఎలాంటి లోటుపాట్లు లేకుండా ఏర్పాట్లు
- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

విజయవాడ, నవంబర్ 17(జర్నలిస్ట్ఫైల్):

జిల్లాలో పంచాయతీ ఎన్నికల తొలిదశకు సంబంధించి నామినేషన్ల ప్రక్రియ సజావుగా జరుగుతోందని.. ఎన్నికలను అత్యంత పారదర్శకంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పటిష్టంగా చేపట్టినట్లు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ తెలిపారు. కలెక్టర్ లక్ష్మీశ సోమవారం జిల్లా పంచాయతీ అధికారి (డీపీవో) టి.సీతామహాలక్ష్మితో కలిసి విజయవాడ గ్రామీణం గొల్లపూడి పంచాయతీ కార్యాలయాన్ని సందర్శించారు. జరుగుతున్న నామినేషన్ల ప్రక్రియను పరిశీలించారు. నామినేషన్ల స్వీకరణకు సంబంధించిన ఏర్పాట్లు, ఎన్నికల నిబంధనల అమలు తీరును అధికారులను అడిగి తెలుసుకున్నారు. నామినేషన్ల ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా ఎన్నికల సంఘం మార్గదర్శకాలను కచ్చితంగా పాటించాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నామినేషన్ల ప్రక్రియను నిరంతరం పర్యవేక్షిస్తున్నామని, ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా ప్రతి కార్యక్రమాన్ని నిర్వహించేలా చూస్తున్నట్లు తెలిపారు. నామినేషన్ల స్వీకరణ కేంద్రాల్లో అవసరమైన సదుపాయాలు కల్పించడంతో పాటు, అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. మొదటి విడతలో 73 గ్రామ పంచాయతీలు, 856 వార్డులకు 1,001 పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికలు జరుగుతాయన్నారు. తొలిదశ ఎన్నికలకు ఈ నెల 17వ తేదీ వరకు నామినేషన్ల దాఖలుకు గడువు ఉందని.. ఈ నెల 26వ తేదీన పోలింగ్ జరుగుతుందని.. అదే రోజు కౌంటింగ్, ఫలితాల వెల్లడి జరుగుతుందని కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు.

భీమవరంలో వైఎస్సార్‌సీపీలో చేరికలు

- కూటమి పార్టీలకు చెందిన ఐదుగురు వైఎస్సార్‌సీపీలో చేరిక
- సర్పంచ్ అభ్యర్థిగా గుండం కృష్ణారెడ్డి ఎంపిక



జగ్గయ్యపేట, నవంబర్ 17(జర్నలిస్ట్ఫైల్):

జగ్గయ్యపేట నియోజకవర్గం వత్సవాయి మండలం భీమవరం గ్రామంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి మద్దతు పెరుగుతోందని ఆ పార్టీ నాయకులు తెలిపారు. గ్రామ పార్టీ అధ్యక్షుడు గుండం రంగారెడ్డి ఆధ్వర్యంలో కూటమి పార్టీలకు చెందిన నిడిగుండ యాదగిరి, నిడిగుండ శ్రీహరి, ఎంకేపల్లి ధర్మేంద్ర, ఎంకేపల్లి నాగరాజు, దాదే గోపి వైఎస్సార్‌సీపీలో చేరారు. జగ్గయ్యపేట నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌ఛార్జి తన్నీరు నాగేశ్వరరావు, నియోజకవర్గ పరిశీలకుడు ఆళ్ల చల్లారావు సమక్షంలో నూతనంగా చేరిన వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా భీమవరం గ్రామ వైఎస్సార్‌సీపీ సర్పంచ్ అభ్యర్థిగా గుండం కృష్ణారెడ్డిని ఎంపిక చేశారు. గ్రామ అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పార్టీ శ్రేణులంతా సమష్టిగా పనిచేయాలని నాయకులు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి చింతకుంట్ల వెంకటరెడ్డి, నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు గంగిపోగు రమేష్, మాజీ సొసైటీ అధ్యక్షుడు పెనుగొండ శ్రీనివాస్ రెడ్డి, చిట్టా నరేష్ రెడ్డి, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

గంగవరం సర్పంచ్ అభ్యర్థిగా మురళీ నామినేషన్

- టీడీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి నామినేషన్ దాఖలు
- గ్రామాభివృద్ధికి మరింత కృషి చేస్తానని హామీ



పలమనేరు, నవంబర్ 17(జర్నలిస్ట్ఫైల్):

పలమనేరు నియోజకవర్గ పరిధిలోని గంగవరం మండలంలో కీలకంగా భావిస్తున్న గంగవరం గ్రామ పంచాయతీ సర్పంచ్ అభ్యర్థిగా మురళీ సోమవారం నామినేషన్ దాఖలు చేశారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో కలిసి మారేడుపల్లె స్వర్ణ పంచాయతీ కార్యాలయంలో ఎన్నికల అధికారులకు నామినేషన్ పత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా మురళీ మాట్లాడుతూ, గతంలో గంగవరం సర్పంచ్‌గా పనిచేసిన సమయంలో గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి ప్రజలకు అందుబాటులో ఉన్నానని తెలిపారు. తన హయాంలో చేపట్టిన అభివృద్ధి పనులకు గుర్తింపుగా ప్రతిష్ఠాత్మక అవార్డు కూడా లభించిందని పేర్కొన్నారు. ప్రజల ఆదరణ, ఆశీస్సులతో మరోసారి సర్పంచ్‌గా పోటీ చేసే అవకాశం దక్కిందన్నారు. తనపై నమ్మకంతో సర్పంచ్ అభ్యర్థిగా అవకాశం కల్పించిన ఎమ్మెల్యే అమరనాథరెడ్డికి, మండల టీడీపీ నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. తనపై అభిమానం చూపుతున్న గంగవరం ప్రజలకు ధన్యవాదాలు తెలియజేశారు. గతంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను కొనసాగిస్తూ గ్రామాన్ని మరింత అభివృద్ధి పథంలో నడిపిస్తానని మురళీ హామీ ఇచ్చారు. మౌలిక వసతుల కల్పన, ప్రజలకు అవసరమైన సౌకర్యాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తానని చెప్పారు. రానున్న పంచాయతీ ఎన్నికల్లో తనను అత్యధిక మెజారిటీతో గెలిపించి సేవ చేసే అవకాశం కల్పించాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు అరుణ్‌కుమార్‌రెడ్డి, చిట్టిబాబు, గోపి తదితరులు పాల్గొన్నారు. నామినేషన్ సందర్భంగా మురళీకి నాయకులు, కార్యకర్తలు అభినందనలు తెలిపారు.

హ్యాండ్‌బాల్‌లో కృష్ణా జిల్లా జట్ల డబుల్ ధమాకా





- బాలురు, బాలికల విభాగాల్లో రాష్ట్ర ఛాంపియన్‌షిప్ కైవసం
- జాతీయ పోటీలకు ఎనిమిది మంది క్రీడాకారుల ఎంపిక

విజయవాడ పశ్చిమ, నవంబరు 17(జర్నలిస్ట్ఫైల్):

రాష్ట్రస్థాయి అండర్-19 హ్యాండ్‌బాల్ పోటీల్లో కృష్ణా జిల్లా క్రీడాకారులు సత్తా చాటారు. బాలురు, బాలికలు రెండు విభాగాల్లోనూ ప్రత్యర్థి జట్లను అధిగమించి విజేతలుగా నిలిచారు. రాష్ట్ర ఛాంపియన్‌షిప్‌లను కైవసం చేసుకుని కృష్ణా జిల్లా క్రీడా పతాకాన్ని రెపరెపలాడించారు. స్థానిక కేబీఎన్ కళాశాల వేదికగా ఈ నెల 14 నుంచి 16వ తేదీ వరకు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్‌జిల్లాల అండర్-19 హ్యాండ్‌బాల్ పోటీల్లో సంయుక్త జిల్లాలకు చెందిన 13 జట్లు పాల్గొన్నాయి. బాలురు, బాలికల విభాగాల్లో 210 మంది చొప్పున మొత్తం 420 మంది క్రీడాకారులు తమ ప్రతిభను ప్రదర్శించారు. లీగ్ కమ్ నాకౌట్ పద్ధతిలో ఉత్కంఠభరితంగా సాగిన పోటీల్లో కృష్ణా జిల్లా బాలికల జట్టు ఫైనల్‌లో శ్రీకాకుళం జట్టుపై 24-7 గోల్స్ తేడాతో ఘన విజయం సాధించి ఛాంపియన్‌గా అవతరించింది. బాలుర విభాగంలోనూ కృష్ణా జిల్లా జట్టు తన ఆధిపత్యాన్ని చాటుకుంది. ఫైనల్‌లో వైఎస్సార్ కడప జట్టును 16-9 గోల్స్ తేడాతో ఓడించి రాష్ట్రస్థాయి టైటిల్‌ను సొంతం చేసుకుంది. జాతీయ స్థాయికి ఎనిమిది మంది ఎంపిక: రాష్ట్ర జట్టుకు కృష్ణా జిల్లా నుంచి బాలికల విభాగంలో ఏ. లావణ్య, పి. ప్రణతి, వి. శ్రీచాందిని, డి. సంజన ఎంపికయ్యారు. వీరు డిసెంబరులో అరుణాచల్‌ప్రదేశ్‌లో జరగనున్న జాతీయస్థాయి అండర్-19 బాలికల హ్యాండ్‌బాల్ పోటీల్లో ఆంధ్రప్రదేశ్‌కు ప్రాతినిధ్యం వహించనున్నారు. బాలుర విభాగంలో పి. గురుపార్థ, డి. హనుక్, టి. యశ్వంత్ కుమార్, ఎం. తన్విత్ రాష్ట్ర జట్టుకు ఎంపికయ్యారు. వీరు పంజాబ్‌లోని లూథియానాలో జరగనున్న జాతీయస్థాయి పోటీల్లో పాల్గొననున్నారు. ఈ విషయాన్ని జిల్లా ఎస్‌జీఎఫ్ అండర్-19 కార్యదర్శి వి. రవికాంతి వెల్లడించారు.

విజేతలకు ఘన సత్కారం

కేబీఎన్ కళాశాల వ్యాయామ విద్య విభాగాధిపతి డి. హేమచంద్రరావు పర్యవేక్షణలో పోటీలు నిర్వహించారు. ముగింపు, బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కళాశాల కార్యదర్శి, కరస్పాండెంట్ డాక్టర్ టి. శ్రీనివాస్ విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌కేపీవీవీ హిందూ విద్యాసంస్థల అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ వి. నారాయణరావు, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి. కృష్ణవేణి, పోటీల అబ్జర్వర్ కె. అలివేలుమంగమ్మ, పి. విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తిరువూరులో టీడీపీలోకి వైసీపీ నేతల వలసలు





- రెండు మండలాల నుంచి 45 మంది వైసీపీ నాయకులు, కార్యకర్తల చేరిక
- ఎంపీ కేశినేని చిన్ని సమక్షంలో టీడీపీ కండువాలు కప్పుకున్న నేతలు
- 2019లో వైసీపీ తరపున పోటీ చేసిన బల్లెపోగు బాబురావు కూడా టీడీపీలో చేరిక

విజయవాడ, నవంబర్ 17(జర్నలిస్ట్ఫైల్):

తిరువూరు నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీలోకి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తల చేరికలు కొనసాగుతున్నాయి. తిరువూరు, ఏ.కొండూరు మండలాలకు చెందిన 45 మంది వైసీపీ నాయకులు, కార్యకర్తలు సోమవారం విజయవాడలోని ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) కార్యాలయంలో టీడీపీలో చేరారు. వారికి ఎంపీ పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. తిరువూరు మండలం ఆంజనేయపురం గ్రామానికి చెందిన, 2019 ఎన్నికల్లో వైసీపీ తరఫున పోటీ చేసిన బల్లెపోగు బాబురావు తన అనుచరులతో కలిసి టీడీపీలో చేరారు. ఆయనతో పాటు మొత్తం 25 మంది పార్టీలో చేరగా, ఎంపీ కేశినేని చిన్ని వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ టీడీపీలో చేరిన ప్రతి ఒక్కరికీ సముచిత గౌరవం, గుర్తింపు కల్పిస్తామని తెలిపారు. పార్టీలోకి వచ్చిన వారిని కొత్తవారిగా కాకుండా కుటుంబ సభ్యులుగా భావిస్తామన్నారు. పార్టీ బలోపేతానికి అందరూ సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని పేర్కొన్నారు. ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు క్షేత్రస్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆంజ నేయపురం మాజీ గ్రామ పార్టీ అధ్యక్షుడు మామిడి గాంధీ, తిరువూరు నియోజకవర్గ టీఎన్‌టీయూసీ అధ్య క్షుడు తుమ్మలపల్లి వెంకట పుల్లారావు తదితరులు పాల్గొన్నారు.

ఏ.కొండూరు నుంచి మరో 20 మంది

ఏ.కొండూరు మండలం కంభంపాడు గ్రామానికి చెందిన 20 మంది వైసీపీ నాయకులు, కార్యకర్తలు కూడా టీడీపీలో చేరారు. ఎంపీ కేశినేని చిన్ని వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. వైసీపీలో కీలకంగా వ్యవహరించిన మంచి కంటి రాజశేఖర్, ఆయన సతీమణి విజయలక్ష్మి, మెంతుల శ్రీనివాస్ యాదవ్, బాలమర్తి కృష్ణ తదితరులు టీడీపీలో చేరిన వారిలో ఉన్నారు. ఈ సందర్భంగా ఎంపీ చిన్ని మాట్లాడుతూ పార్టీ సిద్ధాంతాలు, నాయకత్వంపై విశ్వాసంతో టీడీపీలో చేరిన వారందరికీ ఆత్మీయ స్వాగతం పలుకుతున్నామని తెలిపారు. నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తూ తిరువూరు నియోజకవర్గ అభివృద్ధికి తమ వంతు సహకారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏ.కొండూరు మండల టీడీపీ అధ్యక్షుడు పీక్లా నాయక్ తదితర పార్టీ నాయకులు పాల్గొన్నారు.

నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు

- నవంబర్ 19న ఎస్ఆర్ఆర్, సీవీఆర్ కళాశాలలో ఉద్యోగ మేళా
- ఇంటర్, డిగ్రీ అర్హతతో 18--35 ఏళ్ల వారికి అవకాశం
- నెలకు రూ.15 వేల నుంచి రూ.30 వేల వరకు వేతనం
- ముందస్తు నమోదు తప్పనిసరి: ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ

విజయవాడ, నవంబర్ 17(జర్నలిస్ట్ఫైల్):



జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే లక్ష్యంతో ఈ నెల 19న విజయవాడలో కంపెనీ స్పెసిఫిక్ ఉద్యోగ మేళా నిర్వహించనున్నట్లు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి శాఖ సంయుక్త ఆధ్వర్యంలో గుణదలలోని ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ డిగ్రీ కళాశాలలో గురువారం ఉదయం 9 గంటలకు ఉద్యోగ మేళా ప్రారంభమ వుతుందని వెల్లడించారు. ఇంటర్మీడియట్ లేదా డిగ్రీ విద్యార్హత కలిగి, 18 నుంచి 35 ఏళ్లలోపు వయస్సున్న యువతీ యువకులు ఈ ఉద్యోగాలకు అర్హులని తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ.15 వేల నుంచి రూ.30 వేల వరకు వేతనంతో పాటు ఇతర సౌకర్యాలు కల్పిస్తారని పేర్కొన్నారు. కంపెనీ ప్రతినిధులు నేరుగా ఇంటర్వ్యూలు నిర్వహించి, అభ్యర్థుల అర్హతలు, ప్రతిభ ఆధారంగా ఎంపిక చేస్తారని వివరించారు.

ముందస్తు నమోదు తప్పనిసరి

ఆసక్తి, అర్హత కలిగిన అభ్యర్థులు ముందుగా https://naipunyam. ap.gov.in/user-registration వెబ్‌సైట్‌లో పూర్తి వివరాలతో నమోదు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఇంటర్వ్యూకు హాజరయ్యే సమయంలో రెజ్యూమ్ లేదా బయోడేటా, ఆధార్ కార్డు, ఆధార్‌తో అనుసంధానమైన మొబైల్ నంబర్, పాన్ కార్డు, విద్యార్హతల ధ్రువీకరణ పత్రాల జిరాక్స్ కాపీలు వెంట తీసుకురావాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 9032633548 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు. జిల్లాలోని నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ అర్హతలు, నైపుణ్యాలకు తగిన ఉద్యోగాలు పొందాలని కలెక్టర్ కోరారు. ఉద్యోగ మేళా ఏర్పాట్లను జిల్లా ఉపాధి, నైపుణ్య అధికారి సి. మధుభూషణ్ రావు, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎన్. శ్రీనివాసరావు పర్యవేక్షిస్తున్నారు.

గ్రామ పంచాయతీ నామినేషన్లపై కలెక్టర్ నిశిత పర్యవేక్షణ

- ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా రెండో రోజు నామినేషన్ల స్వీకరణ తీరుపై సమీక్ష
- పారదర్శకంగా, ప్రశాంత వాతావరణంలో ప్రక్రియ నిర్వహించాలి
- అభ్యర్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయాలి
- అధికారులకు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డా. జి. లక్ష్మీశ ఆదేశం

విజయవాడ, నవంబర్ 17(జర్నలిస్ట్ఫైల్):



ఎన్టీఆర్ జిల్లాలో గ్రామ పంచాయతీ సాధారణ ఎన్నికల తొలివిడత నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ జి. లక్ష్మీశ సోమవారం నిశితంగా పర్యవేక్షించారు. జిల్లా కలెక్టరేట్‌లోని కమాండ్ కంట్రోల్ రూమ్ నుంచి ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా రెండో రోజు నామినేషన్ల స్వీకరణ తీరును సమీక్షించారు. తొలివిడత ఎన్నికల్లో భాగంగా విజయవాడ డివిజన్ పరిధిలోని నాలుగు మండలాలు, తిరువూరు డివిజన్ పరిధిలోని రెడ్డిగూడెం మండలంలో సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలకు జరుగుతున్న నామినేషన్ల ప్రక్రియను పరిశీలించారు. ఆయా నామినేషన్ కేంద్రాల్లో జరుగుతున్న ఏర్పాట్లు, అభ్యర్థుల నుంచి నామినేషన్ల స్వీకరణ తీరును సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా క్షేత్రస్థాయి అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాలు, నిబంధనలకు అనుగుణంగా నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను అత్యంత పారదర్శకంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని ఆదేశించారు. నామినేషన్ కేంద్రాలకు వచ్చే అభ్యర్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు. ప్రతిరోజూ స్వీకరించిన నామినేషన్ల వివరాలను ఎలాంటి జాప్యం లేకుండా ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేయాలని స్పష్టం చేశారు. ప్రక్రియలో పారదర్శకత, జవాబుదారీతనం ఉండేలా అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని, ఎన్నికల విధులను బాధ్యతాయుతంగా నిర్వహించాలని ఆదేశించారు.ఈ పర్యవేక్షణ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి టి. సీతామహాలక్ష్మి, ఎన్నికల విభాగం అధికారులు, కమాండ్ కంట్రోల్ రూమ్ సిబ్బంది పాల్గొన్నారు.

ఇంద్రకీలాద్రిపై ఎమ్మెల్యే గళ్ళా మాధవి ప్రత్యేక పూజలు



- కార్తీక శుద్ధ అష్టమి సందర్భంగా దుర్గమ్మను దర్శించుకున్న గళ్ళా దంపతులు

విజయవాడ, నవంబర్ 17 (జర్నలిస్ట్ ఫైల్): పవిత్ర కార్తిక మాసం, కార్తిక శుద్ధ అష్టమి పర్వదినాన్ని పురస్కరించుకుని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి, గళ్ళా రామచంద్రరావు మంగళవారం విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువైన శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు వారికి సాదర స్వాగతం పలికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. దుర్గమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం వేద పండితులు వేదాశీర్వచనం అందించారు. అమ్మవారి తీర్థప్రసాదాలు, శేషవస్త్రాలను అందజేశారు. భక్తిశ్రద్ధలతో అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో వసతుల కల్పనకు ఎంపీ భాష్యం రామకృష్ణ హామీ



గుంటూరు, నవంబర్ 17 (జర్నలిస్ట్ ఫైల్): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించేందుకు కృషి చేస్తానని రాజ్యసభ సభ్యుడు భాష్యం రామకృష్ణ హామీ ఇచ్చారు. మంగళవారం గుంటూరు నగరంలోని స్తంభాల గరువులో ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ఏటీ అగ్రహారంలోని ఎస్‌కేబీఎం పాఠశాలను ఆయన సందర్శించారు. తరగతి గదులు, తాగునీటి సదుపాయాలను పరిశీలించారు. రెండు పాఠశాలల్లో పనిచేయని వాటర్ ఆర్ఓ ప్లాంట్లను గుర్తించారు. విద్యార్థులకు స్వచ్ఛమైన తాగునీరు అందేలా చూడాలని ప్రధానోపాధ్యాయులకు సూచించారు. ప్లాంట్ల మరమ్మతులు, నిర్వహణకు అయ్యే ఖర్చుల విషయంలో తాను సహకరిస్తానని తెలిపారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులతో మాట్లాడి పాఠశాలల్లో నెలకొన్న ఇతర సమస్యలను తెలుసుకున్నారు. వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకునేలా కృషి చేస్తానన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు మెరుగైన మౌలిక వసతులు అందుబాటులో ఉండాలని, ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి తన సహకారం కొనసాగుతుందని పేర్కొన్నారు.

పేదల ఆరోగ్యానికి సీఎంఆర్ఎఫ్ భరోసా : ఎమ్మెల్యే నసీర్

- వైద్యం కోసం ఏ ఒక్కరూ అప్పుల పాలుకాకూడదు
- 40 మందికి రూ.30 లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ



గుంటూరు, నవంబర్ 17 (జర్నలిస్ట్ ఫైల్): ప్రజల ఆరోగ్యానికి రక్షణ కవచంలా నిలుస్తామని,, సీఎం రిలీఫ్ ఫండ్ తో పేదల ఆరోగ్యానికి భరోసాగా ఉంటున్నామని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనారిటీస్ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు. మంగళవారం స్థానిక తూర్పు కార్యాలయంలో 40 మందికి రూ. 30 లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ పేద, మధ్య తరగతి ప్రజల ఆరోగ్య భద్రతకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, నిరుపేదల ప్రాణాలను నిలబెట్టడంలో ముఖ్యమంత్రి సహాయ నిధి వరంగా మారిందని చెప్పారు. నియోజకవర్గంలో తీవ్ర అనారోగ్య సమస్యలతో బాధపడుతూ వైద్య ఖర్చుల కోసం ఇబ్బందులు పడుతున్న బాధితులకు ప్రభుత్వం నుంచి సహకారం లభిస్తోందని తెలిపారు. ఇప్పటి వరకు తూర్పు నియోజకవర్గంలో 15.50 కోట్ల నిధులు సీఎంఆర్ఎఫ్ ద్వారా అందించామని చెప్పారు. ఆర్థిక ఇబ్బందుల వల్ల ఎవరూ సరైన వైద్యానికి దూరం కాకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం ఆర్థిక సహాయాన్ని వేగవంతంగా అందిస్తోందన్నారు. గతంలో సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందడంలో తీవ్ర జాప్యం జరిగేదని, అయితే ఇప్పుడు దరఖాస్తులను త్వరితగతిన పరిశీలించి నేరుగా బాధితులకు ఆర్థిక భరోసా కల్పిస్తున్నామని చెప్పారు. క్యాన్సర్, గుండె సంబంధిత వ్యాధులు, కిడ్నీ సమస్యలు మరియు ఇతర తీవ్రమైన ఆరోగ్య సమస్యలతో ప్రైవేట్ లేదా కార్పొరేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొంది అప్పులపాలైన కుటుంబాలకు ఈ సహాయం ఎంతో మేలు చేస్తుందన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆరోగ్య వ్యవస్థను బలోపేతం చేసినట్లు తెలిపారు. సీఎంఆర్ఎఫ్ ఆర్థిక సహాయం అందుకోవడంతో లబ్ధిదారులు, వారి కుటుంబ సభ్యులు భావోద్వేగానికి గురయ్యారు. వైద్య ఖర్చుల కోసం చేసిన అప్పులు తీర్చే మార్గం లేక దిక్కుతోచని స్థితిలో ఉన్న సమయాన సీఎం చంద్రబాబు నాయుడు, ఎమ్మెల్యే నసీర్ కొండంత అండగా నిలిచారని బాధితులు ఆనందం వ్యక్తం చేశారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి.. నాణ్యతలో రాజీ వద్దు

- నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేయాలి
- నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు: కమిషనర్ మయూర్ అశోక్



గుంటూరు, నవంబర్ 17 (జర్నలిస్ట్ ఫైల్): నగరంలో చేపడుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేయడంతో పాటు నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని నగరపాలక సంస్థ కమిషనర్ కె.మయూర్ అశోక్ ఇంజినీరింగ్, ప్రజారోగ్య విభాగ అధికారులను ఆదేశించారు. మంగళవారం నగరంలోని నవభారత్ నగర్, విద్యానగర్, వికాస్ నగర్, కేవీపీ కాలనీ, శశాంక్ గోయల్ కాలనీల్లో పర్యటించి అభివృద్ధి పనులు, పారిశుధ్య నిర్వహణ తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు.
మంజూరైన, ప్రస్తుతం కొనసాగుతున్న అభివృద్ధి పనులను అనవసరంగా పెండింగ్‌లో ఉంచరాదని, నిర్దేశిత గడువులోగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కమిషనర్ స్పష్టం చేశారు. పనుల వేగంతో పాటు నిర్మాణ నాణ్యతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. నిబంధనల ప్రకారం నాణ్యతా ప్రమాణాలు పాటించకపోతే సంబంధిత కాంట్రాక్టర్లతో పాటు బాధ్యులైన అధికారులపైనా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రోడ్లు, డ్రైనేజీలు, ఇతర నిర్మాణ పనులు పూర్తయిన వెంటనే అక్కడ పేరుకుపోయిన నిర్మాణ వ్యర్థాలు, ఇసుక, కంకర తదితర సామగ్రిని తొలగించాలని ఆదేశించారు. రోడ్లపై నిర్మాణ సామగ్రిని వదిలేయడం వల్ల ట్రాఫిక్‌కు అంతరాయం కలగడంతో పాటు ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. పనులు పూర్తయిన వెంటనే పరిసరాలను శుభ్రం చేయాల్సిన బాధ్యత కాంట్రాక్టర్లదేనని స్పష్టం చేశారు. ఏటీ అగ్రహారం ప్రధాన రహదారిలో పెండింగ్‌లో ఉన్న రోడ్డు నిర్మాణ పనులను వెంటనే చేపట్టాలని ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌ను ఆదేశించారు. నగరంలో పారిశుధ్య నిర్వహణను మరింత మెరుగుపరచాలని ప్రజారోగ్య విభాగ అధికారులకు సూచించారు. ఖాళీ స్థలాల్లో పిచ్చిమొక్కలు, చెత్తాచెదారం పేరుకుపోకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలని తెలిపారు. స్థలాల యజమానులు తమ స్థలాలను పరిశుభ్రంగా ఉంచుకునేలా నోటీసులు జారీ చేయాలని, ఆదేశాలను పట్టించుకోని వారిపై జరిమానాలు విధించాలని ఆదేశించారు. నగరంలో ఎక్కడా రోడ్లపై చెత్త కనిపించకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఉదయం వేళల్లోనే చెత్త సేకరణ ప్రక్రియను పూర్తి చేయాలని, మధ్యాహ్నం సమయంలో డ్రైనేజీల్లో పూడికతీత పనులు చేపట్టాలని అధికారులకు సూచించారు. పారిశుధ్య పనుల పర్యవేక్షణలో నిర్లక్ష్యం ఉండకూడదని స్పష్టం చేశారు.
ఈ పర్యటనలో ఎస్ఈ జి.వెంకటేశ్వరరావు, ఈఈ విష్ణువర్ధన్, డీఈఈలు వెంకటరమణ, చైతన్య, రమేష్‌బాబు, ఎస్ఎస్ సోమశేఖర్, ప్రజారోగ్య, ఇంజినీరింగ్ విభాగాల అధికారులు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

మున్సిపల్ ఎన్నికలకు పటిష్ట భద్రతా ఏర్పాట్లు

- పొన్నూరు, తాడేపల్లి, మంగళగిరిలో పోలింగ్ కేంద్రాలు, కౌంటింగ్ హాళ్ల పరిశీలన
- ఎన్నికలు ప్రశాంతంగా, స్వేచ్ఛాయుతంగా, పారదర్శకంగా నిర్వహించడమే లక్ష్యం
- ఎస్పీ వకుల్ జిందాల్



గుంటూరు, నవంబర్ 17 (జర్నలిస్ట్ ఫైల్): రానున్న మున్సిపల్ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పోలీసు శాఖ పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేపడుతోందని గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. ఎన్నికల భద్రతా ఏర్పాట్లను సమీక్షించేందుకు మంగళవారం పొన్నూరు, తాడేపల్లి, మంగళగిరి ప్రాంతాల్లో పర్యటించి కౌంటింగ్ హాళ్లు, పోలింగ్ కేంద్రాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.
పొన్నూరు పట్టణంలోని కౌంటింగ్ హాల్, పోలింగ్ కేంద్రంతో పాటు మంగళగిరిలోని సీకే హైస్కూల్, ఇందిరా మున్సిపల్ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఎన్నికల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు, పోలీసు బందోబస్తు, భద్రతా చర్యలను సమీక్షించి విధుల్లో ఉన్న అధికారులకు పలు సూచనలు చేశారు.
నామినేషన్ కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు
తాడేపల్లి–మంగళగిరి నగరపాలక సంస్థ ఎన్నికల్లో మేయర్, వార్డు కార్పొరేటర్ అభ్యర్థుల నామినేషన్ల స్వీకరణ కేంద్రాలైన తాడేపల్లి, మంగళగిరి కార్యాలయాల వద్ద పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్పీ తెలిపారు. పొన్నూరు పురపాలక ఎన్నికల నామినేషన్ల కేంద్రంగా ఉన్న మున్సిపల్ కార్యాలయం వద్ద కూడా భద్రతను కట్టుదిట్టం చేసినట్లు వెల్లడించారు.
ఎన్నికల నిబంధనల అమలుపై నిఘా
నామినేషన్ కేంద్రాల వద్ద 100, 200 మీటర్ల పరిధిలో ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా పోలీసు ఆంక్షలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. పోలీస్ యాక్ట్ సెక్షన్ 30, బీఎన్ఎస్ఎస్ సెక్షన్ 163 ప్రకారం ముందస్తు చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు. నామినేషన్ కేంద్రాల పరిసరాల్లో అభ్యర్థులు, వారి అనుచరులు, ఇతరులు గుంపులుగా చేరకుండా ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు వివరించారు.
సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి
పొన్నూరు, తాడేపల్లి–మంగళగిరి పరిధిలో హైపర్ సెన్సిటివ్, సెన్సిటివ్ వార్డులను ముందుగానే గుర్తించి అదనపు పోలీసు బలగాలతో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్పీ తెలిపారు. ఎన్నికల సమయంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే అవకాశం ఉన్న రౌడీషీటర్లు, అనుమానితులు, గత ఎన్నికల్లో సమస్యలు సృష్టించిన వ్యక్తులను గుర్తించి బైండోవర్ చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు నివారణ చర్యలు తీసుకుంటున్నామని స్పష్టం చేశారు.
విధుల్లో నిర్లక్ష్యం వహించరాదు
ఎన్నికల విధుల్లో ఉన్న పోలీసు అధికారులు, సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ ఆదేశించారు. పోలింగ్ కేంద్రాలు, పరిసర ప్రాంతాల్లో నిరంతర నిఘా కొనసాగించాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు అవకాశం లేకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. విధుల నిర్వహణలో నిర్లక్ష్యానికి తావులేకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఎన్నికల ప్రక్రియను ప్రశాంతంగా, స్వేచ్ఛాయుతంగా, నిష్పక్షపాతంగా, పారదర్శకంగా నిర్వహించడమే పోలీసు శాఖ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి, పోలీసు ఆంక్షలను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎన్నికలు సజావుగా జరిగేందుకు ప్రజలు, రాజకీయ పార్టీల నాయకులు, అభ్యర్థులు పోలీసు శాఖకు సహకరించాలని కోరారు.

జిల్లాలోని పట్టణ స్థానిక సంస్థల ఎన్నికలకు, గ్రామ పంచాయతీ ఎన్నికలకు పూర్తి స్థాయిలో ఏర్పాట్లు

- నవంబర్ 26న ఎంటిఎంసీ, పొన్నూరు మున్సిపాలిటీల్లో పోలింగ్ - 30న ఓట్ల లెక్కింపు
- గ్రామ పంచాయతీ ఎన్నికల్లో రెండో దశ నవంబర్ 29న, మూడో దశ డిసెంబర్ 2న పోలింగ్
- ఓటర్లందరూ తమ విలువైన ఓటు హక్కును వినియోగించుకోవాలి
- జిల్లా కలెక్టర్ సి.ఎం. సాయికాంత్ వర్మ



గుంటూరు, నవంబర్ 17 (జర్నలిస్ట్ ఫైల్): గుంటూరు జిల్లాలో ఇప్పటికే గుంటూరు, తెనాలి పట్టణ స్థానిక సంస్థల ఎన్నికలతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలను ఎలాంటి ఇబ్బందులు లేకుండా స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా నిర్వహించామని జిల్లా కలెక్టర్ సి.ఎం. సాయికాంత్ వర్మ తెలిపారు. ఎన్నికల నిర్వహణకు సహకరించిన ఓటర్లు, ప్రజలు, గుంటూరు జిల్లా ప్రజలందరికీ ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు.
మంగళగిరి–తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ (ఎంటిఎంసీ), పొన్నూరు మున్సిపాలిటీలకు నవంబర్ 26వ తేదీన ఎన్నికలు నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తోందని తెలిపారు. ఎంటిఎంసీ, పొన్నూరు మున్సిపాలిటీల ఎన్నికలు మరియు పంచాయతీ ఎన్నికల వివరాలను తెలియజేసేందుకు కలెక్టరేట్‌లో మంగళవారం జిల్లా కలెక్టర్ పాత్రికేయ సమావేశం నిర్వహించారు.
ఎంటిఎంసీలో 62 వార్డులు, పొన్నూరు మున్సిపాలిటీలో 40 వార్డులు కలిపి మొత్తం 102 వార్డులకు ఎన్నికలు నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఎంటిఎంసీలో 261, పొన్నూరులో 84 కలిపి మొత్తం 345 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేసినట్లు వివరించారు.
ఈ రెండు పట్టణ స్థానిక సంస్థల్లో కలిపి మొత్తం 2,97,913 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారని తెలిపారు. ఎంటిఎంసీలో 2,37,713 మంది, పొన్నూరులో 60,200 మంది ఓటర్లు ఉన్నారని వెల్లడించారు.
పోలింగ్ నిర్వహణకు ప్రిసైడింగ్ అధికారులు, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు, ఇతర పోలింగ్ సిబ్బంది, మైక్రో అబ్జర్వర్లతో కలిపి సుమారు 2,201 మంది సిబ్బందికి విధులుకేటాయించామని తెలిపారు. వారికి నిర్ణీత షెడ్యూల్ ప్రకారం శిక్షణ నిర్వహిస్తున్నామని, నవంబర్ 25వ తేదీన సంబంధిత పోలింగ్ కేంద్రాల్లో రిపోర్ట్ చేసి 26వ తేదీన పోలింగ్ నిర్వహించేందుకు సిద్ధంగా ఉండాలని సూచించారు.
నామినేషన్ల వివరాలు
ఎంటిఎంసీలో మేయర్ పదవికి 21 నామినేషన్లు, పొన్నూరు మున్సిపాలిటీలో చైర్‌పర్సన్ పదవికి 10 నామినేషన్లు దాఖలయ్యాయని కలెక్టర్ తెలిపారు. వార్డు సభ్యుల పదవులకు ఎంటిఎంసీలో 569, పొన్నూరులో 200 నామినేషన్లు దాఖలైనట్లు వివరించారు.
నవంబర్ 26వ తేదీన పోలింగ్ నిర్వహించిన అనంతరం నవంబర్ 30వ తేదీన ఓట్ల లెక్కింపు చేపట్టనున్నట్లు తెలిపారు. ఎంటిఎంసీ ఎన్నికల కౌంటింగ్ కోసం ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో స్ట్రాంగ్ రూములు ఏర్పాటు చేశామని, పొన్నూరు మున్సిపాలిటీకి సంబంధించి జీబీసీ రోడ్డులోని సెయింటెన్స్ స్కూల్‌లో రిసెప్షన్ కేంద్రం, స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ హాళ్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎన్నికలకు అవసరమైన బ్యాలెట్ బాక్సులు, పోలింగ్ సామగ్రిని సిద్ధం చేశామని పేర్కొన్నారు.
పోలింగ్ సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం
ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బంది తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం కల్పించినట్లు కలెక్టర్ తెలిపారు. ఎంటిఎంసీ, పొన్నూరు ప్రాంతాల్లో నవంబర్ 21, 22 తేదీల్లో పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటేషన్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఎన్నికల విధులకు సంబంధించిన పోస్టింగ్ ఆర్డర్‌ను తీసుకొని ఫెసిలిటేషన్ కేంద్రానికి వెళ్లి పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కువినియోగించుకోవాలని సూచించారు.
గ్రామ పంచాయతీ ఎన్నికల ఏర్పాట్లు
జిల్లాలో రెండు, మూడో దశల్లో మొత్తం 208 గ్రామ పంచాయతీలు, 2,208 వార్డులకు ఎన్నికలు నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఈ రెండు దశల్లో కలిపి మొత్తం 5,88,453 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారని వెల్లడించారు.
రెండో దశలో నవంబర్ 29వ తేదీన చేబ్రోలు, పొన్నూరు, తెనాలి, పెదకాకాని మండలాల్లోని 87 గ్రామ పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ దశలో 1,008 పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని వివరించారు.
మూడో దశలో డిసెంబర్ 2వ తేదీన గుంటూరు రూరల్, పెదనందిపాడు, ఫిరంగిపురం, ప్రత్తిపాడు, మేడికొండూరు, వట్టిచెరుకూరు, కాకుమాను, దుగ్గిరాల మండలాల్లోని 121 గ్రామ పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ దశలో 1,309 పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం సన్నద్ధమవుతోందని పేర్కొన్నారు.
ఓటర్లు తప్పనిసరిగా ఓటు హక్కు వినియోగించుకోవాలి
జిల్లాలో పట్టణ స్థానిక సంస్థలు, గ్రామ పంచాయతీ ఎన్నికలను స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు పోలీసు, రెవెన్యూ, ఇతర శాఖల అధికారులు, జిల్లా యంత్రాంగం పూర్తి స్థాయిలో సిద్ధంగా ఉందని కలెక్టర్ తెలిపారు. ఎన్నికల నిర్వహణలో ప్రజలు, ఓటర్లు సహకరించాలని కోరారు.
ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ఎంతో విలువైనదని, ఎంటిఎంసీ, పొన్నూరు మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీ ఎన్నికల్లో అర్హులైన ఓటర్లందరూ తప్పనిసరిగా తమ ఓటు హక్కును వినియోగించుకొని ఎన్నికల ప్రక్రియలో భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ సి.ఎం. సాయికాంత్ వర్మ విజ్ఞప్తి చేశారు.
ఈ పాత్రికేయ సమావేశం లో జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీ వాస్తవ, జిల్లా రెవిన్యూ అధికారి ఎన్ ఎస్ కె. ఖాజావలి పాల్గొన్నారు.

రాష్ట్ర ఎన్నికల సంఘం మార్గదర్శకత్వంలో స్థానిక సంస్థల ఎన్నికలకు పటిష్ట భద్రతా చర్యలు

- ప్రశాంతంగా, స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు పటిష్ట భద్రతా చర్యలు
- ఎన్నికల నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా పటిష్టమైన శాంతిభద్రతల చర్యలు
- ఐజీ బి. రాజకుమారి

అమరావతి, నవంబర్ 17 (జర్నలిస్ట్ ఫైల్): ఎన్నికల సంఘం (ఎస్ఈసీ) మార్గదర్శకత్వంలో ఆంధ్రప్రదేశ్ పోలీస్ శాఖ రాష్ట్రవ్యాప్తంగా రెండో విడత సాధారణ స్థానిక సంస్థల ఎన్నికలు ప్రశాంతంగా, స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు విస్తృతమైన భద్రతా చర్యలు చేపట్టిందని మంగళవారం ఒక ప్రకటనలో ఐజీ రాజకుమారి తెలిపారు.
2026 నవంబర్ 14వ తేదీ నుంచి నవంబర్ 16వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన శాంతిభద్రతల పరిరక్షణ చర్యలు, నమోదు చేసిన కేసులు, ఇతర వివరాలు ఇలా ఉన్నాయి.
శాంతిభద్రతల పరిరక్షణ – ముఖ్య గణాంకాలు
నమోదైన ఎఫ్ఐఆర్‌లు 24
ఎన్నికల ప్రవర్తనా నియమావళి (ఎంసీసీ) ఉల్లంఘన కేసులు 444
స్వాధీనం చేసుకున్న మద్యం 200.55 లీటర్లు
బీఎన్ఎస్ఎస్ సెక్షన్లు 126/129 కింద బైండ్ ఓవర్ చేసిన కేసులు 722
బైండ్ ఓవర్ చేసిన వ్యక్తులు 5,327
ఎన్నికల ప్రక్రియలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా, ప్రజలు స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా పోలీస్ శాఖ అన్ని ముందస్తు భద్రతా చర్యలు చేపట్టిందని ఐజీ బి. రాజకుమారి ఆ ప్రకటనలో తెలియజేశారు.

పోలీస్ అమరవీరుల సంస్మరణ పోటీల విజేతలకు బహుమతులు



- విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్

గుంటూరు, నవంబర్ 17 (జర్నలిస్ట్ ఫైల్): పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా జిల్లా పోలీస్ శాఖ నిర్వహించిన వ్యాసరచన, ఉపన్యాసం, చిత్రలేఖనం పోటీల విజేతలకు ఎస్పీ వకుల్ జిందాల్ మంగళవారం నగదు బహుమతులు అందజేశారు. గత నెల 26, 27 తేదీల్లో పోలీస్ సిబ్బంది, వారి కుటుంబాల చిన్నారులు, పాఠశాలలు, కళాశాలల విద్యార్థులకు ఈ పోటీలు నిర్వహించారు.
వ్యాసరచనలో పోలీస్ సిబ్బంది విభాగంలో ఎన్. కాంతకుమారి, పి. అరుణకుమారి, బి. జాస్మిన్; పోలీస్ కుటుంబాల విభాగంలో షేక్ ఫర్వాజ్ అహ్మద్, టి. శ్వేత, ఎస్.కె. సభనం; పాఠశాల విద్యార్థుల విభాగంలో కె. కార్తికేయ, బి. దీపు, టి.బి.వి.ఎన్. సౌ విజేతలుగా నిలిచారు. ఉపన్యాసంలో పోలీస్ సిబ్బంది విభాగంలో బి. జాస్మిన్, టి. అరుణకుమారి, ఎన్. కాంతకుమారి; పోలీస్ కుటుంబాల విభాగంలో కె. రాజేష్ గౌడ్, ఎం. శాలిని, ఎస్.కె. పర్వాజ్ అహ్మద్; విద్యార్థుల విభాగంలో కె. కార్తికేయ, ఎం. శ్రీదేవి, ఎస్.కె. సుమయ బహుమతులు పొందారు.
చిత్రలేఖనంలో పోలీస్ సిబ్బంది విభాగంలో టి. అరుణకుమారి, ఎన్. కాంతకుమారి; పోలీస్ కుటుంబాల విభాగంలో టి. భవ్యశ్రీ, ఎం. శాలిని, ఎం.వి. మంజుష; విద్యార్థుల విభాగంలో టి. మోక్షశ్రీ, యుగ్మాప్రియ, ఎన్. భవాని బహుమతులు అందుకున్నారు.
ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు సృజనాత్మకత, ఇతర నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని క్రమశిక్షణతో కృషి చేస్తే విజయాలు సాధించవచ్చన్నారు. కార్యక్రమంలో ఆర్మ్డ్ రిజర్వుడు డీఎస్పీ సంకురయ్య, పోలీస్ అధికారులు, సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కూటమి విజయానికి సమన్వయంతో ముందుకు



- టీడీపీ ఎమ్మెల్యేలతో బీజేపీ ఏపీ ఇన్‌ఛార్జి అరవింద్ సింగ్ భదోరియా భేటీ

రాజమహేంద్రవరం: రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ ఎన్నికల్లో కూటమి మేయర్ అభ్యర్థి రేలంగి శ్రీదేవి విజయానికి బీజేపీ, టీడీపీ నాయకులు సమన్వయంతో పనిచేసేలా బీజేపీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఇన్‌ఛార్జి అరవింద్ సింగ్ భదోరియా కూటమి నేతలతో సమావేశమయ్యారు. ఇందులో భాగంగా రాజమండ్రి సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, రాజమండ్రి రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరిలను వారి నివాసాల్లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మేయర్ అభ్యర్థి రేలంగి శ్రీదేవిగెలుపుకోసం చేపట్టాల్సిన ఎన్నికల ప్రచారం, టీడీపీ–జనసేన బీజేపీ నాయకులు, కార్యకర్తల మధ్య సమన్వయం, వార్డుల వారీగా ప్రచార కార్యక్రమాల నిర్వహణ తదితర అంశాలపై చర్చించారు. కూటమి అభ్యర్థి విజయానికి ఇరు పార్టీల నాయకులు సమష్టిగా కృషి చేయాల్సిన అంశాలపై అభిప్రాయాలు పంచుకున్నారు. ఈ సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర పాల్గొన్నారు.

INK OF TRUTH
జర్నలిస్ట్ ఫైల్
తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ ఫైల్ దినపత్రిక చందాదారులుగా చేరాలని అనుకుంటున్నారా? అయితే ఈ నెంబర్‌కు ఫోన్ చేయండి
సర్క్యులేషన్ మేనేజర్
76 61 80 59 68

ఉద్యోగుల సమస్యల పరిష్కారమే ఏపీ ఎన్జీజీఓ సంఘం ప్రధాన అజెండా



- బకాయిల చెల్లింపు, డీపల మంజూరు, హెల్త్ కార్డుల సమర్థ అమలుకు నిరంతర కృషి
- ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ ఉద్యోగుల సహకారం మరువలేనిది
- ఏపీ ఎన్జీజీఓ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు విద్యాసాగర్

విజయవాడ, నవంబర్ 17 (జర్నలిస్ట్ ఫైల్): ఉద్యోగుల సమస్యల పరిష్కారం, హక్కుల పరిరక్షణ, ఆర్థిక ప్రయోజనాల సాధనే ఏపీ ఎన్జీజీఓ సంఘం ప్రధాన లక్ష్యమని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, ఏపీజేఏసీ చైర్మన్ ఎ. విద్యాసాగర్ తెలిపారు. ఉద్యోగులకు రావాల్సిన పెండింగ్ బకాయిల చెల్లింపు, కరువు భత్యం (డీఏ) మంజూరు, హెల్త్ కార్డుల సమర్థవంతమైన అమలు కోసం సంఘం నిరంతరం కృషి చేస్తోందని పేర్కొన్నారు.

మంగళవారం విజయవాడలోని డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయ నాన్ టీచింగ్ ఉద్యోగుల సంఘం నిర్వహించిన సర్వసభ్య సమావేశానికి విద్యాసాగర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నాన్ టీచింగ్ ఉద్యోగుల సంఘం నూతన అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైన ముంచిరాజు అక్కిరాజుతో పాటు నూతన కార్యవర్గ సభ్యులకు విద్యాసాగర్, డి.వి. రమణ అభినందనలు తెలిపారు.

సమావేశంలో విద్యాసాగర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులకు రావాల్సిన పెండింగ్ బకాయిల చెల్లింపు, డీఏ మంజూరు, ఉద్యోగులందరికీ మెరుగైన వైద్య సేవలు అందించేలా హెల్త్ కార్డుల సమర్థవంతమైన అమలు వంటి అంశాలపై ప్రభుత్వంతో నిరంతరం చర్చలు జరుపుతున్నామని చెప్పారు. ఉద్యోగుల ఆర్థిక ప్రయోజనాలను సాధించడం, వారి సమస్యలకు పరిష్కారం చూపడం సంఘం ప్రధాన బాధ్యతగా భావిస్తున్నామన్నారు.

డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయ ఉద్యోగులకు ఏపీ ఎన్జీజీఓ సంఘంలో, జేఏసీలో ప్రత్యేక స్థానం ఉందని పేర్కొన్నారు. గత 30 సంవత్సరాలుగా విశ్వవిద్యాలయ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి సంఘం విశేషంగా కృషి చేసిందన్నారు. ఉద్యోగుల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం చేపట్టిన ఉద్యమాలు, కార్యక్రమాలకు రాష్ట్రవ్యాప్తంగా ఉద్యోగులు అందిస్తున్న మద్దతు, సహకారం ఎంతో విలువైనవని తెలిపారు. ముఖ్యంగా ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ ఉద్యోగులు మొదటి నుంచి సంఘానికి అందిస్తున్న సహకారం, కార్యక్రమాల్లో చూపుతున్న చొరవ, ఐక్యత మరువలేనివని ప్రశంసించారు. ఉద్యోగుల హక్కుల సాధనలో ఐక్యతే సంఘానికి అసలైన బలమని స్పష్టం చేశారు.

విశ్వవిద్యాలయ ఉద్యోగుల పదవీ విరమణ వయస్సును 60 నుంచి 62 సంవత్సరాలకు పెంచడం, సుమారు 11 వేల మంది సీపీఎస్ ఉద్యోగులను ఓపీఎస్ పరిధిలోకి తీసుకురావాలనే డిమాండ్ల సాధనకు ఏపీజేఏసీ చైర్మన్‌గా విద్యాసాగర్ చేస్తున్న కృషిని నాన్ టీచింగ్ ఉద్యోగుల సంఘం ప్రతినిధులు అభినందించారు. ఉద్యోగుల సంక్షేమం కోసం చేపట్టే ప్రతి కార్యక్రమానికి సంపూర్ణ మద్దతు అందిస్తామని ప్రకటించారు.

ఏపీ ఎన్జీజీఓ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.వి. రమణ మాట్లాడుతూ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి సంఘం ఎల్లప్పుడూ ముందుంటుందని తెలిపారు. ఉద్యోగుల ఐక్యత, సమష్టి కృషితో భవిష్యత్తులో మరిన్ని సమస్యలను పరిష్కరించుకునేందుకు కృషి చేస్తామని భరోసా ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో ఏఐఎస్‌జీఈఎఫ్ మహిళా ఉపసంఘం సభ్యురాలు రాజ్యలక్ష్మి, రాష్ట్రసీపీఎస్ ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి సి.ఎం. దాస్, ఎన్టీఆర్ జిల్లా ఏపీ ఎన్జీజీఓ అధ్యక్షుడు డి. సత్యనారాయణరెడ్డి, కార్యదర్శి రమేష్, సిటీ అధ్యక్షుడు సి.వి.ఆర్. ప్రసాద్, జిల్లా పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు జి. నారాయణరావు, పబ్లిక్ సెక్టార్ ఉద్యోగుల సంఘం గౌరవ అధ్యక్షుడు సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

అఘోరిల సమక్షంలో రుద్రాభిషేకం



- డిసెంబర్ 7న గుంటూరులో ఆధ్యాత్మిక కార్యక్రమం
- మహా రుద్రాభిషేకం ఉచిత ప్రవేశ పాసుల విడుదల

గుంటూరు, నవంబర్ 17 (జర్నలిస్ట్ ఫైల్): ఆంధ్రప్రదేశ్ హైందవ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో డిసెంబర్ 7న గుంటూరు నగరంలో నిర్వహించనున్న మహా రుద్రాభిషేకం--2026 కార్యక్రమానికి సంబంధించిన ఉచిత ప్రవేశ పాసులను బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ బుచ్చి రాంప్రసాద్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జూపూడి రంగరాజు, జాతీయ స్పైసెస్ బోర్డు డైరెక్టర్ కొత్తూరు వెంకట సుబ్బారావు సంయుక్తంగా విడుదల చేశారు. డాక్టర్ రాజేష్ నాథ్ జీ అఘోరి సమక్షంలో ఈ కార్యక్రమం జరగనుంది.

ఈ సందర్భంగా బుచ్చి రాంప్రసాద్ మాట్లాడుతూ కార్తీక మాసం అత్యంత పవిత్రమైనదని, ఈ మాసంలో పరమశివుడికి అభిషేకం నిర్వహించడం విశేష పుణ్యప్రదమని పేర్కొన్నారు. అఘోరిల ఆధ్వర్యంలో నిర్వహించే మహా రుద్రాభిషేకంలో పాల్గొనే అవకాశం భక్తులకు లభించడం సంతోషకరమన్నారు. గుంటూరు నగర ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

జూపూడి రంగరాజు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ హైందవ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో గుంటూరు నగర 41వ డివిజన్ కార్పొరేటర్ గాయత్రి బెహరా గత ఐదేళ్లుగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారని, ప్రస్తుతం ఆరో ఏడాది కూడా అఘోరిల సమక్షంలో మహా రుద్రాభిషేకాన్ని ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారని తెలిపారు. డిసెంబర్ 7వ తేదీ సాయంత్రం 6 గంటలకు స్థానిక వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో కార్యక్రమం ప్రారంభమవుతుందని వెల్లడించారు.

కార్యక్రమంలో పాల్గొనాలనుకునే భక్తులు తప్పనిసరిగా ఉచిత ప్రవేశ పాసులు పొందాలని సూచించారు. పాసుల కోసం 9949148006 నంబరుకు ఫోన్ చేసి సంప్రదించాలని కోరారు. భక్తులందరూ పెద్ద సంఖ్యలో పాల్గొని మహా రుద్రాభిషేకాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో నిర్వాహకురాలు, 41వ డివిజన్ కార్పొరేటర్ గాయత్రి బెహరా, బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ వెలగలేటి గంగాధర్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాలపాటి రవికుమార్, బీజేపీ నాయకులు వనమా నరేంద్ర కుమార్, శివరాం, అబ్బూరి సాయిరాం, రామరాజు, త్రికోటేశ్వరరావు, ప్రకాష్ రావు తదితరులు పాల్గొన్నారు.

‘ఇంటింటికీ యోగా’కు 12 ప్రముఖ సంస్థల చేయూత

- ఉచిత యోగా, ధ్యాన శిక్షణకు ముందుకొచ్చిన సంస్థలు..
- మహిళలు, వృద్ధులు, చిన్నారులకు ప్రత్యేక కార్యక్రమాలు
- త్వరలో ప్రత్యేక పోర్టల్ ప్రారంభం.. సేవలందించే సంస్థలతో ప్రభుత్వం ఒప్పందాలు



అమరావతి, నవంబర్ 17 (జర్నలిస్ట్ ఫైల్): ప్రజల దైనందిన జీవితంలో యోగాను భాగం చేయాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ‘ఇంటింటికీ యోగా’ కార్యక్రమానికి 12 ప్రముఖ సంస్థలు తమ వంతు సహకారం అందించేందుకు ముందుకొచ్చాయి. రాష్ట్రవ్యాప్తంగా ఉచిత యోగా, ధ్యాన శిక్షణ, ఆరోగ్య అవగాహన తరగతులు, ప్రత్యేక ఆరోగ్య శిబిరాలు నిర్వహించేందుకు సంసిద్ధత వ్యక్తం చేశాయి. మహిళలు, చిన్నారులు, వృద్ధులు, యువత కోసం ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు చేపట్టనున్నాయి.

ప్రత్యక్షంగా, ఆన్‌లైన్ ద్వారా శిక్షణ అందించడంతోపాటు గ్రామాలు, పట్టణాల్లోని యోగా కేంద్రాలు, శిక్షకులు, సేవకుల ద్వారా కార్యక్రమాలను విస్తరించేందుకు సంస్థలు ప్రతిపాదనలు సమర్పించాయి. మధుమేహం, అధిక రక్తపోటు, స్థూలకాయం వంటి సమస్యల నివారణకు ఉపయోగపడే ప్రత్యేక యోగా పద్ధతులను పరిచయం చేసేందుకు కూడా సిద్ధమని తెలిపాయి. ఈ సంస్థల ప్రతిపాదనలపై ఆయుష్ శాఖ డైరెక్టర్ రోణంకి గోపాలకృష్ణ రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌తో చర్చించారు.

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రజల జీవనశైలిలో యోగాను అంతర్భాగం చేయాలనే ఉద్దేశంతో ఏడాది పొడవునా ‘ఇంటింటికీ యోగా’ కార్యక్రమాలు నిర్వహించాలని ప్రకటించారు. ఈ లక్ష్య సాధనలో భాగంగా మంత్రి సత్యకుమార్ యాదవ్ ఇటీవల ప్రముఖ యోగా సంస్థల ప్రతినిధులతో సమావేశమై ప్రభుత్వ కార్యక్రమానికి సహకరించాలని కోరారు. దీనికి స్పందించిన సంస్థలు ఉచితంగా సేవలందించేందుకు లిఖితపూర్వకంగా అంగీకారం తెలిపాయి.

త్వరలో ప్రత్యేక పోర్టల్ ప్రారంభం

‘ఇంటింటికీ యోగా’ కార్యక్రమం నిర్వహణకు ప్రత్యేక పోర్టల్‌ను ప్రభుత్వం త్వరలో ప్రారంభించనుంది. ఈ వేదిక ద్వారా ప్రత్యక్ష, ఆన్‌లైన్ శిక్షణ కార్యక్రమాలను అందుబాటులోకి తీసుకురానున్నారు. ప్రతిపాదనలు సమర్పించిన సంస్థల సేవలు, సామర్థ్యాలను పరిశీలించిన అనంతరం వాటితో ప్రభుత్వం ఒప్పందాలు చేసుకోనుంది. వ్యాధులు వచ్చిన తర్వాత చికిత్స అందించడం కంటే ముందస్తు ఆరోగ్య సంరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలన్నది ప్రభుత్వ ఉద్దేశం. ప్రజల్లో యోగాపై ఆసక్తి పెంచడం, ఆరోగ్యకరమైన జీవనశైలిని ప్రోత్సహించడం, వ్యాధుల నివారణపై అవగాహన కల్పించడం ద్వారా స్వర్ణాంధ్ర లక్ష్య సాధనకు ఈ కార్యక్రమం దోహదపడుతుందని ప్రభుత్వం భావిస్తోంది.

బెంగళూరుకు చెందిన ఆర్ట్ ఆఫ్ లివింగ్ సంస్థ 367 మందికి పైగా శిక్షకులతో మండల స్థాయిలో సేవలందించేందుకు ముందుకొచ్చింది. ఉచిత నవచైతన్య శిబిరాలు, పద్మసాధన, 14 రోజుల యోగా సాధన, ధ్యాన తరగతులతోపాటు తెలుగు వీడియో పాఠాలను అందించనుంది. రాజస్థాన్‌కు చెందిన బ్రహ్మకుమారీస్ సంస్థ రాజయోగ ధ్యానం, ఒత్తిడి తగ్గింపు, వ్యక్తిత్వ వికాసంపై శిక్షణ ఇవ్వనుంది. విద్యార్థులు, యువత, మహిళలు, వృద్ధులు, ఉద్యోగులు, ఉపాధ్యాయుల కోసం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనుంది.

విజయవాడకు చెందిన హార్ట్‌ఫుల్‌నెస్ సంస్థ 4 వేల మంది సేవకులు, 27 కేంద్రాల ద్వారా యోగా, ధ్యాన శిక్షణ అందించనుంది. వ్యసనాల నివారణ శిబిరాలు, వైద్య సేవలు, ఆన్‌లైన్ వైద్య సంప్రదింపులు నిర్వహించేందుకు ప్రతిపాదించింది. హరిద్వార్‌కు చెందిన పతంజలి యోగా సమితి రాష్ట్రంలోని 242 కేంద్రాలు, 500 మంది శిక్షకులతో రోజుకు 10 వేల మందికి శిక్షణ ఇచ్చే సామర్థ్యాన్ని కలిగి ఉంది. ఉచిత ప్రత్యక్ష, ఆన్‌లైన్ తరగతులు నిర్వహించనుంది.

విశాఖపట్నానికి చెందిన ప్రకృతి వైద్య, యోగా వైద్యుల సంఘం 393 మంది ప్రకృతి వైద్య పట్టభద్రులు, 134 మంది సేవకులతో 134 వేదికల్లో శిక్షణ ఇవ్వనుంది. దీర్ఘకాలిక వ్యాధుల నివారణతోపాటు మహిళలు, వృద్ధుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించనుంది. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన విశ్వ ఆయుర్వేద పరిషత్ 1,200 మంది సేవకులతో జిల్లా, మండల స్థాయిలో కార్యక్రమాలు నిర్వహించనుంది. ఆయుర్వేద వైద్యుల ద్వారా యోగా చికిత్స నిపుణులకు వైద్యపరమైన సహకారం అందించనుంది.

నాగపూర్‌కు చెందిన హోలిస్ట్ సంస్థ ఏడాది పాటు ఉచితంగా 14 రోజుల ఆన్‌లైన్ యోగా శిక్షణ ఇవ్వనుంది. రోజుకు ఆరు విడతల్లో తరగతులు నిర్వహించి, శిక్షణ పూర్తిచేసిన వారికి ధ్రువీకరణ పత్రాలు అందించనుంది. రాజస్థాన్‌కు చెందిన కామ్య యోగా సంస్థ మహిళల ఆరోగ్యంపై ప్రత్యేకంగా దృష్టి సారించనుంది. పీసీఓఎస్, పీసీఓడీ, థైరాయిడ్, హార్మోన్ల సమస్యలకు సంబంధించిన యోగా తరగతులు నిర్వహించనుంది.

బెంగళూరుకు చెందిన యోగిపై సంస్థ 90కి పైగా యోగాసనాలు, 25కు పైగా శిక్షణ కార్యక్రమాలతో కూడిన యాప్‌ను ఉచితంగా అందించనుంది. కృత్రిమ మేధ సాయంతో ఆసనాలు వేసే విధానాన్ని పరిశీలించి తగిన సూచనలు ఇవ్వనుంది. జూస్పీ సంస్థ ‘ఇంటింటికీ యోగా’ కోసం ప్రత్యేక యాప్‌ను రూపొందించనుంది. సెల్‌ఫోన్ కెమెరా ద్వారా ఆసనాల తీరును పరిశీలించి సూచనలు ఇవ్వడంతోపాటు ప్రారంభకులు, మహిళలు, చిన్నారులు, ఉద్యోగుల కోసం 14 విభాగాల్లో శిక్షణ అందించనుంది.

హైదరాబాద్‌కు చెందిన యోగాంత టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ తెలుగు, ఆంగ్ల భాషల్లో రోజువారీ ప్రత్యక్ష యోగా తరగతులు నిర్వహించనుంది. ఆయుష్ సిబ్బంది, వ్యాయామ ఉపాధ్యాయులు, ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ ఇవ్వనుంది. మధుమేహం, అధిక రక్తపోటు, స్థూలకాయం, దీర్ఘకాలిక నొప్పులు, ఒత్తిడి వంటి సమస్యలకు ప్రత్యేక యోగా పద్ధతులను పరిచయం చేయనుంది. కోయంబత్తూరుకు చెందిన ఈషా ఫౌండేషన్ ఉచిత ఉప యోగా, ఈశా క్రియ, చిత్ శక్తి, ఏడు నిమిషాల ధ్యాన కార్యక్రమాలను అందించనుంది. సద్గురు యాప్ ద్వారా సేవలందించడంతోపాటు ఇన్నర్ ఇంజినీరింగ్, అంగమర్దన, సూర్య క్రియ, యోగాసనాలు, గర్భిణుల కోసం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనుంది.

అక్వాన్ తుఫాను ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు జిల్లా యంత్రాంగం అప్రమత్తం

- 74 పునరావాస కేంద్రాలు ఏర్పాటు- సుమారు 10 వేల మందికి వసతి
- గర్భిణీ స్త్రీలను ముందుగానే ఆసుపత్రులకు తరలింపు కు చర్యలు
- రైతులు పంట నష్ట నివారణకు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి
- తుఫాన్ ను ఎదుర్కునేందుకు ప్రజలు సహకారం అవసరం
- జిల్లా కలెక్టర్ సి యం సాయికాంత్ వర్మ



గుంటూరు, నవంబర్ 17 (జర్నలిస్ట్ ఫైల్): ఆంధ్రప్రదేశ్ కోస్తా తీర ప్రాంతాలకు తుఫాను ముప్పు పొంచి ఉన్న నేపథ్యంలో జిల్లా యంత్రాంగం, ప్రజలు అన్ని విధాలుగా అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ సి.ఎం. సాయికాంత్ వర్మ సూచించారు.

తుఫాను ప్రభావం, ముందస్తు సన్నద్ధతపై కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, చెన్నై నుంచి కాకినాడ మధ్య తుఫాను తీరం దాటే అవకాశం ఉందన్న వాతావరణ హెచ్చరికల నేపథ్యంలో జిల్లా యంత్రాంగం ఆదివారం ఉదయం నుంచే అన్ని శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ పూర్తి స్థాయిలో సన్నద్ధమైందన్నారు. గత తుఫానుల అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ప్రాణ, ఆస్తి నష్టాలను వీలైనంతగా తగ్గించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. రాబోయే రెండు రోజులు (20, 21 తేదీలలో) భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు.

ప్రజల ఇళ్లలోకి వర్షపు నీరు చేరకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడంతో పాటు వ్యవసాయ రంగానికి నష్టం వాటిల్లకుండా ప్రత్యేక దృష్టి సారించామన్నారు. ప్రతి మండలానికి ఒక ప్రత్యేక అధికారిని నియమించి, సంబంధిత తహశీల్దార్లతో కలిసి క్షేత్రస్థాయిలో పరిస్థితులను పరిశీలిస్తూ రైతుల నుంచి అభిప్రాయాలు, సమస్యలపై ఫీడ్‌బ్యాక్ సేకరిస్తున్నట్లు వివరించారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ముందుగానే 74 పునరావాస కేంద్రాలను సిద్ధం చేశామని, వీటిలో సుమారు 10 వేల మందికి వసతి కల్పించే ఏర్పాట్లు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. అలాగే ముఖ్యంగా నవంబర్ 24వ తేదీ వరకు ప్రసవ తేదీలు ఉన్న గర్భిణీ స్త్రీలను గుర్తించి, ముందుగానే సమీపంలోని ఆసుపత్రులకు తరలించి సురక్షిత వసతి కల్పించాలని వైద్య ఆరోగ్య శాఖ అధికారులకు సూచించినట్లు తెలిపారు.

తుఫాను సమయంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా అవసరమైన విద్యుత్ స్తంభాలు, కండక్టర్లు, ట్రాన్స్‌ఫార్మర్లను ముందుగానే సిద్ధంగా ఉంచుకోవాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. అదేవిధంగా ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా నీటి ట్యాంకులను శుభ్రపరిచి, పూర్తి సామర్థ్యంతో నీటిని నిల్వ ఉంచాలని సంబంధిత అధికారులకు సూచించారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి

తుఫాను ప్రభావంతో పంటలకు నష్టం వాటిల్లకుండా రైతులు తక్షణమే తగిన ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. పంటల రక్షణకు తీసుకోవాల్సిన చర్యలపై వ్యవసాయ శాఖ ద్వారా అవగాహన కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు, సూచనలతో కూడిన కరపత్రాలను వాట్సాప్, ఇతర సమాచార మాధ్యమాల ద్వారా రైతులకు చేరవేయాలని అధికారులను ఆదేశించారు.

తుఫాను ప్రభావిత పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తూ, అన్ని శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని, క్షేత్రస్థాయిలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా ప్రజలకు అవసరమైన సహాయ సహకారాలు అందించాలని జిల్లా కలెక్టర్ సి.ఎం. సాయికాంత్ వర్మ స్పష్టం చేశారు.

ఈ పాత్రికేయ సమావేశంలో జాయింట్ కలెక్టర్ అతుతోష్ శ్రీ వాస్తవ, జిల్లా రెవిన్యూ అధికారి ఎన్ ఎస్ కె. ఖాజావలి పాల్గొన్నారు.

సర్పంచ్ పదవికి టెండర్ తరహా ఎంపిక

అనంతపురం నవంబర్ 17 (జర్నలిస్ట్ ఫైల్): అనంతపురం జిల్లా బెలుగుప్ప మండలంలోని నక్కలపల్లి గ్రామంలో సర్పంచ్ పదవి ఎంపిక కోసం స్థానికులు అనుసరించిన తీరు చర్చనీయాంశంగా మారింది. గ్రామాభివృద్ధికి ఎవరు ఎక్కువ నిధులు ఇస్తారనే అంశంపై చీటీల ద్వారా సర్పంచ్ అభ్యర్థిని ఖరారు చేయడం అందరి దృష్టిని ఆకర్షిస్తోంది.

నక్కలపల్లి గ్రామ పంచాయతీ సర్పంచ్ స్థానం ఈసారి మహిళకు రిజర్వ్ అయింది. దీంతో గ్రామానికి చెందిన పలువురు ఈ పదవిని ఆశించారు. అయితే ఎన్నికల్లో భారీగా ఖర్చు చేసే బదులు, ఆ మొత్తాన్ని గ్రామాభివృద్ధికి ఇస్తే బాగుంటుందనే ప్రతిపాదన గ్రామస్తుల మధ్య వచ్చింది. ఈ క్రమంలో సర్పంచ్ పదవి కోసం పోటీపడే అభ్యర్థులు గ్రామాభివృద్ధి కోసం ఎంత మొత్తం ఖర్చు చేయగలరో చీటీలపై రాసి డబ్బాలో వేయాలని నిర్ణయించారు. మొత్తం 9 మంది అభ్యర్థులు ఈ ప్రక్రియలో పాల్గొన్నారు.

అందరూ వేసిన చీటీలను గ్రామస్తుల సమక్షంలో తెరిచి చూడగా, స్థానిక నాయకుడు సుదర్శన్ రెడ్డి తన భార్య అఖిల పేరుతో అత్యధికంగా రూ. 25.60 లక్షలు ఇస్తామని రాశారు. మిగిలిన వారందరి కంటే ఈ మొత్తమే ఎక్కువగా ఉండటంతో, గ్రామస్తులంతా ఏకతాటిపైకి వచ్చి అఖిలను సర్పంచ్‌గా ఏకగ్రీవం చేసేందుకు అంగీకరించినట్లు సమాచారం. గతంలో కూడా ఇదే గ్రామంలో రూ. 21 లక్షల విరాళం ప్రతిపాదనతో సర్పంచ్‌ను ఇదే తరహాలో ఎంపిక చేసినట్లు స్థానికులు పేర్కొంటున్నారు.

అయితే, గ్రామాభివృద్ధి పేరుతో నిర్వహించిన ఈ ఎంపిక విధానంపై చట్టపరమైన సందేహాలు వ్యక్తమవుతున్నాయి. దేశంలో పంచాయతీ ఎన్నికలు పూర్తిగా ఎన్నికల సంఘం నిబంధనలు, రాష్ట్ర పంచాయతీరాజ్ చట్టాల ప్రకారమే జరగాల్సి ఉంటుంది.

గ్రామస్తులు తమ స్థాయిలో నిర్వహించుకున్న ఈ రకమైన వేలం లేదా టెండర్ విధానాలకు చట్టబద్ధమైన గుర్తింపు ఉండదు. ఎన్నికల నోటిఫికేషన్, నామినేషన్ల స్వీకరణ, అధికారిక పరిశీలన వంటి ప్రక్రియలు పూర్తయిన తర్వాతే ప్రజాస్వామ్యబద్ధంగా సర్పంచ్ ఎన్నిక చెల్లుబాటు అవుతుంది.

పీఎం-రాహత్ పథకంలో ప్రభుత్వ మెడికల్ కాలేజీల భాగస్వామ్యం అభినందనీయం

- మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి

అమరావతి, నవంబర్ 17 (జర్నలిస్ట్ ఫైల్): రోడ్డు ప్రమాద బాధితులకు ఉచిత వైద్యం అందించే పీఎం–రాహత్ పథకంలో దేశవ్యాప్తంగా ప్రభుత్వ మెడికల్ కాలేజీలను భాగస్వాములను చేయడం అభినందనీయమని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు.

ఇప్పటికే రోడ్డు ప్రమాద బాధితులకు రూ. 1.5 లక్షల వరకు నగదు రహిత చికిత్స అందిస్తున్నామని తెలిపారు. ప్రమాదం జరిగిన సమయంలో బాధితులకు తక్షణ వైద్య సేవలు అందించి విలువైన ప్రాణాలను కాపాడేందుకు ఈ పథకం ఎంతగానో దోహదపడుతుందని అన్నారు.

అత్యవసర వైద్య సేవలను మరింత బలోపేతం చేస్తూ ప్రజల ప్రాణాలకు భరోసా కల్పించేలా కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం హర్షణీయమని పేర్కొన్నారు. ఈ ప్రజాహిత నిర్ణయానికి కృషి చేసిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, కూటమి ప్రభుత్వానికి మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి అభినందనలు తెలిపారు.

సీపీఎస్ నుంచి ఓపీఎస్ మార్పులో సాంకేతిక సమస్యలు పరిష్కరించాలి

- జీఓ నెం.158 మార్గదర్శకాల అమలులో ఇబ్బందులు..
- ఫైనాన్స్ శాఖ జాయింట్ సెక్రటరీకి ఏపీసీపీఎస్ఈఏ వినతి



అమరావతి, నవంబర్ 17 (జర్నలిస్ట్ ఫైల్): రాష్ట్రప్రభుత్వం ఇటీవల సుమారు 11 వేల మంది ఉద్యోగులను కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సీపీఎస్) నుంచి పాత పెన్షన్ విధానం (ఓపీఎస్)లోకి మారుస్తూ జారీ చేసిన జీఓ నెం.158 మార్గదర్శకాల అమలులో ఎదురవుతున్న సాంకేతిక, పరిపాలనాపరమైన సమస్యలను పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ (ఏపీసీపీఎస్ఈఏ) రాష్ట్ర అధ్యక్షుడు కొరకుడి సతీష్, ప్రధాన కార్యదర్శి సీఎం దాస్ కోరారు.

ఈ మేరకు మంగళవారం రాష్ట్రసచివాలయంలో ఆర్థిక శాఖ జాయింట్ సెక్రటరీ గౌతమ్ అల్లాడ ను కలిసి ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించి వినతిపత్రం అందజేశారు. ఓపీఎస్‌కు మారేందుకు ప్రభుత్వం నిర్దేశించిన ప్రక్రియలో కొన్ని ప్రత్యేక విభాగాల ఉద్యోగులకు ఎదురవుతున్న ఇబ్బందులపై స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేయాలని విజ్ఞప్తి చేశారు.

ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం ఉద్యోగులు మొదట ఇనిషియల్ అపాయింటింగ్ అథారిటీ (ఐఏఏ) నుంచి నాలుగు ధ్రువీకరణ పత్రాలు పొందినిధి పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుందని సంఘం ప్రతినిధులు వివరించారు. అనంతరం దరఖాస్తు డీడీఓ ఆమోదానికి వెళ్లి, అక్కడి నుంచి డిజిటల్ ఆమోదం కోసం తిరిగి ఐఏఏకు చేరుతుందని, తదుపరి డీడీఓ, హెచ్ఓఓ పరిశీలన అనంతరం డీటీఏకు పంపేలా ఆన్‌లైన్ ప్రక్రియను రూపొందించారని తెలిపారు. అయితే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో నియామకాలు పొంది ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో పనిచేస్తున్న ఉద్యోగులకు ఈ విధానం అమలులో అనేక సమస్యలు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. ముఖ్యంగా పోలీస్ శాఖలో ఉమ్మడి రాష్ట్రంలో ప్రస్తుత తెలంగాణ ప్రాంతంలో నియమితులైన ఉద్యోగులు తమ ఐఏఏ ధ్రువీకరణ పత్రాల కోసం తెలంగాణలోని సంబంధిత జిల్లాలు, బెటాలియన్లకు వెళ్లాల్సిన పరిస్థితి ఉందన్నారు. మార్గదర్శకాల్లోని అనుబంధం–2ఏ ప్రకారం అవసరమైన నాలుగు ధ్రువీకరణ పత్రాలను తెలంగాణలోని ఐఏఏ అధికారులు జారీ చేస్తారా లేదా అన్న అంశంపై స్పష్టత లేదని తెలిపారు.

తెలంగాణ అధికారుల నుంచి ధ్రువీకరణ పత్రాలు పొందినప్పటికీ, ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో పనిచేస్తున్న యూనిట్‌లో నిధి పోర్టల్ ద్వారా దరఖాస్తు సమర్పించినప్పుడు తదుపరి ఆమోద ప్రక్రియలో సమస్యలు తలెత్తే అవకాశం ఉందని వివరించారు. ఆంధ్రప్రదేశ్‌లోని డీడీఓలు తెలంగాణలోని ఐఏఏ అధికారులకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులను ఎలా పంపాలి? వారి డిజిటల్ ఆమోదం ఎలా పొందాలి? అనే అంశాలపై స్పష్టత ఇవ్వాలని కోరారు. పోలీస్ శాఖలోనే ఈ సమస్యను ఎదుర్కొంటున్న వారు సుమారు 500 నుంచి 600 మంది ఉన్నారని తెలిపారు.

ఇదే తరహా సమస్య 610 ఉత్తర్వుల ద్వారా ఆంధ్రప్రదేశ్‌కు వచ్చిన ఉద్యోగులకు కూడా ఎదురవుతోందని పేర్కొన్నారు. అంతర్ జిల్లా బదిలీల ద్వారా వచ్చిన ఉద్యోగుల విషయంలో ఇనిషియల్ అపాయింటింగ్ అథారిటీ ఎవరనే అంశంపై కూడా స్పష్టమైన మార్గదర్శకాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

డీ